www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 6-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 292 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 10.54 తదుపరి దశమి; నక్షత్రం: కృత్తిక రా. 7.29 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ. 8.01-9.32; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.21; అమృతఘడియలు: సా. 5.11-6.43; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హస్తిన పీఠం కమలానిదే!

ఢిల్లీలో ముగిసిన పోలింగ్.. 59.71% నమోదు

బీజేపీకి జైకొట్టిన పలు ఎగ్జిట్‌పోల్స్

కేజ్రీ, అతిషి, సిసోదియా ఓడిపోవచ్చన్న సర్వేలు

ఆప్‌నకు మొగ్గు చూపిన కేకే, వీ ప్రిసైడ్

కాంగ్రెస్ ఖాతా తెరవడం కష్టమే.. 8న ఫలితాలు

2



ఢిల్లీలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు

విద్యార్థినిపై టీచర్ల గ్యాంగ్ రేప్

గర్భం దాల్చిన 13 ఏళ్ల బాలిక

ముగ్గురు కామాంధులపై పోక్సో కేసు

తమిళనాడులో దారుణం

విద్యార్థి సంఘాల తీవ్ర ఆందోళనలు

సీఎం స్టాలిన్ సర్కారుకు మరింత సెగ

చెన్నై, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలను ఉద్ధరించాల్సిన ఉపాధ్యాయులే కీచకుల్లా మారిపోయారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థినిపై ముగ్గురు గురువులు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. దీంతో అభంశుభం తెలియని ఆ బాలిక గర్భం దాల్చింది. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేని

మిగతా 2వ పేజీలో...

టీటీడీలో హిందూయేతర ఉద్యోగులపై చర్యలు

తొలి విడతలో 18 మందిని గుర్తించిన బోర్డు.. ఇక నుంచి ఆలయాలు, ఉత్సవాల విధులకు దూరం పెడుతూ నిర్ణయం.. వీఆర్ఎస్ లేదా ఇతర శాఖలకు బదిలీ

త్వరలో అన్యమత ఉద్యోగులందరి గుర్తింపు

11న సీఎం చంద్రబాబు వద్దకు సమస్య

ఆయన సూచనల మేరకు బోర్డు నిర్ణయం

9





2

ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ మృతి

సంతాపం ప్రకటించిన ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ

నేటి సంక్షుభిత ప్రపంచంలో ఆగాఖాన్ శాంతి, కరుణ, సహనానికి ప్రతిరూపం: ఐరాస ప్రధాన కార్యదర్శి

ఆరోగ్యం, గృహ నిర్మాణం, విద్యారంగాల్లో 30కి పైగా దేశాల్లో ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ సేవలు





ఎస్పీ రాజశేఖర్‌బాబు

జగన్ హయాంలో అడ్డగోలుగా జరిగిన మద్యం దోపిడీ మూలాలను తవ్వి తీసేదిశగా కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మద్యం తయారీ, కొనుగోలు, సరఫరా, విక్రయాలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని 2019 అక్టోబరు నుంచి ఎన్నికల ముందు వరకు దోచేసిన వేల కోట్లకు సంబంధించిన అసలు లబ్ధిదారులకు ఉచ్చు బిగించే నిర్ణయం తీసుకుంది.

కిక్కు లెక్క తేల్చేస్తారు!

జగన్ మద్యం దోపిడీపై 'సిట్' ఏర్పాటు

సారథిగా బెజవాడ కమిషనర్ రాజశేఖర్‌బాబు

టీమ్‌లో 'రెడ్' టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బరాయుడు

మరో ఐదుగురు పోలీసు అధికారులు కూడా

అయ్యన్నార్ పర్యవేక్షణ.. ప్రతి శాఖా సిట్‌కు సహకరించాలి

ఎక్కడైనా సోదాలు చేయొచ్చు.. ఆధారాలూ సీజ్ చేయొచ్చు

ఎవరినైనా ప్రశ్నించవచ్చు.. అవసరమైతే అరెస్టూ చేయొచ్చు

పూర్తి అధికారాలు అప్పగింత.. ప్రతి 15 రోజులకు డీజీపీకి నివేదిక

గత సెప్టెంబరులో నమోదైన కేసు దర్యాప్తు ఇక వేగవంతం

రూ.3,113 కోట్ల కమీషన్ల బాగోతాన్ని వెలికితీయనున్న సిట్

అంతా చిక్కుకున్నట్లే!

సూత్రధారి రాజ్ కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులకు శ్రీముఖాలు?

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో అడ్డగోలుగా సాగిన మద్యం దోపిడీ కుంభకోణంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. దీనికి విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు (ఐజీ ర్యాంకు) సారథ్యం వహిస్తారు. ఎర్ర చందనం యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ ఎస్పీ

మిగతా 12వ పేజీలో...

రాష్ట్రమంతా ఒకే రైల్వే జోన్



కొత్తగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు.. ప్రధాన కేంద్రం విశాఖ

అటు సికింద్రాబాద్.. ఇటు ఒడిశాలో కలిసిన ఏపీ ప్రాంతాలన్నీ దీని పరిధిలోకి

వాల్తేరు డివిజన్ రద్దు ఆలోచనకు స్వస్తి

ఇక విశాఖ డివిజన్‌గా అందుబాటులోకి

ఫలించిన కూటమి ఎంపీల ఒత్తిడి

కొత్త జోన్‌తో డివిజన్లలో మార్పులు

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత

విజయవాడ డివిజన్ పరిధిలోకి కొత్తగా కొండపల్లి - మోటుమర్రి సెక్షన్

విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిధిలోని రైల్వే వ్యవస్థలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రాన్నంతా కలుపుతూ కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ కేంద్రంగా జోన్ కార్యాలయం పని చేస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అనేక తర్జనభర్జనలు, చర్చలు, ఒత్తిళ్ల అనంతరం కొత్త జోన్‌ను ఏపీ కోసం ఏర్పాటుచేయాలని

మిగతా 13వ పేజీలో...

'అమరావతి'కి హారతి..

దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల పునర్విభజనలో భాగంగా విజయవాడ డివిజన్‌లో మార్పులు జరగనున్నాయి. విజయవాడ డివిజన్‌ను నౌపడ వరకు పొడిగిస్తూ పాత డీపీఆర్‌లో పొందుపరిచారు. తాజాగా విశాఖ డివిజన్‌ను (కొన్ని కుదింపులతో పూర్వ వాల్తేరు డివిజన్) ప్రకటించడం వల్ల తిరిగి దువ్వాడ వరకు విజయవాడ డివిజన్ (పాత రూట్) పరిమితం కానుంది. అమరావతి రైల్వే లైన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి వరకు ఉన్న 65 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను విజయవాడ డివిజన్‌లో కలపనున్నారు. రాజధానిగా ఉండే అమరావతిలో నూతన రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం సరికాదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.



అమెరికా నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న పంజాబ్ మంత్రి కుల్దీప్ సింగ్

104 మంది తిరిగొచ్చారు

అమృత్‌సర్‌లో దిగిన అమెరికా విమానం

పంజాబీలు 30 మంది, హరియాణా-33, గుజరాత్-33

భారతీయులకు సంకెళ్లు వేసి అవమానించారు: కాంగ్రెస్

సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం. మోదీ సర్కారుపై విమర్శలు

ఆ ఫొటోలు ఫేక్ అని నిర్ధారణ.. అవి గ్వాటమాలాకు తరలించిన వారివి

అమృత్‌సర్, ఫిబ్రవరి 5: అమెరికా నుంచి 104 మంది భారతీయ అక్రమ వలసదారులతో బయల్దేరిన విమానం బుధవారం అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. సీ-17 సైనిక విమానం మధ్యాహ్నం 1.55 గంటలకు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అమెరికా నుంచి వచ్చిన వారిలో 30 మంది పంజాబ్‌కు చెందిన వారు కాగా.. హరియాణా, గుజరాత్‌కు చెందిన వారు 33 మంది చొప్పున ఉన్నారు. మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, చండీగఢ్ వాసులు ఇద్దరు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తొలుత, విమానంలో 205 మంది వస్తున్నట్లు వార్తలు రాగా.. ఇప్పుడు ఆ సంఖ్య 104 అని విశ్వసనీయ వర్గాల సమాచారం. అమృత్‌సర్ చేరుకున్న వారిలో 25 మంది మహిళలు, 12 మంది మైనర్లు ఉన్నారని.. వీరిలో నాలుగేళ్ల చిన్నారి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 48 మంది 25 ఏళ్లలోపు వారు ఉన్నట్లు సమాచారం. 11 మంది విమాన సిబ్బంది, వలసదారుల అప్పగింత కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు 45 మంది అమెరికా అధికారులు కూడా విమానంలో వచ్చినట్లు తెలిసింది. అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్ వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. అక్రమ వలసదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పంజాబ్

మిగతా 2వ పేజీలో...

హెచ్1బీ వీసాదారులకు ఇక్కట్లు!

ఆటో రెన్యువల్ కాలపరిమితి పెంపు

రద్దుకు రిపబ్లికన్ల తీర్మానం

గాజాను స్వాధీనపర్చుకొని అభివృద్ధి చేస్తాం: ట్రంప్



త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానమాచరిస్తున్న ప్రధాని మోదీ

కుంభమేళాలో మోదీ

త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

లక్నో, ఫిబ్రవరి 5: ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో పాల్గొన్నారు. గంగా, యమున, సరస్వతి నదులు కలిసిన త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానమాచరించారు. రుద్రాక్షలు ధరించిన ఆయన మంత్ర జపం చేశారు. అనంతరం గంగానదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పడవలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన పడవలోనుంచే భక్తులకు అభివాదం చేశారు. ఆ తర్వాత ప్రధాని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గంగా మాత ఆశీస్సులతో

మిగతా 2వ పేజీలో...

అయినా.. మనిషి మారలేదు!



ఊహాలోకంలోనే జగన్ విహారం

ఎన్నికలు ఇప్పుడొచ్చినా గెలుస్తాం!

30 ఏళ్లు నేనే ముఖ్యమంత్రిని

'జగన్ 2.0'లో కార్యకర్తలకు ప్రాధాన్యం

పార్టీ నేతల సమావేశంలో వ్యాఖ్యలు

13

పేదల పేరిట గద్దలకు

4.72 లక్షల ఎకరాల్లో ఉల్లంఘనలు

జగన్ జమానాలో అక్రమాలు

నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి 'అసైన్డ్' తొలగింపు

నిగ్గు తేల్చిన రెవెన్యూ శాఖ

అసైన్డ్ చట్టం కింద అక్రమార్కులపై కఠిన చర్యలకు ఆదేశం

బాధ్యులైన అధికారులపై కూడా

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

భూములు తిరిగి నిషేధిత జాబితాలోకి


జిల్లా కలెక్టర్లకు సీసీఎల్ఏ ఆదేశాలు

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పేరు పేదలది.. దండుకున్నదేమో పెద్దలు. నాడు జగన్ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల వ్యవహారంలో జరిగింది ఇదే. 20 ఏళ్ల కాలపరిమితి దాటిన అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి శాశ్వత హక్కులు కల్పిస్తామంటూ జీఓ 596 జారీ చేశారు. దీన్ని అడ్డం పెట్టుకొని 20 ఏళ్ల కాలపరిమితి దాటని భూములకు కూడా హక్కులు కల్పించారు.

నాడు 4.72 లక్షల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించినట్టు కూటమి ప్రభుత్వం గుర్తించింది. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. అక్రమాలకు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల అక్రమాల లెక్క తేలింది. పేదల భూములను పెద్దలు అడ్డగోలుగా కొట్టేశారు. వందలు, వేలు కాదు.. ఏకంగా 4.72 లక్షల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా జీఓ 596ను ఉల్లంఘించి మరీ నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించారు. రెవెన్యూ శాఖ ఈ మేరకు నిగ్గు తేల్చింది. అందులోనూ ఎన్నికల ముందు.. రోజుల వ్యవధిలోనే 25,284 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరగ్గా, ఇందులో 7,827 ఎకరాలు అడ్డగోలుగా చేశారని గుర్తించింది. ఈ అక్రమాలకు పాల్పడినవారిపై ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977 లోని సెక్షన్ 4 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని

మిగతా 12వ పేజీలో...

రీ సర్వే అప్పీళ్లు పరిష్కరించకుంటే సస్పెండ్ చేస్తా

పనితీరు మారకుంటే ఉపేక్షించేది లేదు

పనిచేయనివారికి సర్వీసులో రివర్షన్

ఆర్ఎస్ డీటీలకు సీసీఎల్ఏ హెచ్చరిక



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రులకు మంత్రి లోకేశ్ విన్నపం

ఏపీలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయండి

'పూర్వోదయ' కింద 5,684 కోట్లు ఇవ్వండి

పీఎంశ్రీ పథకం కింద మిగిలిన 1,514 పాఠశాలలను మంజూరు చేయండి

వర్సిటీల్లో వసతులకు 3,229 కోట్లివ్వండి

ఏపీలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయండి

మిట్టల్ స్టీల్‌కు సత్వరం అనుమతులివ్వండి

రాజ్‌నాథ్, ప్రధాన్, కుమారస్వామితో భేటీ

గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్‌తో చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు పెద్దఎత్తున నిధులిచ్చి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కేంద్ర మంత్రులకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన రెండో రోజు బుధవారం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, ధర్మేంద్రప్రధాన్, హెచ్‌డీ కుమారస్వామిలను కలిశారు. ఈ సందర్భంగా పలు అభ్యర్థనలను వారి ముందుంచారు. రక్షణరంగ పరికరాల తయారీలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు

మిగతా 12వ పేజీలో...

విశాఖలో త్వరితగతిన డేటా సిటీ ఏర్పాటుకు విన్నపం.. వేగంగా అనుమతులకు హామీ

మిర్చి ధర పతనం

సగానికి పడిపోయిన రేటు

అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన డిమాండ్

తక్కువకు అమ్మలేక గిడ్డంగులకు తరలింపు

3



సీమలో సాగుకు 7 గంటలే కరెంటు!

ఎస్పీడీసీఎల్ వివాదాస్పద నిర్ణయం.. అనంత, సత్యసాయి జిల్లాల్లోని కొన్నిచోట్ల రాత్రి పూట ఇవ్వాలని ఉత్తర్వు.. అది కూడా రెండు విడతల్లో

సూపరింటెండెంట్లకు సీజీఎం మెమో.. మంత్రి గొట్టిపాటి ఆగ్రహం

9 గంటల కరెంటు సీఎం నిర్ణయం.. ఆ మేరకు ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ

13

3 వేలకు ఏడాది టోల్ పాస్!

జాతీయ హైవేలపై ఏడాదంతా ప్రయాణం

15 ఏళ్ల పాటు జీవితకాల పాస్‌కు 30 వేలు

ప్రైవేటు కారు యజమానులకు కేంద్రం ఆఫర్

కార్లకు టోల్ రుసుము తగ్గించే యోచన?

2

విద్యార్థినిపై ముగ్గురు టీచర్ల గ్యాంగ్ రేప్

(మొదటి పేజీ తరువాయి)

అసహాయతలో ఉన్న బాలిక తల్లి.. ఆమెను నెలరోజుల పాటు స్కూలుకు సెలవు పెట్టించి అబార్షన్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో దారుణ ఘటన వెలుగు చూసింది. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా పోచంపల్లి గ్రామంలో ఈ దారుణ ఘటన జరిగింది. బాలిక తల్లి చెప్పింది విని ఆగ్రహించిన ఆ హెడ్మాస్టర్.. వెంటనే శిశు సంక్షేమ అధికారులకు ఆమెతో ఫిర్యాదు చేయించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఒక డిగ్రీ టీచర్ తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. దీంతో శిశు సంక్షేమ సంరక్షణ అధికారులు బర్గూర్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బాలికపై దారుణానికి ఒడిగట్టిన ఉపాధ్యాయులు చిన్నసామి(57), ఆర్ముగం(45), ప్రకాశ్(37)ను అరెస్ట్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారి తీసింది. సీఎం స్టాలిన్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. బాలికను కృష్ణగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమిళనాట వరుసగా అత్యాచార ఘటనలు చోటు చేసుకుంటుండడంతో స్టాలిన్ సర్కారు ఉక్కిరిబిక్కిరికి గురవుతోంది. గత ఏడాది డిసెంబరు 23న ప్రఖ్యాత అన్నామలై విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినిపై ఇద్దరు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

3 వేలకు ఏడాది టోల్ పాస్!

కారు యజమానులకు కేంద్రం ఆఫర్!!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రైవేటు కారు యజమానులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుంది. తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే కారు యజమానులకు టోల్ బాదుడు తగ్గనుంది. ఇలాంటి వారి కోసం ఏడాది పాటు చెల్లుబాటయ్యే 'టోల్ పాస్'ను అందుబాటులోకి తీసుకురానుంది. రూ.3000 చెల్లించి ఈ పాస్ తీసుకుంటే జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల మీదుగా ఎన్నిసార్లయినా ప్రయాణించవచ్చు. రూ.30 వేలు చెల్లిస్తే 15 ఏళ్ల పాటు హైవేలపై అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ ప్రతిపాదన కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ వద్ద తుది పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రైవేటు కారు యజమానుల నుంచి ప్రస్తుతం కిలోమీటరుకు వసూలు చేసే ప్రాథమిక టోల్ ధరను తగ్గించే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జాతీయ రహదారులపై స్థానికులు లేదా రోజూ ప్రయాణించే వాహనదారులకు ఒక్క టోల్ ప్లాజాకు మాత్రమే నెలవారీ పాస్‌లు జారీ చేస్తున్నారు. ఈ పాస్‌ల కోసం వాహనదారులు నెలకు రూ.340 చెల్లించాలి. అంటే ఏడాదికి రూ.4080 ఖర్చవుతుంది.

లోకం తీరు



మహాకుంభమేళాలో మోదీ

(మొదటి పేజీ తరువాయి)



అందరికీ ఆరోగ్యం, శాంతి, కలగాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. పవిత్ర స్నానమాచరించిన ఫొటోలు కూడా జత చేశారు. 90 నిమిషాల పాటు ఆయన మహాకుంభమేళాలో గడిపారు. మహాకుంభమేళా సందర్భంగా ఈ నెల పదవ తేదీ లోపు పాతికవేల మంది గిరిజనులు పుణ్యస్నానాలు చేయనున్నారు. నేటి నుంచి ఆదివాసీల పుణ్యస్నానాలు ప్రారంభమవుతాయని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగం వనవాసీ కళ్యాణ ఆశ్రమం తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం భారీ ఊరేగింపులతో శోభాయాత్ర నిర్వహిస్తామని వెల్లడించింది. పదవ తేదీ వరకు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆట, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపింది. మరోవైపు, మహాకుంభమేళాలో మౌని అమావాస్యనాడు జరిగిన తొక్కిసలాటకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని పంచ్‌దశ్నమ్ జునా అఖాడా మహామండలేశ్వర్ యతి నరసింఘానంద గిరి చెప్పారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తాను సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు రక్తంతో లేఖ రాసినట్లు వెల్లడించారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- బెంగళూరులో జరిగిన ఆరు విపక్ష పాలిత రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రుల సమావేశంలో తీర్మానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ముసాయిదా నిబంధనలను తక్షణం వెనక్కితీసుకోవాలని ఆరు విపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. ఈమేరకు.. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రులు/ప్రతినిధులతో బెంగళూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో 15 సూత్రాల తీర్మానం చేసినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ తెలిపారు. వర్సిటీల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాలకే కీలకపాత్ర ఇవ్వాలని ఆరు రాష్ట్రాల విద్యామంత్రులూ ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాఖ్య విధానంలో రాష్ట్రాలకు చట్టబద్ధంగా దఖలు పడిన హక్కులకు ఈ ముసాయిదా నిబంధనలు తీవ్రంగా విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు. వైస్‌చాన్స్‌లర్ల ఎంపిక నిమిత్తం 'సెర్చ్ కమ్ సెలెక్షన్ కమిటీ'ల ఏర్పాటుకు రాష్ట్రాలకున్న హక్కులను హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. నాన్-అకడమిక్ అభ్యర్థులను వీసీలుగా నియమించే వీలు కల్పించే నిబంధనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే.. వీసీల నియామకానికి సంబంధించి అర్హతలు, వారి పదవీకాలానికి సంబంధించి ముసాయిదాలో చేసిన ప్రతిపాదనలు ఉన్నత విద్య ప్రమాణాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని.. వాటిని పునఃపరిశీలించాలని కోరారు. ఇలా పలు ప్రతిపాదనలపై అభ్యంతరాలు తెలిపిన మంత్రులు.. యూజీసీ ముసాయిదా నిబంధనలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేరళ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల విద్యామంత్రులు ఆర్.బిందు, రోహిత్ ఠాకూర్, తెలంగాణ నుంచి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఝార్ఖండ్ నుంచి ఎమ్మెల్యే సుదివ్య కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా.. వచ్చే నెలలో కేరళలో కూడా ఇలాంటి సమావేశాన్నే నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు ఎంసీ సుధాకర్ తెలిపారు.

మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి: రాహుల్

పట్నా, ఫిబ్రవరి 5: జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని రాహుల్ పేర్కొన్నారు. సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని రాహుల్ పేర్కొన్నారు. దళితనేత, స్వాతంత్ర్య సమర యోధుడు జగ్‌లాల్ చౌదరీ జయంతి సందర్భంగా బుధవారం పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్‌ఎస్‌ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 200 బడా కంపెనీ యజమానుల్లో దళిత, గిరిజన, ఆదివాసీల నుంచి ఒక్కరూ లేరని, డబ్బులు మాత్రం అణగారిన వర్గాల ప్రజల జేబుల్లోంచి ఆ బడా బాబుల జేబుల్లోకి వెళతున్నాయని పేర్కొన్నారు.

మస్తాన్‌కు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్!

- అతని స్నేహితుడు ఖాజాకు కూడా.. ఇద్దరిపై కేసు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మస్తాన్ సాయి కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. మహిళల వ్యక్తిగత వీడియోలు సేకరించి, బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో మస్తాన్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మస్తాన్‌తో పాటు అరెస్టయిన ఖాజాకు పోలీసులు డ్రగ్స్ పరీక్షలు చేశారు. ఇద్దరికీ పాజిటివ్ రావడంతో వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. రిమాండు రిపోర్టులో పలు విషయాలు వెల్లడించారు. మస్తాన్ సాయితో పాటు ఆర్‌జే శేఖర్ బాషాపై లావణ్య బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అసలు లావణ్యకు, మస్తాన్ సాయికి ఎలా పరిచయం ఏర్పడింది? లావణ్యను కేసులో ఇరికించేందుకు మస్తాన్ సాయి, ఆర్‌జే శేఖర్ బాషా ఎందుకు ప్రయత్నించారు? లావణ్య ఆరోపణలపై మస్తాన్ సాయి ఏమంటున్నాడు? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫంక్షన్‌కు వెళ్లిన లావణ్య వీడియోలు తీసి..

మస్తాన్ రిమాండు రిపోర్టులో పోలీసులు కీలక విషయాలను ప్రస్తావించారు. ఉనీత్‌రెడ్డి అనే స్నేహితుడి ద్వారా మస్తాన్ సాయితో లావణ్యకు పరిచయమైంది. ఓ ఫంక్షన్‌కు మస్తాన్ ఇంటికి వెళ్లిన లావణ్య.. దుస్తులు మార్చుకుంటున్న సమయంలో వీడియో తీశాడు. వాటిని మస్తాన్ తన స్నేహితులకు కూడా పంపినట్లు రిపోర్టులో తెలిపారు. విషయం తెలిసిన లావణ్య.. అతనితో గొడవకు దిగింది. అప్పట్లో రాజ్‌తరుణ్ రాజీ చేసినట్లు పేర్కొన్నారు. మస్తాన్ వద్ద ఉన్న వీడియోలను రాజ్‌తరుణ్ డిలీట్ చేయించారు. కానీ, అప్పటికే ఆ వీడియోలను మస్తాన్ మరో హార్డ్ డిస్క్‌లో భద్రపర్చాడు. ఆ డిస్క్‌ను 2024 నవంబరులో లావణ్య తన ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి మస్తాన్.. లావణ్యను చంపించేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలీసులు తెలిపారు. మస్తాన్ తన ఇంట్లో ప్రతి శని, ఆది వారాల్లో డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవాడని, ఆ పార్టీల్లో కొందరిని టార్గెట్ చేసుకొని, రహస్యంగా నగ్న వీడియోలను రికార్డు చేసినట్లు విచారణలో గుర్తించారు. మత్తులోకి జారుకున్నాక అమ్మాయిలపై లైంగిక దాడికి పాల్పడేవాడని, ఆ వీడియోలతో బెదిరించి.. వారిని లోబర్చుకునేవాడని లావణ్య ఫిర్యాదులో పేర్కొంది.

సోషల్ మీడియాలో ఆడియో టేపులు వైరల్..

లావణ్య, మస్తాన్‌కు సంబంధించిన ఆడియో టేపులు సోషల్ మీడియా వైరల్‌గా మారాయి. ఒక ఆడియో టేపులో మస్తాన్, ఆర్‌జే శేఖర్ బాషాలు కలిసి లావణ్యను డ్రగ్స్ కేసులో ఇరికించాలని పథకం వేసిన సంభాషణలు ఉండగా, దీన్ని లావణ్య పోలీసులకు ఇచ్చింది. అదే సమయంలో లావణ్య, చింటూ, మరో యువతి కలిసి ఆర్‌జే శేఖర్ బాషాపై కక్ష తీర్చుకోవాలంటూ మాట్లాడిన సంభాషణలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

ఢిల్లీ పీఠం కమలానిదే!

కేజ్రీవాల్, అతిషి, సిసోదియా ఓడిపోవచ్చన్న ఎగ్జిట్ పోల్స్.. ఢిల్లీలో బీజేపీకి జైకొట్టిన సర్వే సంస్థలు

- ఆప్‌నకు మొగ్గు చూపిన కేకే, వీ ప్రిసైడ్
- ఈ నెల 8న ఎన్నికల ఫలితాలు




ఢిల్లీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటున్న రాష్ట్రపతి ముర్ము, తల్లితో పాటు పోలింగ్ కేంద్రంలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పీఠం కమలానిదేనని ఎగ్జిట్ పోల్స్ తేల్చేశాయి. హోరాహోరీగా సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కమలం విజయం సాధించబోతోందని సర్వే సంస్థలు ప్రకటించాయి. ప్రధాన సర్వే సంస్థలన్నీ బీజేపీకి జై కొట్టగా, కేకే, వీ ప్రిసైడ్ సర్వే సంస్థలు ఆప్ మరోసారి గెలుస్తుందని తేల్చాయి. కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరిచే అవకాశం కష్టమేనని తెలిపాయి. ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ మొదటి నుంచే పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లింది. ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు కూడా వార్డుల వారీగా ప్రచారం నిర్వహించాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు బీజేపీ తరఫున ప్రచారం చేశారు. ఫలితంగా 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని సర్వే సంస్థలు చెబుతున్నాయి.

ఆమ్ ఆద్మీ అవకాశాలకు కాంగ్రెస్ గండి

ఇండియా కూటమిలో కీలక భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఎన్నికల్లో వేర్వేరుగా బరిలో నిలిచాయి. ఆప్ కంటే ముందు సుదీర్ఘకాలం ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ తర్వాత గడిచిన రెండు ఎన్నికల్లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఈసారి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గత రెండు ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఓటు శాతం ఈ సారి పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆప్ ఓట్లను కాంగ్రెస్ చీల్చడం వల్ల బీజేపీ గెలుపు మరింత సులభమైందని విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ఓటు శాతం పెరిగినప్పటికీ సీట్లు మాత్రం వచ్చే అవకాశం లేదని సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ ద్వారా తెలుస్తోంది. మరోవైపు గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సరిగ్గా అంచనా వేసి దేశవ్యాప్తంగా పేరును సంపాదించుకున్న కేకే సర్వే మాత్రం అందరికంటే భిన్నంగా ఫలితాలను ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పార్టీ 44 స్థానాలతో మరోసారి అధికారంలోకి వస్తుందని, బీజేపీ కేవలం 26 స్థానాలకే పరిమితం అవుతుందని తెలిపింది. వీ ప్రిసైడ్ అనే సంస్థ కూడా 46 నుంచి 52 స్థానాలతో మరోసారి ఆప్ అధికారంలోకి వస్తుందని, బీజేపీ 18 నుంచి 23 స్థానాలతో సరిపెట్టుకుంటుందని తెలిపింది. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ముఖ్యమంత్రి అతిషి, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియాల విజయం కష్టమేనని కేకే సహా మరికొన్ని సర్వేలు తెలిపాయి. అసలు ఫలితాలు ఈ నెల 8న వెలువడతాయి. ఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని మొత్తం 70 నియోజకవర్గాల్లో బుధవారం ఓటింగ్ జరిగింది. 60.10 శాతం పోలింగ్ నమోదైంది. 699 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆమ్ ఆద్మీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, సీఈసీ రాజీవ్ కుమార్ సహా మరికొందరు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా ఢిల్లీకి వచ్చి భారత పౌరసత్వం పొందిన హిందువులు తొలిసారిగా ఓటేశారు.

ప్రధాన సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్

సర్వే సంస్థ	ఆమ్ ఆద్మీ	బీజేపీ	ఇతరులు
పీపుల్స్ పల్స్	10-19	51-60	0
పోల్ డైరీ	18-25	42-50	0-2
పీపుల్స్ ఇన్ సైట్	25-29	40-44	0-1
పీ మార్క్	21-31	39-49	0-1
టైమ్స్ నౌ	22-31	39-45	0-2
జేవీసీ	22-31	39-45	0-2
చాణక్య స్ట్రాటజీస్	25-28	39-44	2-3
మాట్రిజ్	32-37	35-40	0-1
డీవీ రీసెర్చ్	26-34	36-44	0
వీ ప్రిసైడ్	46-52	18-23	0-1
కేకే సర్వే	44	26	0

పీఓకేలోకి హమాస్

జైషే, లష్కర్ నేతలతో కశ్మీర్ సంఘీభావ సభలో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్.. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో తొలిసారి అడుగుపెట్టింది. ఫిబ్రవరి 5వ తేదీని కశ్మీర్ సంఘీభావ దినంగా పాకిస్థాన్ పాటిస్తుంది. ఈ సందర్భంగా రావల్‌కోట్‌లోని షాహిద్ సబీర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో జైషే మహమ్మద్(జేఈఎం), లష్కరే తాయిబా(ఎల్ఈటీ) ప్రధాన కమాండర్లతోపాటు హమాస్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఇరాన్‌లో హమాస్ ప్రతినిధి డాక్టర్ ఖలీద్ అల్ ఖుదామీ.. ఈ సమావేశంలో హమాస్‌కు ప్రాతినిధ్యం వహించారు. పీఓకేలో అడుగుపెట్టిన తొలి హమాస్ నేతగా నిలిచారు. హమాస్‌తో సంబంధం ఉన్న మరికొందరు పాలస్తీనా నేతలు కూడా ఖలీద్ వెంట ఉన్నారు. ఇక, జైషే చీఫ్ మసూద్ అజర్ సోదరుడు తల్హా సైఫ్, జైషే కమాండర్లు అస్గర్ ఖాన్ కశ్మీరీ, మసూద్ ఇలియాస్‌తోపాటు లష్కర్ కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కశ్మీర్ సహా అన్నింటిపై చర్చలు

- భారత్‌కు పాక్ ప్రధాని ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుదామంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌కు ప్రతిపాదన చేశారు. కశ్మీర్ సహా అన్ని అంశాలపైనా మాట్లాడుదామని సూచించారు. బుధవారం ముజఫరాబాద్‌లో జరిగిన పాక్ ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో ప్రతియేటా ఇక్కడ సమావేశాన్ని జరుపుతుంటారు. ఆయన ప్రసంగిస్తూ చర్చలు ద్వారానే కశ్మీర్ సహా అన్నిసమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు.

అంబేడ్కర్ గురుకులాల ప్రక్షాళన

- ప్రతి హాస్టల్లో రాజ్యాంగ నిర్మాత విగ్రహం
- 'సూర్యఘర్' ద్వారా రెసిడెన్షియల్స్‌లో వెలుగులు
- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా ప్రణాళికలు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ గురుకులాలను ప్రక్షాళన చేసేందుకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శ్రీకారం చుట్టారు. ఎస్సీ విద్యార్థులు చదివే అంబేడ్కర్ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఇప్పటికే సుమారు రూ.140 కోట్ల నిధులతో హాస్టళ్ల భవనాలు, రెసిడెన్షియల్ స్కూళ్ల మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సీ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ప్రతి అంబేడ్కర్ గురుకులంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గురుకులంలోనూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరీక్షించేలా ప్రత్యేక హాల్ నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి ఒక్కొక్క దానికీ రూ.5 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. గురుకులాలు, హాస్టళ్లలో మరుగుదొడ్లను భారీ సంఖ్యలో నిర్మించేందుకు స్వచ్ఛ భారత్ నిధులను వినియోగించనున్నారు. అదేవిధంగా అనారోగ్యం పాలైన విద్యార్థులను ఇళ్లకు పంపించేయకుండా.. రెసిడెన్షియల్ స్కూళ్లలో వైద్య సాయం అందించేందుకు సిబ్బందిని నియమించారు. వారికి ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు. ఇక, విద్యార్థులకు కేటాయించే బడ్జెట్‌ను అంచలంచెలుగా పెంచి మంచి ఆహారం అందించాలని భావిస్తున్నారు.

హాస్టళ్లన్నీ ఒకే చోట

గతంలో హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేసినప్పటికీ ఇంకా కొన్ని చోట్ల హాస్టళ్లు కొనసాగుతున్నాయి. పట్టణాల్లో, ఒక మోస్తరు జనాభా ఉన్న ప్రాంతాల్లో హాస్టళ్లన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించవచ్చని భావిస్తున్నారు. ముందుగా మంత్రి సొంత నియోజకవర్గంలో ఇలాంటి హాస్టళ్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 'సూర్యఘర్' పథకాన్ని అన్ని సాంఘిక సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో అమలు చేయాలని మంత్రి డోలా భావిస్తున్నారు. భవనాల పైకప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించా లని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో ప్యానల్ ఏర్పా టు చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం తీసుకోనున్నారు. గురుకులాలు, హాస్టళ్ల భవనాలపై ఏర్పాటు చేయనున్న సోలార్ ప్యానల్ వ్యయానికి సంబంధించి మంత్రి ఇప్పటికే చర్చలు జరుపుతున్నారు. ఎస్సీ విద్యార్థులకు సంబంధించిన హాస్టళ్లు, గురుకులాలు అయినందున ఎస్సీలకు అందించే విద్యుత్ సబ్సిడీని అందించవచ్చని భావిస్తున్నారు. నలుగురైదుగురు విద్యార్థులను ఒక కుటుంబంగా భావించి 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీని గురుకులాలకు అందించాలని ప్రభుత్వానికి సాంఘిక సంక్షేమశాఖ ప్రతిపాదించింది.

గాజాను స్వాధీనం చేసుకుంటాం

- నెతన్యాహుతో కలిసి ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: యుద్ధ కల్లోల గాజాను తాము స్వాధీనం చేసుకుని, అభివృద్ధి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మంగళవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో చర్చల అనంతరం వైట్‌హౌస్‌లో సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. "మేం(అమెరికా) గాజాను స్వాధీనం చేసుకుంటాం. అక్కడ ధ్వంసమైన భవనాల వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. యుద్ధం కారణంగా పేలకుండా మిగిలిపోయిన బాంబులను నిర్వీర్యం చేయాల్సి ఉంది. ఆ తర్వాత గాజాను ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటన గాజా చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు.

104 మంది తిరిగొచ్చారు

(మొదటి పేజీ తరువాయి)



భారతీయులను తీసుకువచ్చిన సీ-17 విమానం ఇదే

డీజీపీ తెలిపారు. అన్ని తనిఖీలు పూర్తి చేసిన తర్వాతే అక్రమ వలసదారులను వారి సొంత ప్రాంతాలకు పంపిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, అమెరికా నుంచి వెనక్కి పంపేసిన వలసదారులకు అండగా ఉండేందుకు పునరావాస నిధిని ఏర్పాటు చేయాలని ఉత్తర అమెరికా పంజాబీ అసోసియేషన్ (నాపా) పంజాబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రానికి మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా, అమెరికా అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించారు. 17,940 మందిని వెనక్కి పంపేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 104 మందిని వెనక్కి పంపించారు. ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గ్వాటమాలా, పెరూ, హోండూరస్ తదితర దేశాలకు తరలించింది. కాగా, అక్రమ వలసదారులంటూ భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి విమానంలో తరలించడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. అమెరికా నుంచి భారతీయులను అలా అవమానకరంగా విమానంలో తరలించిన ఫొటోలు చూసి, ఒక భారతీయుడిగా ఎంతో బాధపడ్డానని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం హెడ్ పవన్ ఖేరా చెప్పారు. 2013లో భారత దౌత్యాధికారి దేవయానికి సంకెళ్లు వేసి తనిఖీలు చేసి, అవమానించినప్పుడు నాటి యూపీఏ సర్కారు తీవ్రంగా స్పందించిందని గుర్తుచేశారు. ప్రధాని మన్మోహన్ కూడా అమెరికా చర్యను తీవ్రంగా ఖండించారన్నారు. అదేసమయంలో భారత పర్యటనకు వచ్చిన అమెరికా ప్రతినిధి బృందాన్ని కలిసేందుకు రాహుల్ గాంధీ, మీరా కుమార్‌లు నిరాకరించారని ఎక్స్‌లో పేర్కొన్నారు. చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసిన వలసదారుల ఫొటోలపై సోషల్‌మీడియాలో నెటిజన్లు మండిపడ్డారు. మోదీ సర్కారుపై విమర్శలు గుప్పించారు. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటోలు భారతీయులవి కావని, నకిలీవని తేల్చారు. అవి జనవరి 30న అమెరికా నుంచి గ్వాటమాలాకు తరలించిన అక్రమ వలసదారుల ఫొటోలని ఫ్యాక్ట్‌చెక్‌లో తేల్చారు.

హెచ్ 1బీ వీసాదారులకు ఇక్కట్లు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: హెచ్1బీ, ఎల్ వర్క్ పర్మిట్లపై అమెరికాలో పనిచేస్తున్న విదేశీయులకు ట్రంప్ సర్కారు భారీ షాక్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి! ఆ వీసాల ఆటో రెన్యువల్ కాలపరిమితిని 180 రోజుల నుంచి 540 రోజులకు పెంచుతూ బైడెన్ సర్కారు కిందటి సంవత్సరం డిసెంబరులో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ రిపబ్లికన్ సెనెటర్లు జాన్ కెనెడీ, రిక్ స్కాట్ ఇటీవలే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బైడెన్ హయాంలో సవరించిన ఈ నిబంధన జనవరి 13 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పుడా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే.. భారతీయులకే ఎక్కువ నష్టం కలుగుతుంది. ఎందుకంటే హెచ్1బీ, ఎల్ 1 వీసాలపై ఎక్కువగా వచ్చేది భారతీయులే. వర్క్ వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ కాలావధిని 540 రోజులకు పెంచడం ప్రమాదకరమని.. వలస చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా అమెరికన్లను సురక్షితంగా ఉంచాలన్న ట్రంప్ సర్కారు ప్రయత్నాలకు అది విఘాతం కలిగిస్తుందని కెనెడీ పేర్కొన్నారు. మరోవైపు.. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిషేధించే ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేయనున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. 'కీపింగ్ మెన్ అవుటాఫ్ వుమెన్స్ స్పోర్ట్స్' పేరుతో ఈ ఆర్డర్‌ను జారీ చేయనున్నారు.

ఆ పార్శిళ్లకు నో!

చైనాపై ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించిన మర్నాడే.. అమెరికా తపాలా శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. చైనా, హాంకాంగ్ నుంచి వచ్చే అన్ని పార్శిళ్లనూ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అయితే, మామూలు ఉత్తరాలు, ఉత్తరాలున్న కవర్లపై మాత్రం ఎలాంటి నిషేధమూ లేదని స్పష్టం చేసింది. 800 డాలర్ల కంటే తక్కువ విలువ ఉన్న ప్యాకేజీలను 'డి మినిమిస్' విధానం కింద అమెరికాలోకి సుంకాలు లేకుండా అనుమతించే విధానం ఇన్నాళ్లుగా అమల్లో ఉంది. అయితే, ఆ ప్యాకేజీల ద్వారా చైనా, మెక్సికో నుంచి డ్రగ్స్ అమెరికాలోకి దిగుమతి అవుతున్నాయని ఆరోపిస్తూ ట్రంప్ తాజాగా ఈ 'డి మినిమిస్' నిబంధనను రద్దు చేశారు.

ఆగాఖాన్ కన్నుమూత



పారిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు 'హిజ్ హైనెస్ ప్రిన్స్' కరీం అల్ హుస్సేనీ ఆగాఖాన్-4(88) పోర్చుగల్‌లోని లిస్బన్‌లో మంగళవారం మృతి చెందారు. స్విట్జర్లాండ్‌లో 1936 డిసెంబరు 13న జన్మించిన ఆగాఖాన్-4ని విద్యార్థిగా ఉండగా 20ఏళ్లకే ఆయన తాత(ఆగాఖాన్-3) తన వారసుడిగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింల 49వ ఆధ్యాత్మిక గురువుగా ప్రకటించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన ఆగాఖాన్-4 పెద్ద వ్యాపారవేత్తగా, దాతగా పేరుంది. సుదీర్ఘకాలం ఫ్రాన్స్‌లో జీవించిన ఆయన గత కొన్నేళ్లుగా పోర్చుగల్‌లో ఉంటున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఆయన మృతికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింలు సంతాపం పాటించారు. నేటి ప్రపంచంలో ఆగాఖాన్ శాంతి, సహనం, కరుణకు ప్రతిరూపమని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మంచి స్నేహితుడు, కారుణ్యశీలి అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కొనియాడారు. కాగా 1957 జూలైలో ఇంగ్లండు రాణి ఎలిజబెత్ ఆయనకు 'హిజ్ హైనెస్' గౌరవాన్ని ప్రకటించారు. మన దేశం 2015లో పద్మవిభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆయన స్థాపించిన 'ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్'అనే సేవా సంస్థ పేదల ఆరోగ్యం, గృహ నిర్మాణం, విద్య, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి 30కిపైగా దేశాల్లో పనిచేస్తోంది. దీని వార్షిక బడ్జెట్ ఒక బిలియన్ అమెరికన్ డాలర్లు. ఆయన పేరిట బంగ్లాదేశ్, తజకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి పలు దేశాల్లో పేదల కోసం ఆస్పత్రులు నిర్మించారు. ఇస్మాయిలీ ముస్లింలు భారత్‌తోపాటు తూర్పు ఆఫ్రికా, మధ్య, దక్షిణ ఆసియా, పశ్చిమాసియా దేశాల్లో ఉన్నారు. కాగా ఆయన మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన చేసిన కృషి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ.. ఆగాఖాన్ మృతికి విచారం వ్యక్తం చేశారు. కాగా ఆగాఖాన్-4 హైదరాబాద్ నగరాన్ని పలుమార్లు సందర్శించారు. కుతుబ్ షాహీల సమాధుల పునరుద్ధరణకు ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ద్వారా 2013లో చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లో పలు వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఆయన మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు.

నూతన ఆగాఖాన్‌గా రహీం అల్-హుస్సేనీ

కొత్త ఆగాఖాన్‌గా రహీం అల్-హుస్సేనీని నియమించారు. ఆగాఖాన్-4 కోరిక మేరకు ఆయన కుమారుడు రహీంను ఆగాఖాన్-5గా నియమిస్తూ ప్రకటన వెలువడింది. షియా ఇస్మాయిలీ ముస్లిం ఇమామ్‌ల పరంపరలో 50వ వారసుడు రహీం హుస్సేనీ.

ఇకపై రాతపూర్వక
ఆదేశాలే ఇస్తాం!

» అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మించిన భవనాల విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించినప్పటికీ.. భవనాలు కూల్చివేసిన కేసులో వివరణ ఇచ్చేందుకు నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ బుధవారం హైకోర్టు ముందు హాజరయ్యారు. ఆయన తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యం గత నెల 22న విచారణకు రాగా తదుపరి విచారణ వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కమిషనర్‌కు మౌఖిక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. విచారణను గత నెల 24కి వాయిదా వేశారని చెప్పారు. 23, 24 తేదీల్లో తాము ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోలేదన్నారు. అయితే.. దీనికి సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వనందున సంబంధిత అక్రమ నిర్మాణాలను గత నెల 27న అధికారులు కూల్చివేశారని వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత ఇకపై తామిచ్చే ఉత్తర్వులన్నీ లిఖిత పూర్వకంగానే ఇస్తామని స్పష్టం చేశారు. భవనాలు ఇప్పటికే కూల్చివేసిన నేపథ్యంలో వ్యాజ్యాలను డిస్పోజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అక్రమంగా నిర్మించిన భవనాలను 24 గంటల్లో కూల్చివేయాలని, లేకుంటే తామే కూల్చివేస్తామని నెల్లూరు మున్సిపల్ అధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ నెల్లూరు నగరానికి చెందిన సందిరెడ్డి ఈశ్వరమ్మ, చెరుకుపల్లి సాయమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమికి మద్దతు

» ఏపీ నిరుద్యోగ జేఏసీ

'కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై సానుకూలంగా ఉంది. పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో కూటమికి మద్దతు ఇస్తాం' అని ఏపీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్దిక్ తెలిపారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం ఆయన ఓ ప్రకటన చేశారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగాలకు కోచింగ్ ఇప్పించేలా గతంలో అమలు చేసిన విద్యోన్నతి పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాం' అని సిద్దిక్ తెలిపారు.



మిర్చి ధర పతనం

సగానికి పడిపోయిన రేటు.. అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన డిమాండ్

» తక్కువ ధరకు అమ్మలేక గిడ్డంగులకు తరలింపు

» యార్డులకు గణనీయంగా తగ్గిన సరుకు రాక

(అమరావతి, గుంటూరు-ఆంధ్రజ్యోతి)

ఓ వైపు పెట్టుబడుల భారం.. మరో వైపు తెగుళ్ల భయం.. వీటికితోడు మార్కెట్‌లో ధర లేక మిర్చి రైతులు మరింత సతమతమవుతున్నారు. నిరుడు క్వింటా రూ.35వేలుకుపైగా పలికిన ధర ప్రస్తుతం రూ.17 వేలలోపే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ లేకపోవడం, చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాలకు ఎగుమతులు మందగించడంతో ధరలు పతనమవుతున్నాయి. గతేడాది కన్నా ఈ ఏడాది చైనా ఆర్డర్లు చాలా తక్కువగా ఉండగా, బంగ్లాదేశ్‌లో ఇటీవల రాజకీయ అనిశ్చితి ఏర్పడి అంతర్జాతీయ వాణిజ్యం మందగించింది. ఈ కారణంగా మిర్చి మార్కెట్‌లో మాంద్యం ఏర్పడింది. 2024 ఖరీఫ్‌లో పండిన కొత్త మిర్చి మార్కెట్‌కు వచ్చే తరుణంలో ధర తగ్గడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. నిరుడు పండించి, కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరుకులో ఇప్పటికే కొంత అమ్మినా.. ఇంకా 25లక్షల బస్తాలు నిల్వ ఉన్నట్లు చెప్తున్నారు. ఈ సరుకునే రైతులు యార్డులకు తీసుకెళ్తున్నారు. కానీ గత కొన్ని రోజుల్లోనే మిర్చి ధరలు పడిపోవడంతో తక్కువ ధరకు అమ్మలేక రైతులు మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేస్తుండటంతో యార్డులకు సరుకు రాక గణనీయంగా తగ్గుతోంది.

తెగుళ్లతో 30% పెరిగిన పెట్టుబడులు..

రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మిర్చి అధికంగా పండుతోంది. గతేడాది దాదాపు 6లక్షల ఎకరాల్లో మిర్చి సాగవగా, ఈ ఏడాది 4 లక్షల ఎకరాలకే పరిమితమైంది. గత మూడేళ్లుగా నల్లతామర పురుగు, జెమినీ వైరస్ మిర్చి పైరును నాశనం చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం సాగైన మిర్చిలో మూడొంతులు తెగుళ్లతో తుడిచి పెట్టుకుపోయింది. ఈ తెగుళ్లను తట్టుకునే క్రిమిసంహారక మందులకు డిమాండ్ ఏర్పడటంతో రైతులకు పెట్టుబడులు 30% పెరిగాయి.

ఎకరాకు 3 లక్షల ఖర్చు

ఏడేళ్ల క్రితం ఎకరా మిర్చి సాగుకు రూ.లక్షలోపు ఖర్చయ్యేది. ఆ తర్వాత ఏటా పెట్టుబడి పెరిగిపోతోంది. తెగుళ్ల కారణంగా గత మూడేళ్లుగా పెట్టుబడి ఎకరాకు రూ.2.50 లక్షలకు మించి అవుతోంది. ఈ ఏడాదైతే రూ.3లక్షల దాకా ఖర్చవుతోందని రైతులు చెప్తున్నారు. ఇంత ఖర్చు పెట్టినా.. అతివృష్టి, అనావృష్టి, వాతావరణం అనుకూలించక ఎకరాకు 20-22 క్వింటాళ్లు దిగుబడి రావడం గగనమవుతోంది. నానా తిప్పలు పడి పండించిన మిర్చిని ప్రస్తుత ధరలకు అమ్మితే రైతులకు లాభం సంగతి ఎలా ఉన్నా.. నష్టం రాక మానదు. విత్తనం, నారు, నాట్లు, ఎరువులు, నీటి తడులు, పురుగు మందులు, కోత, గ్రేడింగ్ కూలి, గన్నీ బ్యాగ్స్, మార్కెట్‌కు తరలింపు.. ఇవన్నీ రైతు భరించాల్సిందే. తీరా యార్డుల్లో ధర లేకపోతే.. తిరిగి కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేయాల్సి వస్తోంది. అయినా సాంప్రదాయంగా వ్యవసాయం చేయడం, పంటలకు మంచి ధరలు వస్తాయన్న ఆశతో మిర్చి సాగు చేస్తున్నామని రైతులు అంటున్నారు.

వారంలోనే ధరల్లో భారీ వ్యత్యాసం..

రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో గతవారం రోజుల్లోనే మిర్చి ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది. కర్నూలు మార్కెట్‌లో గత నెల మొదటి వారంలో రూ.13,869 నుంచి రూ.14,869 వరకు ఉండగా, బుధవారం రూ.11,769 నుంచి రూ.13,001కు తగ్గింది. ఆదోని మార్కెట్‌లో రూ.10,100 నుంచి రూ.12,506 వరకు పలికింది. గుంటూరు యార్డులో తేజ రకం మిర్చి గతవారం రూ.13,500-19,500 ఉండగా, ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ.16,500 వరకు పలుకుతోంది. బాడిగ రకం గత వారంలో రూ.8,500 నుంచి రూ.15,500 ఉండగా, ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ.14వేలు వరకు పలుకుతోంది. హిందూపురం యార్డులో గత వారం రూ.13,500 నుంచి రూ.15వేలు వరకు ఉండగా, ఇప్పుడు రూ.7వేల నుంచి రూ.16,500 వరకు ఉంది. పిడుగురాళ్ల యార్డులో తేజ రకం గత వారం రూ.13,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. ఇప్పుడు రూ.13వేల నుంచి రూ.13,500కు తగ్గింది.

ధర తగ్గాక.. చైనా నుంచి ఆర్డర్లు..

మిర్చి ధర పడిపోయాక చైనా నుంచి ఆర్డర్లు మొదలయ్యాయి. తక్కువ ధరకు కొని నిల్వ చేసుకోవచ్చనే ఉద్దేశంతోనే చైనా నుంచి ఆర్డర్లు వస్తున్నాయని భావిస్తున్నారు. అక్కడి బయ్యర్లు గత వారం, పది రోజులుగా గుంటూరు జిల్లాలోని మిర్చి ఎగుమతిదారులకు ఫోన్లు చేస్తూ ఆర్డర్స్ పెడుతున్నారు. చైనాలో విరివిగా వినియోగించే తేజ, ఆర్మూరు వెరైటీలే కొనుగోలు చేస్తున్నారు. తేజ టాప్ క్వాలిటీ క్వింటా రూ.13,700, ఆర్మూరు వెరైటీ రూ.10 వేల నుంచి రూ.10,500 వరకు లభిస్తోంది. ఆయిల్స్ తయారీలో వినియోగించే ఈ వెరైటీల్లోని తాలు కాయలు క్వింటా రూ.6 వేల నుంచి రూ.7,500 వరకు లభిస్తున్నట్టు ఇక్కడి ఎగుమతిదారులు తెలిపారు. చైనా నుంచి నెలకు కనీసం 1000 కంటైనర్ల ఆర్డర్స్ వస్తాయని భావిస్తున్నారు. మరోవైపు బంగ్లాదేశ్ ఆర్డర్స్ అన్ని తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీకి తరలివెళ్లిపోతున్నాయి. గుంటూరు నుంచి లారీ కిరాయి రూ.15 వేలకు పైగా అదనంగా ఉండటమే దీనికి కారణం. ఖమ్మం మార్కెట్‌లో హమాలీ చార్జీలు కూడా తక్కువ. సీజన్‌లో నెలకు 150 లారీలకు పైగానే మిర్చి బంగ్లాదేశ్‌కు ఎగుమతి అయ్యేదని ఎగుమతిదారులు తెలిపారు.

రథసప్తమి ఉత్సవాల నిర్వహణ భేష్

» టీటీడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందన

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రథసప్తమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని, అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఊరేగే స్వామివారి కమనీయ రూపాన్ని దర్శించడానికి లక్షలాదిగా వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటంలో టీటీడీ సఫలీకృతమైంది, పవిత్ర దినాల్లో తిరుమలకు మరింతగా పోటెత్తే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించి చక్కని దర్శన భాగ్యం అందించేందుకు టీటీడీ చేస్తున్న కృషిని అభినందిస్తున్నాను.' అని సీఎం తన పోస్టులో పేర్కొన్నారు.

బోగస్ ప్రకటనలతో
మోసపోవద్దు

» నిరుద్యోగులకు ఏపీ

గ్రామీణాభివృద్ధి శాఖ హెచ్చరిక

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బోగస్ ఉద్యోగ ప్రకటనలు చూసి నిరుద్యోగులు మోసపోవద్దని, ఇలాంటి నకిలీ నోటిఫికేషన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం సూచించింది. నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ రిక్రియేషన్ మిషన్ పేరిట ఈ నెల 4న ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటూ వెలువడిన ప్రకటన బోగస్ అని స్పష్టం చేసింది. నిరుద్యోగులను మోసం చేయడానికే ఈ బోగస్ ప్రకటన జారీచేశారని, అలాంటి సంస్థ గానీ, విభాగం గానీ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖలో లేదని వెల్లడించింది.

మండిన ఎండ

» సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కోస్తాతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో బుధవారం వేడి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు కోస్తాలో సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీలు, రాయలసీమలో రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నందిగామలో వరుసగా రెండోరోజు 38.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో నాలుగైదు రోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని, తరువాత తేమ మేఘాలు ఆవరించి క్రమేపీ వేడి తగ్గుతుందని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. వేసవికి ముందు కొద్దిరోజులు ఇటువంటి వాతావరణం నెలకొనడం సాధారణమేనన్నారు.

ఎన్నికల కోడ్ నుంచి వక్ఫ్ బోర్డు సంస్థలను సడలించండి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నుంచి వక్ఫ్ సంస్థలను సడలించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్‌కు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ లేఖ రాశారు. వక్ఫ్ చట్టం, ప్రాపర్టీస్ లీజు రూల్స్‌లోని వక్ఫ్ బోర్డు అధికారాల ప్రకారం వివిధ వక్ఫ్ సంస్థల ఆస్తులను లీజుకు ఇవ్వాల్సి ఉందని బుధవారం ప్రకటనలో అజీజ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల పలుచోట్ల వక్ఫ్ టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' రద్దు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిలిపేస్తున్నట్లు ప్రణాళికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికల ముందు ఆ పార్టీ నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి తాము చేసిన పనులు చెప్పుకొనేందుకు, ఓటర్లను ఆకర్షించేందుకు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రభుత్వ సొమ్ముతో కరపత్రాలు, బుక్‌లెట్‌లు ముద్రించి భారీగా పంపిణీ చేశారు. ఈ పనికి సచివాలయ ఉద్యోగులను విస్తృతంగా వినియోగించుకున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలవడంతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వానికి.. ఈ కార్యక్రమాన్ని నిలిపేయాలన్న ఆలోచన ఆలస్యంగా తట్టింది. ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల తర్వాత 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిలిపేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

సీఈడీఎం స్టడీ మెటీరియల్ ఇవ్వండి: రూటా

సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్(సీఈడీఎం) ఆధ్వర్యంలో రూపొందించే స్టడీ మెటీరియల్‌ను ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు అందజేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం(రూటా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ కోరారు. ఈ ఏడాది పరీక్షలు మరో నెల రోజుల్లో ఉన్నా ఇంకా మెటీరియల్ అందలేదన్నారు.

కప్పట్రాళ్ల అటవీ భూముల్లో యురేనియం తవ్వబోమని
అసెంబ్లీలో తీర్మానం చేయాలి

» మానవ హక్కుల వేదిక డిమాండ్

» యురేనియం ప్రభావిత గ్రామాల్లో పర్యటించిన హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం



కప్పట్రాళ్ల గ్రామంలో ప్రజలతో సమావేశమైన మానవ హక్కుల వేదిక బృందం

కర్నూలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు భూముల్లో యురేనియం ఖనిజ నిక్షేపాల అంచనా సర్వే, తవ్వకాలు ఎట్టిపరిస్థితుల్లో చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు, కార్యదర్శి ఎం.దేవేంద్రబాబు, ఏపీ, తెలంగాణ సమన్వయక కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ బుధవారం డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) 13 మంది సభ్యుల బృందం ఈ నెల 2న కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, పి.కోటకొండ, నెల్లిబండ తదితర గ్రామాలను సందర్శించింది. కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయం కూడా ఆ బృందం పరిశీలించింది. రైతులు, ఆయా గ్రామాల ప్రజలతో బృందం సభ్యులు మాట్లాడారు. 2017లో స్థానికులకు తెలియకుండా, ఎలాంటి పారదర్శకత లేకుండా రహస్యంగా ఏఎండీ అణు ఖనిజ అంచనాల కోసం 20 బోర్లు తవ్వారని గుర్తు చేశారు. తాజాగా 68 బోర్లు తవ్వకాలకు ఏఎండీ మరో ప్రతిపాదనతో ముందుకు వచ్చిందని వివరించారు. ఇప్పటికీ యురేనియం ప్రభావిత గ్రామాల్లో అణు భయం ప్రజలను వెంటాడుతోందని, తాత్కాలిక ఉపశమనం కాకుండా, భవిష్యత్తులో అణు ఖనిజం సర్వేలు, తవ్వకాలు చేపట్టబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని మానవ హక్కుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. 1,157 ఎకరాల్లోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ పరివాహక ప్రాంతంలో గాజులదిన్నె జలాశయం ఉందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు గోనెగండ్ల, పత్తికొండ, డోన్, దేవనకొండ, కోడుమూరు నియోజకవర్గాల్లోని అనేక గ్రామాలు, పట్టణాలకు తాగునీరు అందిస్తుందన్నారు. ఆ అటవీ భూముల్లో వర్షపు నీరు కోటకొండ, మాచాపురం చెరువులకు చేరుతుందన్నారు. యురేనియం మైనింగ్ చేపడితే 25 గ్రామాల ప్రజల జీవనం ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కడప జిల్లా వేముల మండలం తుమ్మలపల్లెలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) యురేనియం తవ్వకాలు చేపట్టడంతో ఆ ప్రాంతం, అక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారని మానవ హక్కుల వేదిక సభ్యులు చెప్పారు. విద్యుత్ శక్తి భద్రత, వాతావరణ మార్పు అరికట్టడానికి అణు విద్యుత్ ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం చెబుతోందని, ఇది సరైంది కాదని, ఇతర పునరుత్పాదక విద్యుత్ వనరులతో పోలిస్తే అణు విద్యుత్ ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకున్నదని వివరించారు.

మద్యం 'గీత' పాలసీకి స్పందన కరవు

» 339 షాపులకు.. వచ్చింది 730 దరఖాస్తులే

» సగటున ఒక్కో షాపునకు 2.15 దరఖాస్తులు

» 87 షాపులకు ఒక్కరూ దరఖాస్తు చేయలేదు

» గడువు మూడు రోజులు పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కల్లు గీత కులాలకు ప్రకటించిన మద్యం షాపుల పాలసీకి స్పందన కనిపించడం లేదు. ఈ పాలసీ కింద 10శాతం(340 షాపులకు) ఎక్సైజ్ శాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. అందులో ఒక్క షాపునకు సీఎం హామీ మేరకు నేరుగా లైసెన్స్ ఇవ్వనున్నారు. మిగిలిన 339 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. బుధవారానికి దరఖాస్తుల గడువు ముగియాల్సి ఉండగా కేవలం 730 దరఖాస్తులే (ఒక్కో షాపునకు సగటున 2.15 దరఖాస్తులే) రావడంతో గడువును ఈనెల 8 వరకు పొడిగించారు. 9న దరఖాస్తులను పరిశీలించి, 10న లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నారు. 87 షాపులకు ఒక్క దరఖాస్తు కూడా పడలేదు. గీత కులాలకు ప్రకటించిన పాలసీలో రిజర్వేషన్ అమలు కావడంతో పాటు, లైసెన్స్ ఫీజును సగానికి తగ్గించారు. ఈ కారణాలతో కల్లుగీత కార్మికుల నుంచి దరఖాస్తులు భారీగా వస్తాయని అధికార వర్గాలు భావించాయి. కానీ, అనూహ్యంగా సగటున ఒక్కో షాపునకు మూడు దరఖాస్తులు కూడా రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 730 దరఖాస్తుల ద్వారా రూ.14.6కోట్ల ఆదాయం వచ్చింది. గడువు మూడు రోజులు పొడిగించడంతో దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

క్షేత్రస్థాయిలో ఒప్పందాలు

దరఖాస్తులు అతి తక్కువ రావడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. గత పాలసీలో భారీ పోటీ నేపథ్యంలో ఈసారి అందరూ కలిసి దరఖాస్తులు తగ్గించాలని ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అనేక ప్రాంతాల్లో స్థానిక పార్టీల నేతలు అందరికీ వాటా దక్కేలా ఒప్పందాలు చేసుకున్నారు. ఒకరిద్దరికే ఒక షాపు దక్కడం కంటే పది మందికైనా 10శాతం వాటా చొప్పున షాపులు దక్కేలా ఒప్పందాలు చేసుకుని తక్కువ దరఖాస్తులు వేశారు. మరోవైపు మద్యం వ్యాపారంలో ఆశించిన మేరకు లాభం రావట్లేదనే వాదన కూడా పోటీని కొంతమేర తగ్గించింది. గత పాలసీలో 20శాతం మార్జిన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా, చివరికి 10శాతమే వస్తోంది. ఇది కూడా దరఖాస్తులు తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది.

ఎక్సైజ్ మామూళ్లపై విచారణ!

» కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం

» విచారణాధికారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖలో మమూళ్ల వసూలుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 'పైవాళ్లకివ్వాలి..పదివేలు ఇవ్వండి' శీర్షికన ఈ వ్యవహారంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం ఆ శాఖలో కలకలం రేపింది. ఒక్కో షాపు నుంచి రూ.10వేలు చొప్పున వసూలు చేస్తున్న వ్యవహారం ఈ కథనంతో బట్టబయలైంది. ఇదే విషయంపై ఫిర్యాదులు రావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులు మరోసారి ఆరా తీశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మను విచారణాధికారిగా నియమించారు. కథనంలో పేర్కొన్న ఆరోపణలు సీరియస్‌గా ఉన్నాయని, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కుకు
ఐరన్‌ఓర్ కొరత లేదిక!

» కేంద్రం ఆదేశాలతో పూర్తిస్థాయిలో సరఫరా చేయనున్న ఎన్‌ఎండీసీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు ఐరన్‌ఓర్ కొరత తీరిపోనుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పూర్తిస్థాయిలో ఐరన్‌ఓర్ సరఫరా చేసేందుకు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)తో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కు) బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఆపరేషన్‌లోకి తేవడానికి ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పరిశ్రమకు నెలకు ఆరు లక్షల టన్నుల ఐరన్‌ఓర్ అవసరం అవుతుంది. ప్రతిరోజూ ఎనిమిది ర్యాక్‌ల (గూడ్సు రైళ్లు) సరఫరా చేయాలనే ఒప్పందం ఉండగా.. ఆరుకు మించి ర్యాక్‌లు రావడం లేదు. ఇకపై పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని కేంద్రం స్పష్టం చేయడంతో ఆమేరకు బుధవారం ఒప్పందం జరిగింది. 2027 మార్చి వరకు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది.

పెనుగొండ వాసవీ ధామ్ పీఠాధిపతిగా
శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామిజీ

» 8న పట్టాభిషేక అధిరోహణం

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అఖిల భారత వాసవీ పెనుగొండ ట్రస్ట్ క్షేత్రం పీఠాధిపతిగా శ్రీవిద్యాపీఠం (తెనాలి) శాలిగ్రామ మఠం పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ ఈ నెల 8వ తేదీన పట్టాభిషేక అధిరోహణం చేయనున్నారని ఆర్యవైశ్య మహాసభ జాతీయ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాసవీ శాంతి ధామ్ పీఠాధిపతులు కృష్ణానంద పురి స్వామీజీ 9 నెలల క్రితం శివసాయుజ్యం పొందిన నేపథ్యంలో ఉత్తరాధికారి అయిన ద్వితీయ పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ 8న పెనుగొండలో పలువురు స్వామీజీలు, పీఠాధిపతుల సమక్షంలో పట్టాభిషేక అధిరోహణ చేస్తారని తెలిపారు.

తెలంగాణలో చికిత్సకూ
రీయింబర్స్‌మెంట్

» ఏపీ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం వెసులుబాటు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నివాసం ఉంటున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవల్లో రాష్ట్ర ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. ఏపీ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ) గుర్తించిన ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు బుధవారం మెమో ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఏపీ డీఎంఈ గుర్తించి 11 ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటేనే ఏపీలో మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే... అక్కడ నివాసం ఉంటున్న ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ డీఎంఈ గుర్తించిన ఆస్పత్రుల్లో కూడా చికిత్స తీసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అక్కడ వారికి అయ్యే వైద్య ఖర్చుకు సంబంధించిన బిల్లులను ఏపీలో రీయింబర్స్‌మెంట్ చేసుకోవచ్చని తెలిపింది.

ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు పెరగాలి: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవారం ఈ-శ్రమ్ పోర్టల్‌కు సంబంధించి రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.5 కోట్ల మందిని ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిష్టర్ చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు 81.52 లక్షల మందిని రిజిస్టర్ చేశారని, మిగతా వారు కూడా త్వరగా రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోర్టల్‌లో రిజిస్టర్ అయితే కలిగే ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనం దక్కుతుందని, దీని కోసం ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్మికుడు ప్రమాద వశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షల బీమా దక్కుతుందని, ఒకవేళ అంగవైకల్యం చెందినా రూ.1 లక్ష వరకూ లభిస్తుందని సీఎస్ తెలిపారు.

మహిళా సంఘాలకు
నాబార్డు సాయం 10 కోట్లు

» సెర్ప్, నాబార్డు మధ్య కుదిరిన ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్).. నాబార్డుతో కీలక ఒప్పందం చేసుకుంది. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో నాబార్డ్ ఏపీ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహెరా, సెర్ప్ సీఈవో వాకాటి కరుణ.. ఈ ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని మహిళలకు వ్యాపార కార్యకలాపాల్లో శిక్షణ, వ్యవసాయ కార్యక్రమాల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు రూ.10.19 కోట్ల ఆర్థిక సాయం నాబార్డు నుంచి అందనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎవరికీ పట్టని బర్మా!

ఉక్రెయిన్, గాజా యుద్ధాల గురించి ఆ మాత్రమైనా పట్టించుకున్న మిగతా ప్రపంచం, పేదదేశం కావడంవల్లనేమో మయన్మార్‌లో సైనికపాలకులకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాపోరాటాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి, దేశాన్ని సైనికపాలకులు హస్తగతం చేసుకొన్న ఈ నాలుగేళ్ళలో మయన్మార్‌లో పరిస్థితులు బాగా దిగజారాయి. సాగుతున్న అంతర్యుద్ధంలో సైనిక ప్రభుత్వం మరింత బలహీనపడిందన్న వార్తలు వినబడుతున్నా, ఎవరిదో ఒకరిది పైచేయిగా సమీపకాలంలో పోరు ముగిసే సూచనలైతే లేవు.

నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్ఎల్‌డి) నాయకురాలు ఆంగ్‌సాన్ సూచీ మరోమారు మరింత మెజారిటీ సాధించడం మయన్మార్ సైనికాధికారులు సహించలేకపోయారు. నామమాత్రపు ప్రజాస్వామ్యాన్నీ, పరిమిత అధికారాలనూ ఇచ్చినా ప్రజలు ఆమెకు తిరిగి ఘనంగా పట్టం కట్టడం వారికి నచ్చలేదు. ఆమె మాటకు అడ్డంకొట్టగల, ప్రతీ నిర్ణయాన్నీ సమీక్షించి, నిలిపివేయగల విశేషాధికారాలు వారివద్దనే ఉన్నా, ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకున్న ప్రేమాదరాలతో మలివిడతలోనూ ఆమె బలంగా నెగ్గుకురావడంతో సైనికాధికారులకు బెంగపట్టుకుంది. ఆమె కొనసాగితే తమ ఉనికికి ముప్పువస్తుందని భయపడ్డారు, అర్థరాత్రి కుట్రతో అధికారంనుంచి దించేసి, తిరిగి నిర్బంధంలోకి నెట్టేశారు. పదవినైతే లాక్కున్నారు కానీ, ఆ తరువాత దేశవ్యాప్తంగా రేగిన పోరాటాలను వారు నియంత్రించలేకపోయారు. దేశం నలుమూలల్లోనూ వేర్వేరు ఆశలూ లక్ష్యాలతో వివిధ సంస్థలు సాగిస్తున్న పోరాటాలతో దేశం కల్లోలంలోకి జారిపోయింది. త్రీ బ్రదర్‌హుడ్ అలయెన్స్ గొడుగుకింద మూడు గ్రూపులు ప్రధానంగా సైన్యంతో పోరాడుతున్నాయి. భారత్–బంగ్లా సరిహద్దుల్లోని రఖైన్ ప్రాంతంమీద అరకన్ ఆర్మీ ఆధిపత్యం సాధించింది. దీనిసాయంతో చిన్ బ్రదర్‌హుడ్ అలయెన్స్ అనే సంస్థ చిన్ రాష్ట్రం మీద పట్టుసాధించింది. రఖైన్–చిన్ ప్రాంతాలు మిజోరం, మణిపూర్‌తో సరిహద్దులు పంచుకుంటున్నందున ఈ అంతర్యుద్ధం ప్రభావాన్ని మనం అనునిత్యం భరిస్తున్నాం. తిరుగుబాటుదారులతో సహా సామాన్యజనం నుంచి సైనికులవరకూ అంతా హద్దులు దాటివస్తున్నారు. వేలాదిమంది చిన్–కుకీలు ఆశ్రయం పొందుతూంటే, పోరాటంలో ఉన్నవారిని వెనక్కునెట్టడం నిత్యకృత్యంగా సాగుతోంది. చైనా సరిహద్దులోని షాన్ ప్రాంతం మరో రెండు సాయుధ సంస్థల చేతుల్లో ఉంది. సైనికపాలన తొలగి, సూచీ నాయకత్వంలో తిరిగి ప్రజాప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నవారు సైతం ఆయుధాలు పట్టి ఈ పోరాటంలో భాగస్వాములుగా ఉన్నారు.

ప్రస్తుతం దేశంలోని అధికభాగం తిరుగుబాటుదారుల హస్తగతమైపోయిందని, సైనికపాలకుల చేతిలో ఐదోవంతు కూడా మిగల్లేదని వార్తలు వస్తున్నాయి. ఇది పూర్తిగా నిజమైనా కాకున్నా, చైనా ఆర్థిక, ఆయుధసాయంతో సైనిక ప్రభుత్వం ఆఖరువరకూ తన ఆధిపత్యం నిలబెట్టుకొనే ప్రయత్నంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది. తిరుగుబాటుదారులపక్షం వహిస్తున్నారన్న పేరిట గ్రామాలకు గ్రామాలు తగలబెడుతోంది. ఈ అంతర్యుద్ధం కారణంగా నలభైలక్షలమంది నిరాశ్రయులైనారని, సగం జనాభా దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నదని అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. రఖైన్ వంటి రాష్ట్రాలు ఆకలితో అల్లాడిపోతున్నాయని, రోహింగ్యాలు అటు సైన్యానికీ, ఇటు అరాకన్ ఆర్మీకీ మధ్య నలిగిపోతున్నారని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రధాన నగరాలు ఇంకా సైన్యం అధీనంలోనే ఉన్నందున, బలవంతపు నియామకాలతో బలాన్ని పెంచుకుంటున్నందునా సమీపకాలంలో యుద్ధం ఆగే సూచనలైతే లేవు. గద్దెదిగడం ఇష్టంలేక, ఓటమిని జీర్ణించుకోలేక ప్రతీకారవాంఛతో రగిలిపోతున్న సైన్యం మరింత అమానవీయంగా ప్రవర్తిస్తోంది. సైనికపాలకుల మధ్య లుకలుకలు ఆరంభమైనాయన్న వార్తల నేపథ్యంలో మిగతా ప్రపంచం మయన్మార్‌మీద దృష్టిసారించాల్సిన తరుణం ఇది. సైనికపాలకులకు కొన్ని రాయితీలు, రక్షణలకు హామీ పడుతూ త్వరితగతిన దారికి తీసుకురావడం అవసరం. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్టుగా సైనికపాలకులు ఒక కొత్తనాటకానికి ఈమధ్యనే తెరదీశారు. సామాన్యజనం, తిరుగుబాటుదారులు గత అనుభవాల దృష్ట్యా దీనిని పూర్తిగా తిరస్కరిస్తున్నారు. 82 శాతం సీట్లు గెలుచుకున్న ఆంగ్‌సాన్ సూచీని మూడునెలల్లోనే గద్దెదింపిన సైనికపాలకులు తిరిగి ఎన్నికల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఏ మాత్రం విశ్వసనీయతలేని ఈ ఎన్నికలు జరిగి కూడా ప్రజలకు కానీ, ప్రజాస్వామ్యానికి కానీ ప్రయోజనం ఉండదు.

అపర చాణుక్యుని తికమక రాజకీయం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ఈ ముచ్చట. ఆయన గత సార్వత్రిక ఎన్నికల్లో 60 శాతం ఓట్లతో ఘన విజయం సాధించిన కూటమికి నాయకుడు. ఇంత విజయానికి కారణం, చంద్రబాబు ప్రతిభ గోరంత మాత్రమేననీ, దానికి అసలు కారణం కొండంత జగన్ ప్రతిభేననీ అంటారు కొందరు పరిశీలకులు. పరస్పర విరుద్ధంగా కనిపించే మరో మాట కూడా వారే చెబుతారు. ప్రధాని మోదీ ఢిల్లీ లడ్డు లాంటివాడట. హిందీలో ఓ సామెత ఉంది. ఢిల్లీ లడ్డూని తిన్నవాడు పశ్చాత్తాపపడతాడు; తిననివాడు కూడా పశ్చాత్తాపపడతాడట. మోదీతో మైత్రి వల్ల కూటమికి 65–70 శాతం రావాల్సిన ఓట్లు, 60 శాతానికి పడిపోయాయన్నది వారి అంచనా. అయితే, దీనికి అవతలి పార్శ్వం కూడా ఉంది. కేంద్రంలో పాతుకున్న మోదీతో శత్రుత్వం వహిస్తే, చంద్రబాబు గెలవడం అసాధ్యమని కూడా వారు అంచనా వేశారు. మోదీతో పొత్తువల్ల జరిగే నష్టం కంటే, శత్రుత్వం వల్ల జరిగే నష్టం ఎక్కువ అని సకాలంలో గ్రహించిన చంద్రబాబు, మోదీని కౌగిలించుకొన్నాడు, అంటారు.


ఈ తర్కం సరే. ఆయన సలాం కొట్టక తప్పని పరిస్థితుల్లో సలాం కొడుతున్నాడు. సరే. సాష్టాంగపడడం అవసరమా? సాష్టాంగం కూడా సరే. మోదీని ఎదిరిస్తున్న వ్యక్తులపై బురదచల్లడం అవసరమా? ఆయన్ని చాణుక్యుడు అంటారు గదా! ఢిల్లీ పోయి కేజ్రీవాల్‌ని తిట్టిపోయడంలో గల చాణక్యం ఏమిటో మనకి అర్థంకాదు. చంద్రబాబుగారూ, ఒక్క రూపాయి ఆధారం లేకుండా మిమ్మల్ని జైల్లో కుక్కినట్టే, ఒక్క పైసా ఆధారం చూపకుండా సిసోడియానూ, కేజ్రీవాల్‌నూ కూడా జైల్లో ఉంచారు గదా! ఢిల్లీలో మీ 'చాణక్యం' ఏ రకంగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను, లేదా మీ పార్టీ ప్రయోజనాలను నెరవేరుస్తుంది? ఆంధ్రప్రదేశ్ పట్ల, ఎంతో కొంత సానుభూతి ఉన్న నాలాంటి పరిశీలకులకు మీ అపర 'చాణక్యం' అర్థమై చావడం లేదు. మీ కోసం ప్రాణాలిచ్చే మీ అనుయాయులకైనా అర్థమౌతోందా? మీకు తోడు, మీ ఉప చాణుక్యుడు పవన్ కళ్యాణ్ సనాతనవాదం కోసమూ, మోదీ కోసమూ తన ప్రాణాలు అర్పిస్తా అని శపథాలు చేస్తున్నాడు.

ఈ పాటికి జైలు ఊచలు లెక్కబెడుతూ ఉండాల్సిన ఓ ఘనుడు మరోసారి రాష్ట్రాన్ని చెరబట్టడానికి కాచుకొని ఉన్నాడు. రాష్ట్రంలో కనీసం ఒక్క శాతం ఓట్లు కూడా లేని మోదీ దాన్ని గుప్పిట్లో పెట్టుకొన్న తీరు చూసి కడుపు నిండిపోతోంది. ఈ మొత్తం దృశ్యం గజిబిజిగానూ ఉంది. తికమకగానూ ఉంది. ఆంధ్రప్రదేశ్ అదృష్టమే అదృష్టం!

– ఎ. గాంధి, సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్

కులాల సంగతులతోనే సర్వేకు సార్థకత!





■ రాహుల్ కుమార్

షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. నిస్సందేహంగా స్వాగతించాల్సిన పరిణామం ఇది. 30 ఏళ్లుగా వివిధ రూపాల్లో తెలుగునాట అనేక ఆందోళనలకు కారణమై ఎన్నో చిక్కుముడులున్న సమస్య పరిష్కారానికి ఒకదారి ఏర్పడింది. ఏ జటిల సమస్యకైనా నూటికి నూరుపాళ్లు అందరికీ ఆమోదకరమైన పరిష్కారం ఉండదు. మొత్తం ఎస్సీలను మూడు సమూహాలుగా చేసి 1, 9, 6 శాతం చొప్పున రిజర్వేషన్లను కేటాయించటంపై అసంతృప్తులూ అసమ్మతులూ ఇప్పటికే కొన్ని వినిపిస్తున్నాయి. ఇవి రానున్న రోజుల్లో ఏ రూపం తీసుకుంటాయో ఇప్పుడే చెప్పలేం. కాలక్రమేణా సద్దుమణగనూ వచ్చు. కొత్త వాదనలతో కొంత కాలం కొనసాగనూ వచ్చు!

ఏ సామాజిక సమస్యా నిరంతరం వాద ప్రతివాదాలతో, సంఘర్షణాత్మకంగా కొనసాగాలని ఎవ్వరమూ కోరుకోం. సమస్యలను సాధ్యమైనంతమేరకు తక్కువ అసమ్మతితో పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలనే అనుకుంటాం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని చెబుతూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు కొన్ని హెచ్చరికలనూ షరతులనూ పెట్టింది. కుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదన్నది అందులో ప్రధానమైంది. రిజర్వేషన్లు వర్తింపచేసే అన్ని రంగాల్లో ఒక కులం బాగా వెనుకబడి ఉందని గణాంకాల ఆధారంగా నిర్ధారించుకుని ఆ వెనుకబాటుని అధిగమించటానికి ఎంత శాతం రిజర్వేషన్లు అవసరమో అంత శాతం మాత్రమే ఉండేలా చూడాలనీ స్పష్టంచేసింది. జనాకర్షణ రాజకీయాల కోసం రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించకుండా ముందుగా కట్టడి చేసే ఉద్దేశంతో సుప్రీంకోర్టు దీన్ని నిర్దిష్టంగా పేర్కొంది. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా దీనికి భిన్నంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే కోర్టుకు రావచ్చనీ స్పష్టంచేసింది. న్యాయ సమీక్ష ముందు రిజర్వేషన్ల శాతాలు నిగ్గుతేలాల్సి వస్తుందనీ హెచ్చరించింది.

ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడాల్లేకుండా జనాకర్షణ, ఓట్ల రాజకీయాల కోసం నిర్హేతుక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పెట్టిన షరతులూ చేసిన హెచ్చరికల్లో ఔచిత్యం లేదని అనుకోలేం. ఈ నేపథ్యంలో వర్గీకరణ సమస్యపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక మొత్తాన్ని ప్రజల ముందు పెట్టి ఉంటే సముచితంగా ఉండేది. నివేదికలో ప్రధాన అంశమైన రిజర్వేషన్ల శాతాన్ని ఆమోదించిన తర్వాత ఆలస్యం చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండకూడదు. రిజర్వేషన్ల శాతం నిర్ధారించటానికి ప్రాతిపదికగా ఉన్న సమస్త సమాచారాన్ని వెంటనే బయటపెట్టటం వలన అపోహలూ అపార్థాలూ తొలగిపోతాయి.

సరైన గణాంకాలు ఉండకపోవటం మన సమాజంలో పెద్ద సమస్య. ప్రజాధనాన్ని ఎంతో ఖర్చుపెట్టి సేకరించిన గణాంకాలను ఆ ప్రజలకే వెల్లడించని సంఘటనలు మనకు చాలా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేనే దీనికి నిదర్శనం. ఎంతో ఆర్భాటంగా, దేశంలోనే కనీవినీ ఎరగని రీతిలో సర్వేని చేపడుతున్నామని చెప్పి దాని గురించి అధికారికంగా ఒక్కమాటైనా మాట్లాడకుండా ఏళ్లపాటు మౌనం వహించటాన్ని ప్రజాస్వామిక నైతికత దృష్ట్యా ఏ మాత్రం సమర్థించలేం. ఎన్నో వైపుల నుంచి ఎందరో ఆ సర్వే ఫలితాలు వెల్లడించాలని కోరినా ఏళ్లపాటు కిమ్మనలేదు. వర్గీకరణపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా దాన్ని చక్కటి రంగులతో, గ్రాఫ్‌లతో కూడిన సంక్షిప్త నివేదికను అనధికారికంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. రాజకీయాల కోసం సర్వేలను సమయానుకూలంగా దాచిపెట్టటమూ వెల్లడిచేయటమూ చేస్తారనటానికి ఇంతకంటే నిదర్శనం ఉండదు.

విద్య, ఉద్యోగాలు, పదవుల్లో వివిధ కులాలకు దక్కిన ప్రాతినిధ్యంపై 1990ల నుంచి రాజకీయంగానూ ఇతరత్రానూ విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. వర్గీకరణ సమస్య కూడా ఆ చర్చల నుంచి ఊపిరిపోసుకుని ఆందోళనబాటను తీసుకుంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మాల, మాదిగలతో పాటు ఇతర చిన్నకులాలకు దక్కిన ప్రాతినిధ్యం వెల్లడైతే మన సమాజంలో మార్పుల తీరుతెన్నులూ తెలుస్తాయి. వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం.

ఎస్సీల వర్గీకరణ సమస్య ఉమ్మడి రాష్ట్రంలో ఊపిరిపోసుకుంది. కులగణన సమస్య అలా కాదు. దేశవ్యాప్తంగా కులగణన అవసరంపై ఉధృతంగా ప్రచారం చేసి దాన్నొక రాజకీయ అజెండాగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ కులగణన గురించి మాట్లాడని రోజు లేదు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిపోయిన ఉన్నతాధికార వర్గంలో గుప్పెడుమంది బీసీల తలరాత రాస్తున్నారనీ అనేక సందర్భాల్లో విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టి సామాజిక న్యాయానికి చరిత్రాత్మక రీతిలో శ్రీకారం చుట్టి దేశగతినే మార్చివేస్తామనీ చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కులగణన విషయంలో ముందుండి మార్గదర్శకంగా నిలబడతాయని కూడా ప్రకటనలు చేశారు.

ఇందులో భాగంగానే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను పూర్తిచేసింది. కొంతమేరకు ఫలితాలను వెల్లడించింది. సమాచారం పాక్షికంగా వెల్లడించటంతో తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని ఇప్పటికీ పూర్తిగా తెలుసుకునే అవకాశం లేదు. ఒక్క కులాల వారీ జనాభాకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయపరమైన వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్పారు. గోప్యత దృష్ట్యా వ్యక్తిగత వివరాలు వెల్లడించలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పటాన్ని ఒకకోణం నుంచి విమర్శించలేం! ఫలానా వ్యక్తికి ఇన్ని ఆస్తులు ఉన్నాయి.. ఇన్ని వాహనాలు ఉన్నాయి.. ఇన్ని భూములు ఉన్నాయి. ఇన్ని భవనాలు ఉన్నాయి.. అని పేరుతో సహా వెల్లడిస్తే సమస్య వస్తుంది. గోప్యతకు భంగం కలుగుతుంది. కులాల వారీ జనాభా ఇవ్వటానికీ ఏ కులం వారు ఉద్యోగాల్లో ఎంత మంది ఉన్నారో చెప్పటానికీ వివిధ స్థాయిల్లో రాజకీయ పదవుల్లో ఎందరున్నారో తెలపటానికి అభ్యంతరం ఏమిటో అర్థం కాదు. కనీసం బిహార్ ప్రభుత్వం 2023లో వెల్లడించిన కులగణన వివరాల స్థాయిలో ఇవ్వటానికి వెనుకాముందు ఆడితే కాంగ్రెస్ సామాజిక న్యాయ అజెండాకు సార్థకత ఉండదు.

కాంగ్రెస్ పార్టీ తాను చేపట్టదలచిన సర్వే పేరులోనే ఏ విషయాలను సేకరిస్తామో స్పష్టంచేసింది. 'సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి, రాజకీయ, కుల సర్వే' పేరిట ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారంలో రిజర్వేషన్, నాన్ రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన ప్రజల శాతాన్ని మాత్రమే ప్రకటించారు. దీని వల్ల సర్వే లక్ష్యంగా పేర్కొన్న ఆరు అంశాల్లో ఏదీ స్పష్టంగా తెలియదు. అవసరమైన పక్షంలో మాత్రమే వ్యక్తిగతమైన సమాచారం మినహా మిగతా సమాచారాన్ని వెల్లడిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. సర్వే సమాచారాన్ని క్రోడీకరించి మొత్తం ఆరు అంశాలకు సంబంధించిన వివరాలను నిర్దిష్టంగా ఫలానా తేదీ లోపల వెల్లడిస్తామని స్పష్టం చేయలేదు. మంత్రులు కూడా ప్రభుత్వ పథకాల అమలులో సర్వే సమాచారాన్ని ఉపయోగించుకుంటామని మాత్రమే చెబుతున్నారు.

తెలంగాణ సమాజమే కాదు.. దక్షిణాది రాష్ట్రాలన్నీ 1990ల నుంచి వేగంగా అనేక సామాజిక మార్పులకు లోనవుతున్నాయి. బీసీలు రాజకీయ చైతన్యపరంగానే కాదు.. విద్యా, ఉద్యోగ విషయాల్లో పోటీపడటంలో వెనుకంజ వేయటం లేదు. తమకు కేటాయించిన రిజర్వేషన్లకు మించి ఓపెన్ కేటగిరీలో ప్రతిభను ప్రదర్శించి విద్యారంగంలోనూ, ఉద్యోగాల్లోనూ స్థానాలను సంపాదించుకుంటున్నారు. గడిచిన నాలుగైదు సంవత్సరాల్లో వైద్య సీట్లను చూసినా ఇది అర్థం అవుతుంది. ఇటీవల గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హులైన వారి జాబితా చూసినా ఇది తెలుస్తుంది. ఉద్యోగాల విషయంలోనూ ఈ సామాజిక మార్పు కనపడుతుంది. పంచాయతీ సంస్థల్లోనూ రిజర్వేషన్లకు మించి కొన్నిచోట్ల రెట్టింపుగా పదవులను దక్కించుకుంటున్నారు.

పోటీపడి ఉద్యోగాలను దక్కించుకోవటం ఆహ్వానించే పరిణామమైనా దానికి సంబంధించి కూడా పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయి. బీసీలకు సంబంధించి కూడా మూడునాలుగు కులాలు మాత్రమే ముందున్నాయా అన్నది తెలుసుకోవటం కూడా కీలకం. బిహార్ సర్వే వల్ల వెల్లడైన నిజం అదే. ఓబీసీల్లోని నాలుగు కులాలే ఉద్యోగాలు, పదవుల్లో సింహభాగాన్ని అక్కడ దక్కించుకున్నాయి. సంఖ్యరీత్యా ఎక్కువున్న ఈబీసీలకు (ఎక్స్‌ట్రీమ్లీ బాక్‌వర్డ్ క్లాస్) అతి తక్కువ స్థాయిలో ప్రాతినిధ్యం ఉంది. ఇలాంటి అసమానతలను సరిదిద్దటానికి ప్రజల ముందు సర్వేకు సంబంధించిన సమగ్ర సమాచారం పెట్టటం చాలా అవసరం. నిజానికి బిహారు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచితే కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్త సామాజిక అజెండా ప్రచారానికి బాగా పనికి వస్తుంది.

> **వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం.**

సామాజిక, ఆర్థిక, కుల సర్వేలకు సంబంధించి సమాచారం వెల్లడించటానికి రాజకీయ సమస్యలు ఉంటాయి. కాదనలేం. కర్ణాటకలో ఎప్పుడో సిద్ధమైన కుల సమాచారాన్ని ఇప్పటికీ అక్కడ వెల్లడి చేయలేకపోతున్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య ఈ విషయంలో ఏకాభిప్రాయంలేదు. నిజానికి తెలంగాణలో చేపట్టిన అంత సమగ్రంగానూ అక్కడ సర్వే చేపట్టలేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రెండో దఫా (2009) అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్త సామాజిక, ఆర్థిక, కులగణనను చేపట్టింది. కానీ ఆ ఫలితాలను వెల్లడించలేకపోయింది. 5 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. కులాలకు సంబంధించి ఆ సర్వే నిరుపయోగమని తదనంతరం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేవలం ఆర్థికపరమైన సమాచారం మాత్రమే ఉపయోగమని పేర్కొంటూ దాన్ని మోదీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచింది.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు చేసిన కులాల లెక్కింపును ఆధారం చేసుకునే ఇప్పటివరకూ ఎవరి సంఖ్య ఎంతో తెలుసుకుంటున్నామనీ తాము తెలంగాణలో చేసిన సర్వేతో ఆ ఇబ్బంది తొలగిపోయిందనీ రేవంత్‌రెడ్డి అన్నదాంట్లో నిజముంది. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ఆ కుల లెక్కలు అందరికీ అందుబాటులో ఉంచింది. ఇప్పుడు కావాల్సింది ఆ అందుబాటే! సామాజిక మాధ్యమాల విజృంభణ వల్ల కులాలకు సంబంధించి వెల్లడించని సమాచారంతో చేటు ఎక్కువ! ఫలితం తక్కువ!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

చార్జీలను తగ్గించడమే 'ఉచితం'!

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మధ్య మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల వల్ల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను తక్షణమే అమలు చేయటం కష్టమని వెల్లడించారు. అయితే ఈ మహిళా ఉచిత బస్సు ప్రయాణం బదులు వైసీపీ ప్రభుత్వం పెంచిన చార్జీలని గత తెలుగుదేశం ప్రభుత్వ స్థాయికో, నష్టం వచ్చినా ప్రభుత్వమే భరిస్తూ ఇంకా సాధ్యమైన మేర తగ్గిస్తే ప్రయాణికులందరికీ లాభమే గాక ప్రజా రవాణా పెరిగి ట్రాఫిక్ ఇక్కట్లు, వాహన ప్రమాద మరణాలు, జల, వాయు కాలుష్యాలు తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుంది. విదేశీ చమురు దిగుమతుల భారమూ తగ్గుతుంది. కనుక ఈ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలి. మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం అని ఊరించిన కర్ణాటక ప్రభుత్వం కూడ పెరిగిన ఉచితాల భారాన్ని చార్జీలను పెంచి, ప్రజలపై మోపబోతుందనే వార్తలు వచ్చాయి.

ఇకనైనా మన రాష్ట్ర ప్రభుత్వం ఉచితాల మాయ నుంచి బయటపడి తక్షణ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. ప్రభుత్వాలు భారీగా పెంచిన జీతభత్యాల ఫలితంగా ఖజానాపై వ్యయం పెరిగి లక్షలాది ఖాళీలను భర్తీ చేయలేక పోవటంతో, తగినంత యువ సిబ్బంది లేక అధికారులు, ఉద్యోగులు తరచూ క్షేత్ర స్థాయిలో పర్యటించకపోవటంతో పురపాలన గాడి తప్పింది. కనుక ఇకనైనా వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలి. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వ ప్రతి నిర్ణయాన్ని రాద్ధాంతం చేసే అలవాటు మానుకోవాలి. పెన్షన్, రేషన్ కార్డులు వంటి వాటిలో అక్రమాలపై విచారణ జరిపించాలని భావిస్తుంటే పేదలపై పిడుగు అంటూ కొందరు అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు, అసలు ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి రేషన్ కార్డు కావాలని డిమాండ్ చేస్తున్నందునే తెల్ల రేషన్ కార్డులు తీసుకోవటం, ఫలితంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టటం చూస్తున్నాం. అవసరమైన సంక్షేమ పథకాలను నిజమైన పేదలకే వర్తింపజేస్తూ, ఇలా ఆదా చేసిన ప్రజాధనంతో గత ప్రభుత్వం భారీగా పెంచిన చార్జీల భారం తగ్గిస్తే అన్ని వర్గాల ప్రజలూ హర్షిస్తారు.

– తిరుమలశెట్టి సాంబశివరావు
నరసరావుపేట

రాజమహేంద్రిలో రూపుదాల్చిన ఆంధ్రత్వం

రాజమహేంద్రవరం పేరు తలచుకుంటే తెలుగు వారి మనస్సు ఆనందంతో పులకించిపోతుంది. వేదంలా ప్రవహించే గోదావరి, రాజరాజనరేంద్రుడు, నన్నయ్య, కందుకూరి, చిలకమర్తి, శ్రీపాద, మధునాపంతుల మొదలైన మహోదయుల మహోజ్వల వారసత్వం, సాంస్కృతిక వైభవం, చారిత్రక నేపథ్యంలో అంతర్జాతీయ యశస్సు నార్జించిన దామెర్ల రామారావు చిత్రకళా వైభవం మన మనస్సుల్లో తటిల్లమంటుంది.

ఆధునిక సంప్రదాయ చిత్రకళా రీతుల్ని సమన్వయించి, పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహాకళాకారుడు దామెర్ల రామారావు. దేవతల సృష్టికర్త, ఆధునిక భారతీయ చిత్రకళా బ్రహ్మగా కీర్తి పొందిన రాజా రవివర్మ మోడల్‌ను ఎదురుగా పెట్టుకుని చిత్రాలు రచించినట్టే మన దామెర్ల స్త్రీని మోడల్‌గా పెట్టి నగ్నచిత్రాల్ని తొలిసారి సృజించిన ధీశాలి. రూప చిత్రాలనే కాదు, ప్రకృతి దృశ్యాలకు, పౌరాణిక కథలకు, సామాజిక జీవనానికి అందమైన ప్రతిరూపాలను ఆయన సృజించారు.

రామారావు తండ్రి ఆయుర్వేద వైద్యులు వెంకటరమణారావు, తల్లి లక్ష్మీదేవి గృహిణి. ఆ దంపతుల తొమ్మిది మంది సంతానంలో రామారావు రెండవవారు. మేనమామ గాడిచర్ల సత్యనారాయణ చిత్రకళోపాధ్యాయుడు. పసిప్రాయం నుండి రామారావును ఆయన ప్రోత్సహిస్తుండేవారు. ఆంధ్రావనిలో ప్రముఖ నాటక కళాకేంద్రంగా రాజమహేంద్రవరం వర్ధిల్లుతున్న కాలమది. హిందూ నాటక సమాజం నాటకాలకు అవసరమైన తెరలు రూపొందించేందుకు బెంగుళూరు నుండి ఎ.ఎస్.రాం అనే చిత్రకారుడ్ని తీసుకొచ్చారు. రాజమండ్రిలోని ఔత్సాహిక చిత్రకారులకు ఈ దృశ్యాత్మక తెరల రూపకల్పన కళ స్ఫూర్తి కలిగించింది. దామెర్ల కూడా చదువు సంధ్యలు మాని ఆ కళని నిశితంగా పరిశీలించేవాడు.

ఆ రోజుల్లోనే ఆంగ్లేయుడు ఆస్వాల్డ్ జెన్నింగ్ కూల్డ్రే రాజమండ్రి ప్రభుత్వ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఆయన గాయకుడు, నటుడు, రచయిత, చిత్రకారుడు కూడా. ఆ కళాశాలలో చదువుతున్న దామెర్ల సోదరుడు వెంకటరావు, తన తమ్ముడు రామారావును కూల్డ్రేకు పరిచయం చేశాడు. రామారావు చిత్రించిన చిత్రాలు చూసి ఆ కళాభిజ్ఞుడు ముగ్ధుడయ్యాడు. అర్జునుడికి ద్రోణుని వలె రామారావుకు కూల్డ్రే లభించాడు. రామారావుతో పాటు వరదా వెంకటరత్నం, కవికొండల వెంకటరావు, అడవి బాపిరాజు, అంకాల వెంకట సుబ్బారావులకు కూల్డ్రే చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చేవారు.

ఒకసారి కూల్డ్రే రామారావును వెంటబెట్టుకుని అజంతా, ఎల్లోరా గుహలకు వెళ్లారు. వర్షం వల్ల స్టేషన్‌లో సామాను ఉంచి, స్కెచ్ పుస్తకాలతో గుహలకు వెళ్లారు. చిన్న వయసులో ఉన్న రామారావు, కూల్డ్రేతో నడవలేకపోయారు. కూల్డ్రే ఆప్యాయంగా రామారావును తన భుజాలపై ఎత్తుకొని అజంతా గుహలను చూపించారు. బ్రిటిష్ దొరతనం వ్యక్తి, ప్రభుత్వోద్యోగి అయినప్పటికీ కూల్డ్రే ఎలాంటి భేషజం చూపించకపోవడం అసామాన్య విషయం. ఈ గురుశిష్యుల గాఢమైత్రికి, అనురాగానికి ప్రతీక వారి అజంతా సందర్శన. ఈ ఇరువురి అనుబంధం చరిత్రలో అరుదైన సంఘటన.

రామారావులోని విద్యా నిష్ఠ, చిత్రకళా కృషిని మరింతగా ప్రోత్సహించేందుకై కూల్డ్రే మహాశయుడు అతని కుటుంబ సభ్యుల్ని ఒప్పించి 1916 జూలైలో ముంబైలోని సుప్రసిద్ధ సర్ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్సుకు పంపారు. కళాశాల డీన్ సిసిల్ బర్న్సుకు ఒక లేఖ రాశారు. కూల్డ్రే లేఖతో పాటు తన వెంట తీసుకెళ్లిన చిత్రాలను రామారావు బర్న్సుకు చూపించాడు. ఆ చిత్రాలను చూసిన డీన్ రామారావుకు సరాసరి 3వ సంవత్సరంలో ప్రవేశం కల్పించారు. నేరుగా మూడవ సంవత్సరంలో ప్రవేశం కల్పించడం అసాధారణ విషయం.

> **ఆధునిక, సంప్రదాయ చిత్రకళా రీతుల్ని సమన్వయించి, పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహాకళాకారుడు దామెర్ల రామారావు. రాజమండ్రి పరిసరప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు ఆయన తన చిత్రాలలో చూపించారు. ఆ చిత్రాలలో మానవ రూపాలు లయబద్ధంగా, సహజ సుందరంగా ఉంటాయి. తెలుగువారి ఔన్నత్యమైన రామారావు చిత్రాలను జాతీయ సంపదగా ప్రభుత్వం ప్రకటించాలి.**



తదనంతర కాలంలో ప్రముఖ చిత్రకారుడు అయిన పద్మశ్రీ రవిశంకర్ రావెల్‌తో ఆ కళాశాలలో రామారావుకు పరిచయమేర్పడింది. సెలవు దినాల్లో రామారావు నాసిక్, లోనావాలా, కళ్యాణ్, కర్లా తదితర ప్రాంతాలకు వెళ్ళి స్కెచ్‌లు చిత్రించేవారు. తర్వాత మరో మిత్రుడు బధేకాతో కలిసి గుజరాత్‌లో రామారావు పర్యటించారు. కధియవాడ్‌లో గొల్ల పడుచులు, గిర్నాడ్ అడవుల సుందర దృశ్యాల్ని నీటి రంగుల్లో చిత్రించాడు గుజరాత్ పర్యటనలో ఆయన చిత్రించిన 'కుంజవనం' లండన్‌లో ప్రదర్శింపబడి, ఘనమైన ప్రశంసల నందుకున్నది.

ఆ రోజుల్లోనే విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ గుజరాత్‌లోని దక్షిణామూర్తి విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తుండగా, రామారావు సాధారణ తెల్ల కాగితంపై రవీంద్రుని రూపచిత్రం పెన్సిల్ స్కెచ్ గీసి చూపించి, ఆయన ఆశీస్సులు పొందాడు. గురుదేవ్ ఆహ్వానం మేరకు రామారావు శాంతినికేతన్ సందర్శించాడు.

1919 జూన్‌లో రామారావుకు సత్యవాణితో వివాహమయింది. అప్పటికి ఆమె వయస్సు 12 సంవత్సరాలే. భార్యను నమూనాగా తీసుకొని రామారావు 'పెళ్ళికూతురు', 'సీమంతం' తదితర చిత్రాల్ని చిత్రించాడు. తర్వాత సంవత్సరం జరిగిన తుది పరీక్షల్లో రామారావు కళాశాలలో సర్వ ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యాడు.

తర్వాత దేశమంతటా పర్యటించి, వివిధ ప్రాంతాలలోని చిత్రకళా రీతులను అధ్యయనం చేశాడు. వెళ్లిన ప్రతిచోట తన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశాడు. కలకత్తాకు చెందిన ఓరియంటల్ సొసైటీ నిర్వహిస్తున్న కళాప్రదర్శనకు తన 'ఋష్య శృంగబంధనం', 'తూర్పు కనుముల్లో గోదావరి' చిత్రాలు ఇచ్చారు. 'ఋష్యశృంగ బంధనం'కు వైస్రాయ్ నగదు బహుమతి లభించింది. ప్రదర్శనకు స్వయంగా వచ్చిన వైస్రాయ్ లార్డ్ రీడింగ్ రామారావు చిత్రాల్ని ఆసక్తితో చూసి 'గోదావరి' చిత్రాన్ని కొనుగోలు చేశాడు.

1922లో దేశం అంతా పర్యటించి వచ్చిన రామారావు రాజమండ్రిలో స్థిరపడ్డారు. మిత్రులు వరదా వెంకటరత్నం, భగీరధి, చేమకూర, బుచ్చి కృష్ణమ్మ తదితరులతో కలసి 'ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్'ను స్థాపించారు. ఈ కాలంలోనే రామారావు 'సిద్ధార్థ రాగోదయం' చిత్రించారు. ఆయన చిత్రించిన 'భారతి' దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన మాసపత్రిక 'భారతి'కి ముఖచిత్రమయింది.

తను స్థాపించిన 'ఇండియన్ ఆర్ట్స్' సంస్థ ద్వారా రామారావు 1923, 1924 సంవత్సరాలలో రాజమండ్రిలో జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించారు. ఆ కాలంలోనే ఆయన 'కృష్ణలీలలు', 'అజంతా విహార్', 'కపోతాలు' చిత్రించాడు. కృష్ణలీలలు ఢిల్లీలో ప్రదర్శింపబడి, అక్కడ నుండి లండన్‌కు చెందిన ఇంపీరియల్ గేలరీ ఆఫ్ ఆర్ట్స్‌లో కూడా ప్రదర్శితమైంది. భారతదేశం ఎన్నుకున్న పన్నెండు చిత్రాల్లో ఇది ఒకటి. ఈ చిత్రం గురించి 'ది బ్రిటీష్ ఎంపైర్ రివ్యూ' ప్రత్యేకంగా ప్రశంసించింది.

పాశ్చాత్య శైలికి, భారతీయ సంప్రదాయాన్ని జోడించి కొత్త శైలిని రామారావు సృష్టించారు. ఆయన తన చిత్రాల్లో రాజమండ్రి పరిసరప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు చూపించారు. దేశీయ పద్ధతిలో ప్రాథమిక రంగుల్ని చదునుగా, సుకుమారంగా వేసేవాడు. ఆయన చిత్రాల్లో మానవ రూపాలు లయబద్ధంగా, సహజ సుందరంగా ఉంటాయి. ఆయన నీటి, నూనె రంగులు, పేస్టిల్స్‌ను కూడా చిత్రీకరణకు వాడేవారు.

రామారావు జీవించింది కేవలం 28 సంవత్సరాలు మాత్రమే. ఈ స్వల్ప కాలంలో ఆయన చిత్రించిన కళాఖండాలు ఎన్నో. వీటిలో కొన్ని అమ్మగా, మరికొన్ని బహుమతులకు ఇవ్వగా, మరికొన్ని మాయంకాగా 34 నూనె, 129 నీటి రంగుల చిత్రాలు, 250 పెన్సిల్ స్కెచ్‌లు, 28 స్కెచ్ పుస్తకాలు మిగిలాయి. ఇవన్నీ ప్రస్తుతం రాజమండ్రిలోని గోదావరి రైల్వేస్టేషన్ వద్ద గల దామెర్ల రామారావు స్మారక ప్రభుత్వ చిత్రకళా మందిరంలో ఉన్నాయి. 1954లో ఈ మందిరాన్ని వరదా వెంకటరత్నం నేతృత్వంలో దామెర్ల అభిమానులు నిర్మించారు. తెలుగు వారి తొలి చిత్రకళా మందిరం కూడా ఇదే. ప్రముఖ చిత్రకళాభిమాని కల్యాణవతారం లలితకళా అకాడమీ సహకారంతో గ్యాలరీలోని చిత్రాలన్నిటినీ ఒక సి.డి.గా రూపొందించారు. ప్రఖ్యాత దర్శకులు సంజీవరెడ్డి పాతికేళ్ల క్రితం 'రిథమ్ ఆఫ్ లైఫ్' లఘు చిత్రాన్ని నిర్మించగా అది ఉత్తమ డాక్యుమెంటరీ పురస్కారం పొందింది. నీటి రంగుల్లో వందేళ్ల క్రితం రామారావు చిత్రించిన చిత్రాలు ఇంకా అలాగే ఉండాలనుకోవడం అత్యాశ అవుతుంది. వాటిని పరిరక్షించడానికి అవసరమైన కృషి కళాకారులు, కళాభిమానులు, ప్రభుత్వం కలిసికట్టుగా చేయాలి. ఆయన మరణించి వందేళ్ళు అవుతున్నా, ఆయన చిత్రాల్ని గురించి మాట్లాడుకుంటున్నామంటేనే వాటి గొప్పతనం అర్థం అవుతుంది.

1925లో సతీమణి సత్యవాణితో కలిసి తిరుపతి వెళ్లి, ఆలయం, పరిసరాలకు సంబంధించిన అందాల్ని తన స్కెచ్ పుస్తకంలో ప్రతిరూపించారు. తిరుగు ప్రయాణంలో అనారోగ్యానికి గురై, మశూచి కారణంగా కన్నుమూశారు. తెలుగువారి ఔన్నత్యమైన రామారావు చిత్రాలను జాతీయ సంపదగా ప్రభుత్వం ప్రకటించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. అంతేకాక ఆయన పేరిట ఉన్న గ్యాలరీని (చిత్రకళా మందిరాన్ని) సాంకేతిక శాఖ నుండి తప్పించి విద్య, సాంస్కృతిక శాఖకు అప్పగించాలి. ఈ శత వర్ధంతి సందర్భంలోనైనా ఈ కోరికను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తుందని ఆశిద్దాం.

■ సుంకర చలపతిరావు
(నేడు దామెర్ల రామారావు శత వర్ధంతి)



మార్చి 1 నుంచి జరిమానా పెంపు

వరుస తనిఖీలతో నగరవాసుల్లో మార్పు

84 శాతం మంది హెల్మెట్‌ధారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో హెల్మెట్ జరిమానా మరింత కఠినం చేయనున్నారు. ఇప్పటి వరకు విధిస్తున్న జరిమానాకు ఈనెలఖరుకు స్వస్తి చెప్పాలని విజయవాడ పోలీసులు నిర్ణయించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు మార్చి 1 నుంచి రూ.1,000 జరిమానా విధించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు బుధవారం ప్రకటించారు. నగరంలో డిసెంబరు 19వ తేదీ నుంచి హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదాల్లో జరుగుతున్న మరణాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించడంతో పోలీసు అధికారులు దిద్దుబాటు చర్యగా ఈ తనిఖీలకు శ్రీకారం చుట్టారు.

మార్పు మంచిదే..

నగరంలో వరుస తనిఖీలతో వాహనదారుల్లోనూ మార్పు వచ్చింది. పోలీసులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిశీలించినప్పుడు సుమారు 84 శాతం మంది హెల్మెట్ ధరిస్తున్నట్టు తేలింది. హెల్మెట్ ధరించని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు ఇప్పటి వరకు రూ.135ను జరిమానా విధించేవారు. ఇతర ఉల్లంఘనలు ఉన్నప్పుడు రూ.1,150 వసూలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం కొన్నాళ్ల క్రితమే కొత్తగా మోటారు వెహికల్ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు హెచ్చుగా ఉన్నాయి. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారికి మిగతా 6లో..



ఆక్రమణ

- నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై పార్కింగ్
- ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదల

8లో

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- విస్తృత తనిఖీలతో నిరంతర పర్యవేక్షణ
- ప్రజా పంపిణీని పటిష్టంగా అమలు చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ

అటు నుంచి ఇటు

దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లోని విజయవాడ డివిజన్ పరిధిలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు విశాఖపట్నం డివిజన్‌ను కేటాయిస్తూ భౌగోళిక సరిహద్దులు నిర్ణయించి, డీపీఆర్ తయారు చేయమని ఆదేశాలు జారీ చేయటంతో విజయవాడ రైల్వే డివిజన్‌లో మార్పులు అనివార్యమయ్యాయి. ఫలితంగా విజయవాడ రైల్వే డివిజన్ పూర్వస్థితికి చేరుకోనుండగా, అమరావతి రైల్వేలైన్‌లోని కీలకమైన స్టేషన్లు సికింద్రాబాద్ డివిజన్ నుంచి వేరుపడి విజయవాడ డివిజన్‌లో కలవనున్నాయి.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి

విజయవాడ రైల్వే డివిజన్‌లో మార్పులు చేర్పులు

- విశాఖ డివిజన్ ఏర్పాటు చేయాలన్న కేంద్ర నిర్ణయం వల్లే..
- పాత డీపీఆర్ ప్రకారం నౌపాడ వరకు విజయవాడ డివిజన్
- తాజాగా దువ్వాడ వరకు కుదించే అవకాశం
- సికింద్రాబాద్ డివిజన్‌లోని కొన్ని స్టేషన్ల విలీనం
- కొండపల్లి-మోటుమర్రి వరకు విలీన ప్రతిపాదన
- మొత్తం 8 రైల్వేస్టేషన్లు కలిసే చాన్స్

అమరావతి నూతన రైల్వేలైన్‌ను దృష్టిలో పెట్టుకునే..



ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా అనకాపల్లి, దువ్వాడ వరకు విజయవాడ డివిజన్ కొనసాగుతోంది. గతంలో విశాఖను డివిజన్‌గా ప్రకటించకపోవటంతో పలాస (నౌపాడ) వరకు విజయవాడ డివిజన్ పరిధిలోకి చేర్చారు. దీనివల్ల విజయవాడ రైల్వే డివిజన్ పరిధి ప్రస్తుతం ఉన్న దాని కంటే రెండు రెట్లు పెరిగింది. నౌపాడ వరకు 202 కిలోమీటర్ల మేర అదనంగా విజయవాడ డివిజన్‌లో అంతర్భాగంగా నిర్ణయించారు. అలాగే, అరకు లైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి చేర్చారు. రూట్ కిలోమీటర్లు, రన్నింగ్ కిలోమీటర్లు రెండు రెట్ల పెరుగుదలతో పాటు ఎలక్ట్రికల్-డీజిల్ లోకోషెడ్లు, కోచింగ్ డిపోలు, వ్యాగన్ వర్క్‌షాప్‌లు తదితర అనేక రైల్వే ఆస్తులు విజయవాడ డివిజన్‌లో విలీనానికి ప్రతిపాదించారు. గజిటెడ్ ఉద్యోగులు తప్ప విశాఖ, వాల్తేరు పార్ట్‌లోని ఉద్యోగ, కార్మికులు ఎక్కడివారు అక్కడే పనిచేస్తారని, వీరంతా విజయవాడ డివిజన్ పరిధిలోకి వస్తారని అప్పట్లో పేర్కొన్నారు. దీనివల్ల పాత డీపీఆర్‌కు ముందు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 450 కిలోమీటర్ల రూట్ లెంగ్త్, రన్నింగ్ ట్రాక్ 979 కిలోమీటర్లుగా ఉంది. పాత డీపీఆర్ ప్రకారం విశాఖపట్నం డివిజన్ లేనందున విజయవాడ డివిజన్ పరిధిలో రూట్ లెంగ్త్ 1,414 కిలోమీటర్లు, రన్నింగ్ ట్రాక్ 2,631 కిలోమీటర్లకు చేరుకుంది. దక్షిణ కోస్తా జోన్ పరిధిలో గుంటూరు, గుంతకల్ డివిజన్ల కంటే కూడా విజయవాడ డివిజన్‌లోనే అత్యధికంగా 2,631 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్ ఉండేలా ప్రతిపాదించారు.

పాత డీపీఆర్ ప్రకారం విజయవాడ డివిజన్

కొత్త డీపీఆర్ ప్రకారం విజయవాడ డివిజన్

తాజాగా కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం డివిజన్‌ను ప్రకటించి, డీపీఆర్‌కు ప్రతిపాదించటంతో పైన చెప్పుకున్నవన్నీ విజయవాడ డివిజన్ నుంచి వేరుపడనున్నాయి. దువ్వాడ వరకు మాత్రమే విజయవాడ డివిజన్ కొనసాగుతుంది. కానీ, అదనంగా ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి చేరనున్నాయి.

కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు..

ఇప్పటి వరకు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి రైల్వే రూట్‌ను విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి విలీనం చేసేందుకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. వీటి ప్రకారం కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు దాదాపు 65 కిలోమీటర్ల వరకు రైల్వేరూట్ అదనంగా విజయవాడ డివిజన్ పరిధిలోకి రానుంది. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి చెరువు మాధవరం, గంగినేని, ఎర్రుపాలెం, తొండల గోపవరం, మధిర, మోటుమర్రి జంక్షన్, మోటుమర్రి బైపాస్ స్టేషన్లు విజయవాడ డివిజన్ పరిధిలోకి వస్తున్నాయి.

అమరావతి రైల్వేలైన్ కోసమే..

దక్షిణ మధ్య రైల్వేజోన్‌లోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి సెక్షన్‌ను విజయవాడ రైల్వే డివిజన్‌లో విలీనం చేయనుండటం వెనుక ప్రధానంగా అమరావతి రైల్వేలైనే ముఖ్య ఉద్దేశంగా అనిపిస్తోంది. అమరావతి రైల్వేలైన్ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర ప్రతిపాదితమైంది. ఎర్రుపాలెం, మిగతా 6లో..

ప్రచార హోరు..!

నామినేషన్లకు ముందే ఎమ్మెల్సీ అభ్యర్థుల జోరు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు
- ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు పోటాపోటీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో నామినేషన్లకు ముందే పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కాక రేగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) బలపరిచిన కేఎస్ లక్ష్మణరావు.. ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. వీరిద్దరూ ప్రచారంలో ఊపు పెంచారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఆలపాటి, ఆత్మీయ సమావేశాల పేరుతో కేఎస్.. కొద్దిరోజులుగా పతాక స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ఈ దఫా ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశముంది. కాగా, ఈ ఎన్నికల నుంచి వైసీపీ తప్పుకొంది. కానీ, నామినేషన్ల ఘట్టం పూర్తయ్యాక పోటీలో ఉన్నదెవరో తెలుస్తుంది. అయితే, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కానీ, కేఎస్ లక్ష్మణరావు కానీ.. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందినవారు కాదు. ఇద్దరూ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందినవారే. ఉమ్మడి కృష్ణాతో చక్కటి సత్సంబంధాలు కలిగి ఉన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్ : టీడీపీ నాయకుడిగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడు. ఆ తర్వాత ఆయన ప్రయాణం చంద్రబాబుతో సాగింది. స్వాతంత్ర్య సమరయోధుడు ఆలపాటి శివరామకృష్ణ తనయుడు. గుంటూరు జిల్లాలో జన్మించిన ఆయన అక్కడే ప్రాథమిక విద్యనభ్యసించారు. స్టూడెంట్స్ వర్కింగ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. బీఎల్ పూర్తి చేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. రెండోసారి 1999లో గెలిచాక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో విజయం సాధించారు. 2019లో ఓటమి చెందారు. 2024లో ఆయన తెనాలి నుంచి పోటీ చేయాలనుకున్నా.. కూటమి పొత్తులో భాగంగా ఆ సీటును నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. ఆలపాటి విజయానికి కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి.

కేఎస్ లక్ష్మణరావు : మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కూడా బలమైన అభ్యర్థే. గుంటూరు జిల్లాలో జన్మించిన లక్ష్మణరావు అక్కడి హిందూ కళాశాలలో రాజకీయశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్)లో చురుగ్గా ఉంటూ ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల కోసం అనేక ఉద్యమాలు చేశారు. 2007లో తొలిసారిగా కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీపడి ఎక్కువ మెజారిటీతో విజయం సాధించారు. 2015లో ఓటమి పొందారు. 2019లో కృష్ణా-గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీచేసి విజయం సాధించారు. లక్ష్మణరావు హిందూ కాలేజీ లెక్చరర్‌గానే కాకుండా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణలు ఇస్తూ చాలామందికి సుపరిచితులయ్యారు. గ్రూప్-1 పరీక్షలకు శిక్షణతో పాటు ఐఏఎస్‌లు కావాలనుకునే వారికి కూడా తర్ఫీదునిచ్చేవారు.

రేపు ఆలపాటి, 10న కేఎస్ నామినేషన్లు

ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ నెల 7వ తేదీన నామినేషన్ దాఖలు చేయటానికి సన్నాహాలు చేసుకుంటుండగా, కేఎస్ లక్ష్మణరావు మాత్రం 10వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు.



మున్సిపల్ కార్పొరేటర్లు, నాయకులతో మాట్లాడుతున్న వైసీపీ అధినేత జగన్

బాబ్బాబూ వెళ్లకండి..!

విజయవాడ కార్పొరేషన్ కార్పొరేటర్లతో వైసీపీ అధినేత జగన్

- మనసులో ఏం పెట్టుకోవద్దు.. వేరే ఆలోచనలు చేయొద్దని విజ్ఞప్తి
- ఇకపై ఎప్పుడైనా తనను కలవొచ్చని అభయం
- అరగంటపాటు మాట్లాడాక కార్పొరేటర్లతో ఫొటోషూట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్లను నిలబెట్టుకునేందుకు ఆ పార్టీ అధినేత జగన్ బతిమాలుకునే పరిస్థితికి చేరారు. 'బాబ్బాబు.. వెళ్లకండి..' అనే ధోరణిలో ఆయన కార్పొరేటర్లతో మాట్లాడటం సొంత పార్టీ వారినే విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వంలో ఉండగా మంత్రులకే నేరుగా కలుసుకునే భాగ్యంలేని పరిస్థితి నుంచి.. అధికారం కోల్పోయాక జగన్ దయనీయ మాటలను చూసి ఆశ్చర్యపోయారు. తాడేపల్లిలోని తన నివాసంలో బుధవారం మాజీ సీఎం జగన్.. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లు, మేయర్ సహా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జగన్ తన స్వభావానికి విరుద్ధంగా దిగి మాట్లాడారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమైన సమావేశంలో కార్పొరేటర్లనుద్దేశించి జగన్ అరగంటపాటు అభ్యర్థించారు. ఇటీవల కాలంలో తిరుపతి, ఇతర అనేక మునిసిపాలిటీల్లో సొంత పార్టీ కార్పొరేటర్లు జంప్ కావటం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో కూడా అదే పరిస్థితి ఉండటం వల్లే ఈ సమావేశం నిర్వహించారని తెలుస్తోంది.

కార్పొరేటర్లతో కలివిడిగా..

కార్పొరేషన్‌లో 12 మంది కార్పొరేటర్లు ఇటీవల కాలంలో వైసీపీకి దూరంగా ఉంటున్నారు. వీరిలో పదిమంది వరకు టీడీపీలో చేరటంతో మిగతా 6లో..

రసాయనాల కథ నడిపిందెవరు?

'జక్కంపూడి శివారులోని ఖాళీ భూముల్లో పోసిన వ్యర్థాల వెనుక కెమికల్ మాఫియా ఉందా? ఎక్కడో వైజాగ్ నుంచి రసాయన వ్యర్థాలు ఇక్కడికే ఎందుకు వస్తున్నాయి? గ్రామంలో ఎవరైనా మాఫియాతో చేతులు కలిపారా? నాలుగైదు నెలల నుంచి రసాయన వ్యర్థాలు ఈ కారణంగానే ఇక్కడికి వస్తున్నాయా?' జక్కంపూడిలోని ఖాళీ భూముల్లో పోసిన వ్యర్థాల వ్యవహారంలో తాజాగా ఉత్పన్నమవుతున్న ప్రశ్నలివి. ఈ నేపథ్యంలో బిహార్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్‌ను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోపక్క ఈ వ్యర్థాల వ్యవహారం నిగ్గు తేల్చడానికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రంగంలోకి దిగారు. అధికారులు కూపీ లాగుతున్న కొద్దీ కొత్తకొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జక్కంపూడిలో పోస్తున్న వ్యర్థాల సమాచారాన్ని వైజాగ్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు జిల్లా అధికారులు చేరవేశారు.

నకిలీ పత్రాలతో వచ్చిన ట్యాంకర్

- జగ్గయ్యపేటలోని పీపీయూకు వెళ్తున్నట్టు లేఖ
- వ్యర్థాలు రావడం వెనుక జక్కంపూడి వాసి ఉన్నట్టు అనుమానం
- రంగంలోకి దిగిన కాలుష్య నియంత్రణ మండలి
- వైజాగ్, జగ్గయ్యపేటలో అధికారుల సోదాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/చిట్టినగర్): జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లో పోస్తున్న వ్యర్థాలు వైజాగ్‌లోని క్రెబ్స్ బయో కెమికల్స్ ఫార్మా కంపెనీ నుంచి వచ్చినట్టుగా ట్యాంకర్ డ్రైవర్ వద్ద ఉన్న కాగితాలను బట్టి తెలుస్తోంది. ఈ ట్యాంకర్ జగ్గయ్యపేటలో ఉన్న పీపీయూ (ప్రీ ప్రాసెసింగ్ యూనిట్)కు వెళ్తున్నట్టు ఆ కాగితాల్లో ఉంది. దీని



ప్రకారం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ జగ్గయ్యపేటలోని పీపీయూలో బుధవారం సోదాలు నిర్వహించారు. అక్కడున్న సిబ్బందిని విచారించారు. వైజాగ్ నుంచి ట్యాంకర్ వ్యర్థాలతో తమ ప్లాంట్‌కు వస్తున్నట్టుగా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు.

వ్యర్థాలు రవాణా చేయాల్సిన పద్ధతి ఇది..

ఫార్మా కంపెనీల్లో మందుల తయారీలో రకరకాల రసాయనాలను ఉపయోగిస్తారు. వాటి ద్వారా వ్యర్థాలు బయటకు వస్తాయి. వాటిలో కెలోరిఫిక్ మిగతా 6లో..



సంగమ స్నానం.. ఆంక్షలు ఘోరం!

ఐదేళ్ల నుంచి కృష్ణా సాగర సంగమ ప్రాంతంలో స్నానాలు నిలిపివేత

- భద్రతను బూచిగా చూపిన అధికారులు
- సంగమ స్నానం సర్వపాప హరణమని భక్తుల నమ్మిక
- భద్రతా ఏర్పాట్లతో అనుమతి ఇవ్వాలంటున్న భక్తులు

6లో



దుర్గగుడి ఉద్యోగులపై చర్యలు

దర్శనాల దళారీకి సహకరించిన వారిపై వేటు

ఇద్దరు శాశ్వత ఉద్యోగుల సస్పెన్షన్

నలుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు అడ్డదారిలో అంతరాయ దర్శనాలు చేయిస్తూ.. భారీగా వసూలు చేస్తూ.. దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్న ఉద్యోగులపై ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. శాశ్వత ఉద్యోగులైన అటెండర్ కె.పుల్లారావు, మైక్ నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు మరో నలుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కారుడ్రైవర్ నాగరాజు, హోంగార్డు భాస్కరరావు, ప్రైవేట్ సెక్యూరిటీ కోటేశ్వరరావు, పల్లకి బోయలు చిన్న జమలయ్యను ఉద్యోగాల నుంచి తప్పించారు. ఏఈవోలు పి.చంద్రశేఖర్, జి.శ్రీనివాసు నివేదిక, వన్‌టౌన్ పోలీసుల సందేశం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. దళారీ కురిటెల్లి శ్రీనివాసరావు అలియాస్ డిప్యూటీతో కుమ్మక్కై భక్తుల నుంచి డబ్బు వసూలు చేసి వీరంతా దర్శనాలు కల్పిస్తున్నారని విచారణలో తేలింది. దేవస్థాన ఉద్యోగులై ఉండి.. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడంతో పాటు టికెట్లు కొనుగోలు చేసి దర్శనాలు చేసుకునే భక్తులకు ఆటంకం కలిగించడం, దేవస్థాన ఆదాయానికి గండి కొడుతుండటంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ దళారీతో చేతులు కలపడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఏడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, పుల్లారావు స్థానంలో ఎస్ఎంఆర్ సైదాను నియమించారు. రికార్డు అసిస్టెంట్ మైక్ నాగేశ్వరరావు స్థానంలో కె.తేజేశ్వరరావును నియమించారు. పోలీసుల నివేదిక మేరకు ఇంకా మరికొంతమందిపై చర్యలు తీసుకునే అవకాశముంది.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేయండి

- ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠంగా మార్చండి
- పౌరసరఫరాల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలోని 957 రేషన్ దుకాణాలు, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, నివేదికలు సమర్పించాలి. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను, తహసీల్దార్లు నెలకు ఐదు దుకాణాలను తనిఖీ చేయాలి. ఎంఎల్ఎస్ పాయింట్లను పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌరసరఫరాల అధికారి తనిఖీ చేయాలి. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠంగా మార్చాలి.' అని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించా రు. బుధవారం ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరు, తనిఖీలు, ఉల్లంఘనల్లో కేసుల నమోదుపై పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్‌గౌర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. కాన్ఫరెన్స్ అనంతరం పౌరసరఫరాల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. 2024 జూలై నుంచి డిసెంబరు వరకు 6ఏ కేసులు 119 నమోదయ్యాయని, ఇకపైనా క్రియాశీలంగా పనిచేసి, ఉల్లంఘనలపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎండీయూ ఆపరేటర్లు పారదర్శకంగా సరుకులు అందించేలా చూడాలన్నారు.

1,09,665 టన్నుల ధాన్యం సేకరణ

ఎన్టీఆర్ జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణపైన పౌరసరఫరాల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్షించారు. ఇప్పటివరకు 16,217 మంది రైతుల నుంచి రూ.254 కోట్ల విలువైన 1,09,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు, డీఎస్వో ఎ.పాపారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 2,713 నీటి కుంటలు మంజూరు

'పంట పొలాల్లో నీటి కుంటల(ఫార్మ్ పాండ్స్)తో పొలం పచ్చగా... సమాజం సుభిక్షంగా ఉంటుంది. ఒక కార్యక్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జిల్లాలో 289 గ్రామ పంచాయతీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయి. ఇప్పటికే 203 కుంటలు గ్రౌండింగ్ అయ్యాయి. మిగిలిన పనులు ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలి.' అని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, పశువుల షెడ్లు, పంట పొలాల్లో నీటి కుంటల పనుల్లో పురోగతిని సమీక్షించారు. నరేగా అనుసంధానంతో పైసా ఖర్చులేకుండా రైతుల పొలాల్లో నీటికుంటల వల్ల పంటకు కావాల్సిన నీరు అందించడమే కాకుండా భూగర్భ జలాల వృద్ధికి దోహదం చేస్తాయన్నారు. నరేగా-పల్లె పండుగ కార్యక్రమం కింద 746 పశువుల షెడ్లకు పనులు మంజూరు కాగా, 420 పూర్తయ్యాయని తెలిపారు. డ్వామా పీడీ ఎ.రాము, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణామిల్క్ యూనియన్ తొలి చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబును సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

ప్రగతి పథంలో విజయ డెయిరీ

- పశుపోషకులు, వినియోగదారుల ఆదరణే కారణం
- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పామర్రు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'పశుపోషకులు, పాలవినియోదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) సేవలందిస్తోంది. పశుపోషకులు, వినియోగదారుల ఆదరణతో ప్రగతి పథంలో పయనిస్తోంది. 60 వసంతాల్లోకి అడుగిడి వజ్రోత్సావాలకు సిద్ధమవుతోంది.' అని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. జమీగొల్వేపల్లి పాలకేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పాడిరైతు సంక్షేమం మన మతం- అలుపెరగని సేవ మన అభిమతం కార్యక్రమానికి యూనియన్ శ్రీకారం చుట్టిందన్నా రు. జమీగొల్వేపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర డెయిరీ అభివృద్ధి, కృష్ణామిల్క్ యూనియన్ తొలి చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబు, పాలసంఘ అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులను చలసాని సత్కరించారు. సంస్థ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సభ్యులు జీపీ మల్లికార్జునరావు, ఏజీఎం అన్వేష్‌కుమార్, పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ గోపీనాథ్, పాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నందిగామను అభివృద్ధి చేయండి

- చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారితో మాజీ మంత్రి దేవినేని ఉమా



నందిగామ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారిని అభినందిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో నందిగామ అభివృద్ధికి దూరమైంది. అంకితభావంతో పనిచేసి, పట్టణాన్ని అభివృద్ధి చేయండి.' అని నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మండవ కృష్ణకుమారికి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచించారు. బుధవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణకుమారిని దేవినేని ఉమా అభినందించారు. టీడీపీ నాయకుడు మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో అవినీతిపై ఫిర్యాదు

- శాప్ చైర్మన్‌కు జూడో సంఘం ట్రెజరర్ కిరణ్ వినతిపత్రం

విజయవాడ స్పోర్ట్స్, 5 ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ఆడుదాం ఆంధ్రలో కోట్ల రూపాయల కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులపై చర్యలు తీసుకోవాలని శాప్ చైర్మన్ రవినాయుడుకు రాష్ట్ర జూడో సంఘం ట్రెజరర్ కిరణ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. 'ఆడుదాం ఆంధ్రా' కుంభకోణంలో శాప్ డీడీ వెంకటరమణతో పాటు అథ్లెటిక్ సంఘం మాజీ కార్యదర్శి ఆకుల రాఘవేంద్ర, కబడ్డీ సంఘం కార్యదర్శి శ్రీకాంత్, జూడో సంఘం మాజీ కార్యదర్శి నామిశెట్టి వెంకట్, అథ్లెటిక్ సంఘం కార్యదర్శి ఆకుల హైమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు వారి బ్యాంక్ ఆకౌంట్లను పరిశీలించాలని కోరారు. అ ఆకౌంట్లు పరిశీలిస్తే ఎన్ని కోట్లు ట్రాన్స్‌ఫర్ అయ్యాయో తెలుస్తుందని, ఆకుల రాఘవేంద్రకు డీడీ వెంకటరమణ 8 లక్షల టీషర్టులకు ఆర్డర్ ఇచ్చిందని, దానిపైనా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఒలింపింక్ సంఘంలో పురుషోత్తమ నాయుడుని లేకుండా చేయాలని వైసీపీ హయాంలో వైసీపీ నాయకులైన విజయసాయి రెడ్డి, సజ్జల, చెవిరెడ్డిలతో ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారని, అయనపై కేసులు పెట్టారని అన్నారు. ఈ కేసుల వారి మెడకే చుట్టుకునే రోజు త్వరలో ఉందని అన్నారు. ఎన్నికల ముందు ఎంపీ కేశినేని శిననాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో ఆకుల రాఘవేంద్ర కూతురిని టీడీపీలోకి పంపి పార్టీలో చలమణి అవడమే కాకుండా శాప్ చైర్మన్‌ను తప్పుదోవ పట్టించారన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు ద్రోహం చేస్తున్న వారిపై చర్యలు కోరుతూ వినతిపత్రం అందించానన్నారు.



సంగమ ప్రదేశంలో ఆంక్షలు విధిస్తున్నట్టు అధికారులు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక



కోతకు గురవుతున్న కృష్ణవేణమ్మ పాదుకలు

సంగమ స్నానం.. ఆంక్షలు ఘోరం!

ఐదేళ్ల నుంచి కృష్ణా సాగర సంగమ ప్రాంతంలో స్నానాలు నిలిపివేత

జీవితంలో ఒక్కసారైనా కృష్ణా సాగర సంగమ క్షేత్రంలో మానవుడు పుణ్యస్నానం ఆచరిస్తే సర్వపాపాలు తొలుగుతాయని స్కంద పురాణం చెబుతోంది. గంగానది తన పాప పంకిలాన్ని పోగొట్టుకునేందుకు కాకిరూపంలో వివిధ పుణ్యనదుల్లో స్నానమాచరిస్తూ వచ్చి, హంసలదీవి క్షేత్రంలోని సాగర సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించిందని, వెంటనే హంసగా మారిందని స్థల పురాణం చెబుతోంది. అంతటి ప్రసిద్ధిగాంచిన కృష్ణా సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరించాలని భక్తులు కోరుకుంటారు. కానీ, ఐదేళ్లుగా భక్తులను పవిత్ర సంగమం వద్దకు వెళ్లకుండా భద్రత పేరుతో అధికారులు ఆంక్షలు విధించారు.

- భద్రతను బూచిగా చూపిన అధికారులు
- సంగమ స్నానం సర్వపాపహరణమని నమ్మిక
- భద్రతా ఏర్పాట్లు చేసి అనుమతించాలంటున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి-కోడూరు): కృష్ణా సాగర సంగమ ప్రదేశం లోతు ఎక్కువ ఉంటుందని, ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, భద్రతా కారణాలు చూపి ఐదేళ్ల నుంచి భక్తులు ఆ ప్రదేశానికి వెళ్లకుండా, స్నానాలు ఆచరించకుండా అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో భక్తుల సౌకర్యార్థం సంగమ ప్రదేశంలో నిర్మించిన రెండంతస్తుల వసతి భవనం, దేవుళ్ల విగ్రహాలు, శిథిలావస్థకు చేరాయి. కృష్ణవేణమ్మ పాదాలు కోతకు గురవుతున్నాయి. సంగమ ప్రదేశంలో లోతు ఉంటుందని అందరికీ తెలిసిందేనని సరైన భద్రతా చర్యలు చేపట్టలేక, అధికారులు పవిత్ర సంగమానికి భక్తులు దూరం చేసి, క్షేత్ర వైభవాన్ని కాలగర్భంలో కలిపేస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతంగా కృష్ణా పుష్కరాల నిర్వహణ

2016లో కృష్ణా పుష్కరాలను 12 రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్పటి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారని, అప్పుడు ఒక్క ప్రమాదమైనా జరగలేదని భక్తులు అంటున్నారు. అధికారులు ప్రస్తుతం భద్రత పేరుతో స్నానాలు నిలిపివేయడం సరికాదంటున్నారు.

మాఘ శుద్ధ పౌర్ణమికి లక్షలాది భక్తుల రాక

ఫిబ్రవరి 12వ తేదీన మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు సంగమ ప్రదేశంలో స్నానమాచరించినందుకు హంసలదీవి వస్తారు. సంగమ ప్రదేశం వద్ద కొత్తగా అభివృద్ధి చేయకపోయినా ఉన్న విశ్రాంతి భవనం, దేవుళ్ల విగ్రహాలు శిథిలం అవ్వకుండా కనీస మరమ్మతులైనా చేయడం లేదని, ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో పూర్తిగా శిథిలమై కనుమరుగవుతుందని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సంగమ ప్రదేశంలో శిథిలావస్థకు చేరిన రెండంతస్తుల భవనం

భక్తుల మనోభావాలను గౌరవించాలి

భక్తుల మనోభావాలను గౌరవిస్తూ సంగమ ప్రదేశ విశిష్టతను గుర్తించాలని, అన్ని ఏర్పాట్లు చేయాలని అందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో స్వాతి తదితర అధికారులు సహకరించాలని భక్తులు కోరుతున్నారు. మహిమాన్విత సాగర సంగమ క్షేత్రంలో స్నానాలు చేసేవారి భద్రత కోసం ఏర్పాట్లు చేయాలని, శాశ్వతమైన చర్యలు చేపట్టాలని, సంగమ ప్రదేశానికి గత వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్సై శ్రీనివాస్, పీడీఎస్ డీటీ ప్రధాన్

26 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామిక వాడ నుంచి బుధవారం రెండు లారీల్లో 600 బ్యాగుల్లో తరలిస్తున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, గన్నవరం, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెలిపారు. బాపులపాడు, నూజివీడు, అగిరిపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో సేకరించిన బియ్యం మల్లవల్లి వద్ద తోటల్లో భద్రపరుస్తున్నారని, దానిని కోళ్ల ఫారాలకు, చేపల మేతకు వినియోగించే పిల్లెట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీలో వినియోగించేందుకు రాజమండ్రికి చెందిన శ్రీనుబాబు తరలిస్తున్నాడని వారు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానికంగా ఉన్న రైస్ మిల్లులో ఉంచి, వాహనాలను వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని ప్రధాన్ తెలిపారు. పీడీఎస్ డీటీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విజయవాడలో రైలు కోచ్ దగ్ధం

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో రైలు కోచ్ దగ్ధమైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. విజయవాడ రైల్వే లోకో షెడ్ సమీపంలో ఒక ఎక్స్‌ప్రెస్ ఖాళీ ఏసీ రైలు నిలిపారు. రైలు కోచ్‌లో నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటం స్థానికులు గమనించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది రైలు వద్దకు చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి వసంతోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం స్వామికి వసంతోత్సవం, అవభృదస్నానోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, బలిహరణను అర్చకబృందం శాస్త్రోక్తంగా జరిపింది. స్వామి, అమ్మవార్లకు పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, వసంతోత్సవం నిర్వహించారు. వేదపండితులు మహాపూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపించారు.



పంచామృతాభిషేకాలను ప్రారంభిస్తున్న ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు



పాలకావడులతో ఆలయానికి చేరుకున్న మాలధారులు

సుబ్రహ్మణ్యస్వామి దీక్షల విరమణ

45రోజులపాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాల ధరించి దీక్ష చేసిన స్వాములు బుధవారం ఆలయంలో దీక్షలు విరమించారు. స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా మోపిదేవి పురవీధుల్లో భుజాన పాలకావిడులతో గ్రామోత్సవం చేశాక, దీక్ష విరమించారు.

ఆక్రమిత భూమి రామలింగేశ్వస్వామి ఆలయానిదే

- సర్వే చేసి నిర్ధారించిన అధికారులు



ఆక్రమణలో ఉన్న భూమిని సర్వే చేస్తున్న అధికారులు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురైన నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయ భూమిని బుధవారం అధికారులు సర్వే చేసి, అది ఆలయానిదే అని నిర్ధారించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డు పక్కన గల సర్వే నెంబర్ 822లోని ఆలయ భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దేవదాయశాఖ అధికారులు స్పందించారు. ఆ స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి తమదేనని, తమ వద్ద పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయంటూ వ్యాపారులు మంగళవారం బోర్డును పీకేశారు. దీంతో భక్తులకు, వ్యాపారులకు మధ్య వివాదం చెలరేగింది. వెంటనే సర్వే చేయాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదేశించారు. దీంతో రెవె న్యూ, దేవదాయ, ఆర్ అండ్‌బీ అధికారుల సమక్షంలో సర్వే చేశారు. భూమి పూర్తిగా ఆలయానికి చెందినదని తేలింది. దీంతో పాటు సమీపంలోని ఒక బహుళ అంతస్థ భవనం పూర్తిగా, మరొక భవనంలో కొంత భాగం ఆలయానికి చెందిన భూమేనని తేలింది. భవనం క్రింద ఆక్రమణలో ఉన్న భూ మిని కొంత మంది దేవదాయశాఖ సిబ్బంది అక్రమంగా వారికి కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. దేవదాయ అధికారులు దర్యాప్తు చేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గత నెల మొదటి వారంలో కంచికచర్ల మండలంలో మంత్రి లోకేశ్ పర్యటన ఉందని కంచికచర్ల నుంచి చెవిటి కల్లు, కీసర నుంచి మోగులూరు మీదుగా దొనబండ వెళ్లే రోడ్ల మరమ్మతులు ప్రారంభించిన అధికారులు ఆ తర్వాత మంత్రి పర్యటన రద్దవడంతో పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.



కంచికచర్ల- చెవిటికల్లు రోడ్డు..



చెవిటికల్లు, కునికినపాడు గ్రామాల మధ్య దొనబండ - కీసర వెళ్లే రోడ్డు..

అసంపూర్తిగా.. రోడ్ల మరమ్మతులు

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల): కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, కీసర నుంచి మోగులూరు మీదుగా దొనబండ వెళ్లే రోడ్డు దెబ్బతిని, వాటిపై తారు పోయి, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. గత నెల మొదటి వారంలో కంచికచర్ల మండలంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల పర్యటన రద్దయింది. మంత్రి లోకేశ్ పర్యటనను దృష్టిలో పెట్టుకుని నెల క్రితం ఈ రోడ్లను బాగు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ప్యాచ్ వర్కుల మాదిరిగా గుంతల వద్ద, మెతగ్గా ఉన్న చోట్ల రోడ్లను తవ్వారు. కొన్ని ప్యాచ్‌లకు తారు వేసిన అధికారులు, మిగతా ప్యా చ్‌లకు తారు వేయకుండా వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

మిర్చితోట దెబ్బతింటోందని లారీల నిలిపివేత

ఇసుక లారీల వల్ల దుమ్ము, ధూళి లేచి, రోడ్డు పక్కన ఉన్న మిర్చి, మొక్కజొన్న తోటలపై దుమ్ము పడుతోంది. దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలయినా రోడ్డును బాగు చేయకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము వల్ల మిర్చి తోట దెబ్బతింటోందని బుధవారం ఒక రైతు రోడ్డుపై ఇసుక లారీలను నిలిపివేశారు. రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

త్వరలో బాగుచేస్తాం

నిధుల కొరత ఉంది. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వీలైనంత త్వరలో రోడ్లను బాగు చేస్తాం.

- శశిభూషణ్, ఆర్అండ్‌బీ జేఈ

హెల్మెట్ రూ.1,000

(5వ పేజీ తరువాయి)

రూ.1,000, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.10 వేల జరిమానా విధించాల్సి ఉంది. ఈ చట్టాన్ని రవాణా శాఖ అధికారులు మాత్రమే అమలు చేస్తున్నారు. అటు రవాణా శాఖ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు ఈ పరివాహన్ యాప్ ద్వారా జరిమానాలు విధిస్తున్నారు. విధించిన జరిమానాలను ఈ యాప్ ద్వారా చెల్లించే అవకాశం వాహనదారులకు ఉంది. హెల్మెట్ లేని వాహనదారులకు రవాణా శాఖ అధికారులు రూ.1,000 జరిమానా విధిస్తుంటే, ట్రాఫిక్ పోలీసులు రూ.135లే విధిస్తున్నారు. ఈ వ్యత్యాసం లేకుండా మార్చి 1 నుంచి రూ.1,000 జరిమానా విధించాలని నిర్ణయించారు. ఆ జరిమానాను కూడా 90 రోజుల్లోపు చెల్లించాలి. కాగా, జరిమానాలు పెండింగ్‌లో ఉన్న 141 వాహనాలను సీజ్ చేసినట్టు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. కొత్త జరిమానాలు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నందున వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాబ్బాబూ వెళ్లకండి..!

(5వ పేజీ తరువాయి)

పాటు దగ్గరగా ఉంటున్నారు. బుధవారం నాటి సమావేశానికి వైసీపీకి చెందిన 38 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో జగన్ మాట్లాడుతూ 'పార్టీలో ఉన్నోళ్లంతా నావాళ్లే. మనసులో ఏమీ పెట్టుకోవద్దు. వేరే ఆలోచనలు చేయొద్దు. నా దగ్గరకు ఎప్పుడైనా రావచ్చు. ఎప్పుడైనా కలవొచ్చు. నాలోని 2.0ను ఇక మీరు చూస్తారు. ఇక కార్యకర్తల కోసం పనిచేస్తా. మీ వెంటే నేను ఉంటా. మీరు మరో ఆలోచన చేయవద్దు. మిమ్మల్ని చూసుకుంటా' అన్నారు. అనంతరం ఒక్కో కార్పొరేటర్ యోగక్షేమాలను జగన్ అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిస్థితులపై ఆరా తీశారు. వారితో ఫొటోలు దిగారు. ఫొటో షూట్ అయ్యాక కార్పొరేటర్లందరితో కలిసి విందు ఆరగించారు.

రసాయనాల కథ.. నడిపిందెవరు?

(5వ పేజీ తరువాయి)

విలువలు ఉంటాయి. కర్మాగారాల్లో ఉంటే బాయిలర్‌లను మండించడానికి కెలోరిఫిక్ ఉపయోగపడుతుంది. ఇలా వచ్చిన వ్యర్థాలను సిమెంట్ తయారీ కర్మాగారాల్లో కిలెన్‌లోని బొగ్గును మండించడానికి ఉపయోగిస్తారు. ఫార్మా కంపెనీ నుంచి వ్యర్థాలతో బయలుదేరిన ట్యాంకర్ ముందుగా పీపీయూకు చేరుకోవాలి. అక్కడ వాటిని శుద్ధి చేసిన తర్వాత సిమెంట్ కంపెనీలకు పంపుతారు. ఇలా ఫార్మా కంపెనీల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారబోయకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఒక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫార్మా కంపెనీ నుంచి బయలుదేరే ట్యాంకర్‌కు కచ్చితంగా జీపీఎస్ పరికరం ఉండాలి. ఏ నంబరు గల ట్యాంకర్‌లో ఎంత మొత్తంలో ఎలాంటి వ్యర్థాలను పీపీయూకు పంపుతున్నారో కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించిన అధికారులు ఆన్‌లైన్‌లో అనుమతి ఇస్తారు. ఆ అనుమతి కాగితాన్ని ఫార్మా కంపెనీ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒక కాపీని పీపీయూకు పంపాలి. ఒక కాపీని డ్రైవర్‌కు ఇవ్వాలి.

అనుమతి పత్రాన్ని మాయచేసి మరీ..

పీసీబీ అధికారులు ఆన్‌లైన్‌లో ఇచ్చే అనుమతి కాగితాన్ని మాయ చేసినట్టు అధికారులు గుర్తించారు. జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లో పారబోసినవి రసాయన వ్యర్థాలు కాదని, వ్యర్థ నీరని చెబుతున్నారు. ఈ ట్యాంకర్ డ్రైవర్ వద్ద అనుమతి కాగితాలను పరిశీలించిన పీసీబీ అధికారులు వాటిపై జగ్గయ్యపేటలోని పీపీయూకు వెళ్తున్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లి విచారించగా ఇలాంటి ట్యాంకర్ వస్తుందని తమకు ఎలాంటి సమాచారం రాలేదని, పీసీబీ ఇచ్చే అనుమతి కాగితం అందజేయలేదని సిబ్బంది చెప్పారు. దీంతో డ్రైవర్ వద్ద ఉన్నది నకిలీ అనుమతి కాగితమని గుర్తించారు. ఇదే విషయాన్ని వైజాగ్‌లోని పీసీబీ అధికారులకు తెలియజేశారు. అక్కడ క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీలో అక్కడి అధికారులు విచారణ చేస్తున్నారు.

ట్యాంకర్‌కు రెండు నంబర్లు

వ్యర్థాలతో వచ్చిన ట్యాంకర్‌కు వేర్వేరు నంబర్లు ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. నంబరు ప్లేట్‌పై ఏపీ02 టీబీ 6606 ఉంది. ట్యాంకర్‌పై మాత్రం యజమాని కె.రమణారెడ్డి అని, రిజిస్ట్రేషన్ నంబరు ఏపీ21 టీవై 3499 అని ఉంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌కు జీపీఎస్ పరికరం లేదని పీసీబీ అధికారులు గుర్తించారు. జక్కంపూడిలో పారబోసిన వ్యర్థాలు ఉన్న భూముల నుంచి అధికారులు నమూనాలను సేకరించారు. వైజాగ్‌లోని జోనల్ ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపారు.

అటు నుంచి ఇటు..!

(5వ పేజీ తరువాయి)

పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, అమరావతి, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరు రైల్వేస్టేషన్ వరకు అమరావతి రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. సెప్టెంబరులోనే రూ.2,545 కోట్లతో అనుమతులు ఇచ్చారు. అమరావతిలో నూతన రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం తగదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. విజయవాడ చెంతే ఉన్న కొండపల్లి.. సికింద్రాబాద్ డివిజన్‌లో ఉండి, విశాఖలో ఉండే దువ్వాడ విజయవాడ డివిజన్ పరిధిలో ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఈ పరిస్థితిలో సికింద్రాబాద్ డివిజన్‌లోని 65 కిలోమీటర్ల రూట్‌లెంగ్త్‌ను విజయవాడ రైల్వే డివిజన్‌లో విలీనం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

8 నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం: జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా, డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మధుఎగ్జిబిషన్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమం 16వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి మంచి వేదిక అని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో జ్యూస్‌ల తయారీ, మెహందీ, హెయిర్ స్టైల్ పోటీలు, మహిళా పారిశ్రామికవేత్తలకు సన్మానం, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, బ్లాక్ ప్రింటింగ్ శారీస్ ప్రదర్శన, సంప్రదాయ పిండి వంటల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



మరియమాత గుహ వద్దకు వెళ్లేందుకు బారులు తీరిన భక్తులు

భక్తుల కోర్కెలు తీర్చేమాత మరియమాత

విజయవాడ మేత్రాసనం కతోలిక విభాగ ప్రధాన కార్యదర్శి పొలుగు కిరణ్

- ఆరో రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుణదల లూర్దుమాత పుణ్యక్షేత్రం భక్తుల దీవెనల సిరిగా వెలుగొందుతుందని విజయవాడ మేత్రాసనం కతోలిక విభాగ ప్రధాన కార్యదర్శి గొంతు పొలుగు కిరణ్ అన్నారు. గుణదలమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా బుధవారం జరిగిన ఆరో రోజు ప్రార్థనకు ముఖ్య అతిథిగా హాజరైన పొలుగు కిరణ్ సందేశమిస్తూ గుణదల మాత పుణ్యక్షేత్రానికి క్రైస్తవులే కాక అన్ని కులాలు, మతాల వారు సందర్శించి లూర్దుమాత దీవెనలు పొందుతున్నారని చెప్పారు. భక్తుల కోర్కెలు తీర్చేమాతగా మరియమాత భక్తుల చేత కొనియాడబడుతుందని వివరించారు. పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ కొండపైకి చేరుకోలేని వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగుల కోసం ఉత్సవాల కార్యక్రమాలు తిలకించే విధంగా డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పొలుగు కిరణ్, ముప్పాల ప్రసాద్, యేలేటి విలియం జయరాజు, కొలకాని మరియన్న, తోట సునీల్ రాజ తదితర గురువులు దివ్యసత్ప్రసాదంతో భక్తులతో కలిసి కొండపైన ఉన్న లూర్దుమాత వద్దకు చేరుకున్నారు. అనంతరం గురువులు సమష్టి దివ్యపూజా బలి సమర్పించారు. భక్తులు, గురువులు ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గాబ్రియేల్, ఎం.చిన్నప్ప, పసల తోమస్, జోసఫ్ తదితర గురువులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు సత్వరమే పూర్తి చేయండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెడ్ సర్కిల్ వద్ద జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం రెడ్‌సర్కిల్, కొత్త వంతెన, గుణదల రైల్వేస్టేషన్, గుణదల సెంటర్, న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రెడ్ సర్కిల్‌లో కోటి 99 లక్షల వ్యయంతో జరుగుతున్న యూజీడీ కొత్త లైన్ పనులను, కొత్తవంతెన వద్ద పాడైపోయిన మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను పరిశీలించారు. నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతాలైన మధురానగర్, గుణదల సెంటర్, గుణదల రైల్వేస్టేషన్, కొత్త రాజ రాజేశ్వరి పేట ప్రాంతాలన్నీ పర్యటించి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి వీఎంసీ తరపున తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి చీఫ్ సిటీప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, ఇంజనీర్లుసత్యనారాయణ, సత్యకుమారి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



రెడ్ సర్కిల్ వద్ద పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఈట్‌స్ట్రీట్‌ను పర్యవేక్షిస్తూ ఉండాలి

లబ్బీపేట: నగర కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఈట్‌స్ట్రీట్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈట్‌స్ట్రీట్ ప్రజలు ఆహారం తీసుకునే ప్రదేశం కావడంతో అధికారులు ఎప్పుడూ పర్యవేక్షిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలని అన్నారు. ఇక్కడ ఏర్పడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు. ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాలుగు డివిజన్లలో నీటి సరఫరా బంద్

- 24వ డివిజన్‌లో ఉదయం సరఫరా, 7, 8, 19 డివిజన్లలో సాయంత్రం..
- మార్చి ఒకటో తేదీ నుంచి యథావిధిగా నీటి సరఫరా

కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న 1477కేఎల్ సామర్థ్యం గల తాగునీటి రిజర్వాయర్ మరమ్మతుల కారణంగా ఈ నెల 7వ తేదీ నుంచి నెలాఖరు వరకు నాలుగు డివిజన్లలో తాగునీటి సరఫరా ఉండదని వీఎంసీ ప్రకటించింది. సర్కిల్ 3 పరిధిలోని 7వ డివిజన్ బాడవపేట జాన్‌వీధి, జక్రయ్య వీధి, గాంధీబొమ్మ రోడ్డు, అంబేద్కర్ వీధి, పీటర్ వీధి, సుదర్శన్ వీధి, నెహ్రూనగర్ ఈదా కట్టయ్య వీధి, రెల్లీస్ బజార్, ఐజాక్ వీధి, జయరాజ్ వీధి, డింపుల్ బార్ రోడ్డు, టి.గౌరయ్య వీధి, రుక్మిణికృష్ణ రైస్ మిల్ రోడ్డు, శివానందం వీధి, లక్ష్మీనగర్, వరమహాలక్ష్మి వీధి, పీవీపీ రోడ్డు, మల్లెల పరమేశ్వరరావు రోడ్డు, ఉడ్‌పేట మెరక, ఉడ్‌పేట, కనుమూరి దేవానందం రోడ్డు, శాంతినగర్, మధుగార్డెన్ రోడ్డు, మొగల్రాజపురం జర్నలిస్టు కాలనీ, నవోదయ కాలనీ, 8వ డివిజన్‌లో రఘురాం వీధి, కృష్ణ నగర్, లక్ష్మీనగర్, గౌస్‌వీధి, ఆదర్శ్ రోడ్డు, రెవెన్యూ కాలనీ, కాంధారి రోడ్డు, 19వ డివిజన్‌లోని లబ్బీపేట నేతాజీ బ్రిడ్జి వీధి, వేంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు, పైడియ్య వీధి, అంజనేయ పంతులు వీధి, మసీదు వీధి, గ్రీన్‌ల్యాండ్ రోడ్డు, వైవీ రావు ఆసుపత్రి రోడ్డు, విష్ణువర్ధన్‌రావు వీధి, జార్జ్‌పేట, నందమూరి రోడ్డు, బృందావన్ కాలనీ ప్రాంతాలకు సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు మాత్రమే నీటి సరఫరా ఉంటుందని తెలిపింది. ఉదయం నీటి సరఫరా ఉండదని స్పష్టం చేసింది. సర్కిల్ 2 పరిధిలోని 24వ డివిజన్‌లో గిరిపురం, ప్రజాశక్తినగర్, కస్తూరిబాయి పేట, మెట్రో వెనుక కడియాల వారి వీధిలో ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు మాత్రమే నీటి సరఫరా ఉంటుందని తెలిపింది. మార్చి ఒకటో తేదీ నుంచి మాత్రం యధావిధిగా నీటి సరఫరా ఉంటుందని తెలిపింది.

పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్

కార్పొరేషన్ : నగరంలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్ సృజన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగుస్తుందన్నారు. యజమానులు ఆస్తి, ఖాళీ స్థల పన్నులను ఈ గడువు లోగా చెల్లించి వీఎంసీకి సహకరించాలని కోరారు.

7, 8 తేదీల్లో పీఎన్‌బీ హోమ్‌లోన్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ విజయవాడ సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా, ఏజీఎం ఎం.శ్రీనివాసరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రెండో అతిపెద్ద జాతీయ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈనెల 7, 8 తేదీల్లో దేశవ్యాప్తంగా హోమ్ లోన్ ఎక్స్‌పో నిర్వహిస్తోందని విజయవాడ సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా తెలిపారు. ఇందులో భాగంగా ఎంజీ రోడ్డులోని హోటల్ వివంత గ్రాండ్ సెంట్రల్ హాల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎక్స్‌పోలో ప్రముఖ నిర్మాణ సంస్థలు, పీఎం సూర్యఘర్ విక్రేతలు, రుణ సలహాదారులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో హోమ్ లోన్ అతి తక్కువ వడ్డీకి ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీ లేకుండా అందిస్తున్నట్లు బ్యాంక్ ఏజీఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుల్లేటికట్ట, ఓల్డ్ పంచాయతీ ఆఫీసు, గాంధీ బొమ్మ సెంటర్, రామాలయం సెంటర్, మైత్రీ నగరం, గంగిరెద్దుల దిబ్బ, వైఎస్సార్ కాలనీ, సాయి మెస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఏఈ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణ మృతి పార్టీకి తీరని లోటు : క్రాంతికుమార్

కృష్ణలంక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ డివిజన్‌లో టీడీపీ అభివృద్ధికి గజ్జలకొండ కృష్ణ ఎంతో కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. గజ్జలకొండ కృష్ణ గత 20 సంవత్సరాల నుంచి టీడీపీ క్రియాశీలక సభ్యులుగా వుంటూ ప్రస్తుతం డివిజన్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారన్నారు. బుధవారం తెల్లవారు జామున గజ్జలకొండ కృష్ణ గుండెపోటుతో హఠాన్మరణం పొందడంతో గద్దె క్రాంతి కుమార్ కృష్ణలంకలోని కృష్ణ ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయంపై టీడీపీ జెండా ఉంచి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టిఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారు. టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, అమ్మిశెట్టి వాసు, శంకర్ బాబు, గద్దె క్రాంతికుమార్, భవకుమార్, ఎస్.ఫిరోజ్, గన్నె తూమాటి

రాజేంద్రప్రసాద్‌ను మెజారిటీతో గెలిపించుకోవాలి

శాప్ చైర్మన్ రవినాయుడు

భారతీనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను చరిత్రలో నిలిచేలా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. తూర్పు పరిధి కనకదుర్గా ఆఫీసర్స్ కాలనీలోని ఫ్రైడ్ మాధవ్ హోటల్‌లో ఎమ్మెల్సీ అశోక్‌బాబు అధ్యక్షతన బుధవారం కూటమి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు పాల్గొన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీలో లేనప్పటికి ఈ ఎన్నికలను తేలికగా తీసుకోకూడదన్నారు. కూటమి పాలనకు ఈ ఎన్నికలు ఒక పరీక్ష అని అన్నారు. ఈ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మోజారీటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజు ఓటరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. తూర్పులోని 21డివిజన్ల లోని ఓటర్ల జాబితాను పరిశీలించి ఓటర్లను కలిసి ఓటువేసే విధానంపై అవగాహన కల్పించాలని అన్నారు. జనసేన తూర్పు ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం ఇన్‌చార్జ్ వెలగపూడి శంకర్ బాబు, టీడీపీ నాయకులు గద్దె క్రాంతికుమార్, బొప్పన భవకుమార్, ఎస్.ఫిరోజ్, గన్నె వెంకట నారాయణ ప్రసాద్, తూమాటి ప్రేమనాథ్, కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు కాన్వాయ్ డ్రైవర్‌కు క్రాంతికుమార్ ఘన నివాళి

పటమట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కాన్వాయ్ డ్రైవర్ అమీన్ భౌతికకాయాన్ని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాన్వాయ్ డ్రైవర్ అమీన్ గుండెపోటుతో మృతి చెందాడు. 12వ డివిజన్ ఫరూక్‌నగర్‌లోని అమీన్ ఇంటి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు ఉన్నారు.

పీఎం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులకు అభినందనలు



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన పీఎం ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శనలో తమ కళాశాల క్యాడెట్లు పాల్గొని ప్రశంసలు పొందడం రాష్ట్రానికి, తమకు ఎంతో గర్వకారణం అని నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. తమ కళాశాల నుంచి ఎం.శ్వేతశ్రీ, షేక్ ఆయేషా సుల్తానా, కే.సత్య హారికలు పీఎం ర్యాలీలో పాల్గొని నృత్య ప్రదర్శన చేశారని తెలిపారు. వీరిని తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి తదితరులు అభినందించి మొమెంటోలను అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను నలంద సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విరసం సభ్యులు

8, 9 తేదీల్లో విరసం ఆధ్వర్యంలో సాహిత్య తరగతులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం 1970 ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన సాహిత్యరంగంలో పని చేస్తుందని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూల్‌లో జరిగే విరసం 25వ సాహిత్య తరగతుల పోస్టర్, కరపత్రాన్ని గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. సాహిత్య పాఠశాలలో సంక్షోభం కాలంలో సాహిత్యకారుల పాత్ర అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. విరసం అధ్యక్ష, కార్యదర్శులు అరసవిల్లి కృష్ణ, రివేరా, మందరపు హైమావతి, మణిమిత్ర తదితరులు పాల్గొన్నారు.

చర్మసంరక్షణపై గురుకుల కళాశాలలో అవగాహన

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కళాశాల వసతి గృహాల్లో విద్యార్థినులు చర్మ సంబంధిత అంటువ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గురుకుల కళాశాల (ఎస్ఆర్ఆర్) ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీజర పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎస్ఆర్ స్కిన్ కేర్‌లో చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ కె.సుమబిందు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చర్మసంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుమబిందుని ప్రిన్సిపాల్, అధ్యాపకులు జ్ఞాపికతో సత్కరించారు. కళాశాల మహిళా సాధికారిత విభాగం అండ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆరోగ్య శిబిరంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుమిత్ర, లావణ్య, సత్యవాణి, డాక్టర్ లక్ష్మి, దివ్య తదితర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి బీసీల ద్రోహి : లుక్కా

వన్‌టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బీసీల ద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికులకు పదిశాతం మద్యం దుకాణాలను కేటాయించి వారి అభివృద్ధికి సహకరించడాన్ని ఓర్వలేక తన న్యాయవాదుల చేత పథకాలను రద్దు చేయాలంటూ కోర్టులలో పిటీషన్‌లు వేయించిన జగన్‌రెడ్డి బీసీల ద్రోహి అన్నారు. బీసీల జోలికి వస్తే సహించేది లేదని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. బీసీ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబు పాల్గొన్నారు

కల్లుగీత కార్మికుల విచ్ఛిన్నాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

- పేరం శివ నాగేశ్వరరావు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల విచ్ఛిన్నం జరుగుతుందని, దీనిని ఎదుర్కోవాలని అఖిలభారత గౌడ సంఘం చైర్మన్ పేరం శివ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, శ్రీసైన, యాత, కలాల్, కలారి తదితర కులాలన్నింటికి గౌడ కులంగా నామకరణం చేశారని గుర్తు చేశారు. నాటి నుంచి ఐక్యంగా ఉన్న గౌడ జాతిని బ్రాందీ షాపుల్లో వాటా అడిగినందుకు కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా 10 కులాల పేర్లతో విచ్ఛిన్నం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా గౌడ్‌లకు 20 శాతం మద్యం దుకాణాల్లో వాటా ఇస్తామని, నేడు 10 శాతం ఇచ్చి మోసం చేశారన్నారు. కల్లుగీత కార్మికులను గౌడ కులంగానే కొనసాగించాలనే డిమాండ్‌తో ఐక్యపోరాటానికి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఆక్రమణ


రామవరప్పాడు జంక్షన్ వద్ద..


సెంటినీ హాస్పిటల్ సర్వీస్ రోడ్...




ప్రభుత్వాసుపత్రి సర్వీస్ రోడ్


నిర్మలా కాన్వెంట్ వద్ద సర్వీస్ రోడ్

నగరంలో ఎక్కడ చూసినా.. ఆక్రమణలే.. చిన్న జాగా కనిపిస్తే చాలు అక్కడ టెంట్ వేసి ఆక్రమిం చేస్తున్నారు. ఇలాంటి వాటిపై దృష్టి సారిం చాల్సి న అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహ రిస్తున్నారు. నగరంలో ప్రధాన సెంటర్లలో ఒకటైన రామవరప్పాడు సెంటర్‌లో కార్ల స్టాండ్ పేరుతో టెంట్ వేసేశారు. బారులు తీరిన కార్లతో రోడ్డు మూసుకుపోయింది. వెడల్పాటి రోడ్డు సైతం చిన్న సందులా మారింది. అంతేకాక బెంజిసర్కిల్ నిర్మలా కాన్వెంట్, సెంటినీ హాస్పిటల్ వద్ద సర్వీస్ రోడ్లపై వాహనాలు అనధికారికంగా పార్కింగ్ చేస్తుండటంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇలా సర్వీస్ రోడ్లపై పార్కింగ్ చేసే విధానాన్ని నియంత్రించాలి.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ


రాజ్‌నాథ్ సింగ్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న నారా లోకేశ్

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి లోకేశ్

వన్‌టౌన్,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఢిల్లీలో బుధవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కేంద్ర పౌరవిమానయా న శాఖ మంత్రి రామ్మోహననాయుడు, కేంద్ర భారీ పరిశ్రమ, ఉక్కు శాఖ స హాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు గంటి హరీష్ మాధుర్, బస్తిపాటి నాగరాజు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌తో పాటు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత పాలకుల అనాలోచిత విధానాలతో లక్షల కోట్ల అప్పుల్లో మునిగిన ఏపీకి అండగా ఉంటూ, రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు మంత్రికి శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై దర్యాప్తు

వన్‌టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు కొత్తపేట సీఐ చినకొండల రావు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్‌లో పలువురు ముఠాగా ఏర్పడి వివిధ వర్సిటీల నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 20 మందికి పైగా ఆ ముఠాలో సభ్యులు చెప్పిన మాయమాటలు నమ్మి డబ్బులు చెల్లించారు. సర్టిఫికెట్ల కోసం బాధితులు అడుగుతున్నప్పటికీ ముఠా సభ్యులు కాలయాపన చేస్తున్నారు. కొందరు బాధితులు గట్టిగా ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారంపై మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ నకిలీ సర్టిఫికెట్లలో కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల పేరిట డిగ్రీ సర్టిఫికెట్ కూడా ఉండటంతో సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చినకొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ముఠాలోని సభ్యులను గుర్తించినట్టు సమాచారం.

డబ్బులు తిరిగిచ్చేయండి: బాధితులు

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాలో మోసపోయిన బాధితులు తామిచ్చిన డబ్బులు తిరిగిచ్చేయమని కోరుతున్నారు. అయితే ఆ ముఠాలోని పలువురు సభ్యులు ఎవరికి వారే తమకు సంబంధం లేదంటూ తప్పించుకోవటంతో బాధితులను పోలీసులను ఆశ్రయించటానికి సిద్ధమైనట్టు సమాచారం.

ఆకస్మిక తనిఖీలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల అధికారులు బుధవారం సాయంత్రం మొగల్రాజపురం ప్రాంతంలో పలు రేషన్ దుకాణాలను, వాటికి అనుబంధంగా ఉన్న ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ తనిఖీలలో భాగంగా మొగల్రాజపురం 321, 234 రేషన్ దుకాణాలను ముందుగా తనిఖీ చేశారు. దుకాణంలో నిల్వలను, స్టాక్ బోర్డులను పరిశీలించారు. అక్కడి నుంచి ఆ డిపోలకు చెందిన ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లారు. అక్కడ ఈ పోస్ మిషన్‌లో స్టాకుకు, వాహనంలోని స్టాకును పోల్చి చూశారు. కార్డుదారులతో మాట్లాడి పంపిణీ జరుగుతున్న తీరుపై అభిప్రాయాలు తీసుకున్నారు. ఎక్కువమంది కార్డుదారులు కందిపప్పు కూడా ఇప్పించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా జిల్లాపౌరసరఫరాల అధికారి పాపారావు మాట్లాడుతూ తనిఖీలు ప్రతిరోజు జరుగుతాయన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ పౌరసరఫరాల అధికారి సర్కిల్-2 శ్రీనివాస్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు కిషోర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- విస్తృత తనిఖీలతో నిరంతర పర్యవేక్షణ
- ప్రజా పంపిణీని పటిష్టంగా అమలు చేయండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ట అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు తీరుతెన్నులు, చేపట్టాల్సిన తనిఖీలు, ఉల్లంఘనలపై కేసుల నమోదు తదితర అంశాలపై పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. దీనికి కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, పౌరసరఫరాల అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, 7 ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి నెలా 20 దుకాణాలు, తహసీల్దార్లు 5 దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయాలన్నారు. 2024 జూలై నుంచి డిసెంబరు వరకు 6ఏ కేసులు 119 నమోదయ్యాయని, ఇకపై క్రియాశీలంగా వ్యవహరిస్తూ చట్టప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణపై కలెక్టర్ పౌరసరఫరాల అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు 16,217 మంది రైతుల నుంచి రూ.254కోట్ల విలువైన 1,09,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, పాల్గొన్నారు.

సీబీఐ కోర్టు స్పెషల్ పీపీగా వెన్నా కళ్యాణ్



విజయవాడ లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీబీఐ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెన్నా కళ్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈయన తండ్రి సీనియర్ న్యాయవాది, విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు మాజీ ఏపీపీ వెన్నా రమేష్ చంద్రబాబు. తండ్రి అడుగుజాడల్లోనే ప్రాక్టీసు చేస్తూ తండ్రిని మించిన తనయుడిగా ఏకంగా సీబీఐ కోర్టుకే స్పెషల్ పీపీగా కళ్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. కళ్యాణ్ 2013లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. విజయవాడలోని సీబీఐ కోర్టు, విశాఖ, కర్నూల్‌లోని సీబీఐ కోర్టులకు స్పెషల్ పీపీగా వెన్నా కళ్యాణ్ చక్రవర్తి వ్యవహరిస్తారు. ఈయన నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు వి.గురునాథం, చేకూరి శ్రీపతి, పడవల ఏడుకొండలు, కోట జయరాజు, బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.


డైరీని ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, తదితరులు

గిడ్డంగుల సంస్థ డైరీ ఆవిష్కరణ

ఆటోనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నూతన సంవత్సర డైరీని సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎండీ సురేష్ కుమార్ బుధవారం ఆటోనగర్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గిడ్డంగుల సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీఎం చంద్రశేఖర్, రవికుమార్, జవహర్‌బాబు, మాధవరావు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ఒక టూరిస్టు

- శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీ కార్యక్రమాలకు రాకపోవడంతో జగన్‌మోహన రెడ్డి కొత్త డ్రామాలకు తెర తీశాడని శాప్ చైర్మన్ రవి నాయుడు ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కార్యకర్తల గొంతుకోశానని ఒప్పుకున్న జగన్ ఇప్పుడు మళ్లీ కార్యకర్తల జపం ఎలా చేస్తున్నాడని ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తలు జగన్ గురించి తెలుసుకుంటే మంచిదని ఆయన టూరిస్టు పాత్ర పోషిస్తూ నాలుగు మాటలు చెప్పి వెళ్లిపోతారన్నారు. జగన్ గుండెకాయ, తలకాయ, కుడి భుజం, ఎడమ భుజం అందరూ రాజీనామాలు చేస్తుంటే ఏం చేయాలో తెలియక నన్ను నమ్మండి నేను చూసుకుంటానంటూ కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడన్నారు. 2.0 కాదు ఎన్ని పాయింట్లు పెట్టుకున్నా పక్కన నిలబడే వారులేరని, ఇప్పటికైనా మానవత్వంతో ఆలోచన చేస్తే మంచిదని హితవు పలికారు.

రేపటి నుంచి సుమధుర హాస్య నాటికల పోటీలు


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సామంతపూడి నరసరాజు, ఎం.సి.దాసు, భాస్కరశర్మ తదితరులు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం, 27వ తెలుగు హాస్య నాటికల పోటీలు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ముమ్మనేని సిద్ధార్థ కళాపీఠం సౌజన్యంతో నిర్వహిస్తున్నట్టు కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్య నాటికలపై పోటీలు నిర్వహించే ఒకే ఒక సంస్థ సుమధుర అని, ఈ మూడు రోజుల పోటీలలో 7 నాటికలు, 2 ఆహ్వాన నాటికలు ప్రదర్శితమవుతాయని తెలిపారు. ప్రదర్శించే ప్రతి నాటికకు రూ.15 వేల నగదు పారితోషికం అందజేస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్న వారికి వరుసగా 15, 12, 10 వేల రూపాయల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. మూడో రోజు ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దాదాపు అన్ని కళారూపాల ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. సుమధుర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎంసీ దాస్ మాట్లాడుతూ, హాస్యబ్రహ్మ జంధ్యాల సూచన మేరకు రెండున్నర దశాబ్దాల క్రితం హాస్య నాటిక పోటీలు ప్రారంభించి క్రమం తప్పక నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. సుమధుర ప్రధాన కార్యదర్శి విజయభాస్కరశర్మ మాట్లాడుతూ కళల పట్ల అనురక్తిని కలిగి వుండే యువతను ప్రోత్సహించే దిశలో సుమధుర సదాలోచనతో ముందుకు సాగుతోందన్నారు. 7న జీఆర్‌కే మూర్తి స్మారక పురస్కారాన్ని నటుడు, దర్శకుడు, రచయిత ఎస్‌కే మిశ్రాకు, 8వ తేదీ శనగల కబీర్ దాస్ స్మారక పురస్కారాలను పి.సాయి శంకర్, బి.రూపాశ్రీలకు, 9వ తేదీ జంధ్యాల స్మారక పురస్కారాన్ని నటులు, దర్శకులు సుబ్బరాయశర్మకు ప్రధానం చేస్తున్నట్టు తెలిపారు. నాటికల పోటీలకు స్క్రూట్నీ నిర్వహించిన డి.కైలాసరావు మాట్లాడుతూ, పూర్తి హాస్య ప్రాధాన్యతతో సాగే నాటికలు కనుమరుగు కాకుండా వుండటం కోసమే పోటీలు కొనసాగిస్తున్నామన్నారు.

నందిగామ చైర్‌పర్సన్ ఎన్నికపై వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నందిగామ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం సమావేశం నిర్వహణను సవాల్ చేస్తూ దాఖలైన వాజ్యాన్ని బుధవారం హైకోర్టు కొట్టివేసింది. వాజ్యం దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు అర్హతలేదని స్పష్టం చేశారు. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత తీర్పు ఇచ్చారు.

నందిగామ మున్సిపాలిటీలో ఖాళీ అయిన రెండు వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఉపఎన్నికలు జరిపిన తరువాతే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నందిగామ పట్టణానికి చెందిన నాదెండ్ల హారిక హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, నందిగామ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ శిరీష వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

మచిలీపట్నం-ధనపూర్ మధ్య

మహాకుంభ్‌కు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌కు వెళ్లే భక్తుల కోసం విజయవాడ రైల్వే డివిజన్ అదనపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ వీఆర్‌వో నుస్రత్ మండ్రూప్‌కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-ధనపూర్ మధ్య 07113 నెంబరు రైలు ఉదయం 11 గంటలకు బయలుదేరి మరునాడు రాత్రి 11.55 గంటలకు ధనపూర్ చేరుకుంటుంది. ఈనెల 8,16 తేదీల్లో నడుస్తుంది. 07114 ధనపూర్-మచిలీపట్నం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి మరునాడు వేకువ జామున 3 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 10, 18తేదీల్లో నడుస్తుంది. మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ, కొండపల్లి, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల్, బెల్లంపల్లి, సిరిపూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగపూర్, జుజహర్‌పూర్, ఇటార్సీ జంక్షన్, ప్రిపరియా, జబల్‌పూర్, కట్నీ, సత్నా, మాణిక్‌పూర్ జంక్షన్, ప్రయాగ్‌రాజ్ చియోకి, మీర్జాపూర్, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బుక్సర్, ఆరా మీదుగా దనపూర్, ఇదే రూట్‌లో తిరుగు ప్రయాణంలో మచిలీపట్నం చేరుకుంటారు.

ఏపీలోనూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ నివేదికను తెలంగాణ అసెంబ్లీలో పెట్టడంపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఎందరో ముఖ్యమంత్రులు చేయలేని సామాజిక న్యాయాన్ని చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించేలా సత్వర చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. జిల్లా యూనిట్ కాకుండా రాష్ట్ర యూనిట్ ఆధారంగా వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలన్నారు. సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్లు మానికొండ శ్రీధర్‌మాదిగ, పానుగంటి షాలెంరాజ్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ పాల్గొన్నారు.


రాళ్లు లేచి ప్రమాదకరంగా మారిన రోడ్డు






వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

గోతులు తీసి వదిలేశారు..

విజయవాడ రామవరప్పాడు ఫ్లై వోవర్ మీదుగా నగర శివారునున్న ముస్తాబాద్‌కు వెళ్లే రహదారి పూర్తిగా పాడై కంకర బయటికి వచ్చి ప్రమాదకరంగా తయారైంది. ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదనీటిని బయటికి పంపేందుకు వీలుగా ఈ రోడ్డును అధికారులు కొట్టేశారు. అప్పటికప్పుడు ప్యాచ్ వర్కులు చేసి మమ అనిపించినా తర్వాత నుంచి రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఎక్సకవేటర్‌తో రోడ్డును సమాంతరం చేసే పనులు ప్రారంభించారు. అంతలోనే ఏం జరిగిందో ఏమోగానీ తర్వాతి రోజు నుంచి పనులు ఆగిపోయాయి. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు తవ్వడంతో రోడ్డంతా గోతులమయంగా మారింది. అంతేకాక వాహనాల రాకపోకలకు విపరీతంగా దుమ్ము రేగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

టీటీడీలో హిందూయేతర ఉద్యోగులపై చర్యలు

» తొలి విడతలో 18 మందిని గుర్తించిన బోర్డు

తిరుపతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో పనిచేస్తున్న హిందూయేతరులను గుర్తించి వారిని ఇతర విభాగాలకు బదిలీ చేయడమో లేక.. స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం ఇవ్వడమో చేస్తామని ప్రకటించిన టీటీడీ పాలక మండలి తాజాగా కార్యాచరణ ప్రారంభించింది. తొలి దశలో గుర్తించిన 18 మంది హిందూయేతర ఉద్యోగులను ఉత్సవాలు, వేడుకల విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. వారికి ఆ తరహా విధులను అప్పగించరాదని ఆయా విభాగాల అధిపతులకు స్పష్టం చేసింది. ఇప్పటికే వారిలో ఎవరైనా ఆలయాలు, మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో పనిచేస్తుంటే తక్షణం బదిలీ చేయాలని, సాధారణ విధులు అప్పగించాలని ఆదేశించింది. టీటీడీలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కేటగిరీల్లో సుమారు 25 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో హిందూయేతరులైన ఉద్యోగుల సంఖ్య గణనీయంగా ఉందనే ఆరోపణలున్నాయి. సుమారు పదేళ్ల కిందట టీటీడీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేసిన స్నేహలత అనే అధికారి ఏకంగా టీటీడీ అధికారిక వాహనంలోనే చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం అప్పట్లో దుమారం రేపింది. హిందూ సంఘాలు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటివి తీవ్రంగా స్పందించాయి. అప్పటి టీటీడీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించి చర్యలకు ఉపక్రమించారు. దేవస్థానంలో అన్యమతాలకు చెందిన ఉద్యోగులు ఎందరున్నారు? అన్న దానిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో సుమారు 300 మందికి పైగా హిందూయేతరులు టీటీడీలో పనిచేస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. వారిని సాగనంపి ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసే ప్రతిపాదన కూడా అప్పట్లో తెరమీదకు వచ్చింది. అంతలో ఎల్వీ బదిలీ కావడంతో విషయం మరుగున పడింది.



సింఘాల్ వచ్చాక

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా క్రిష్టఫర్ అనే అధికారి నియమితులు కావడం వివాదంగా మారింది. 2018లో అనిల్‌కుమార్ సింఘాల్ ఈవోగా ఉన్నప్పుడు ఈ వివాదం మళ్లీ తలెత్తడంతో హిందూయేతర అధికారులు, సిబ్బందిపై సీరియస్‌గా కసరత్తు చేశారు. 44 మందిని గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిని దేవస్థానం నుంచి ఇతర శాఖలకు బదిలీ చేసే ప్రతిపాదన అమలు చేయడానికి ప్రయత్నించారు. అయితే, ఆ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రయత్నం నెరవేరలేదు. హిందూ మతానికి విరుద్ధంగా ప్రవర్తించబోమని ప్రమాణం చేయాలని హైకోర్టు ఆ ఉద్యోగులకు నిబంధన విధించింది. దీంతో వారు ఆ మేరకు ప్రమాణం చేసి టీటీడీలో కొనసాగుతున్నారు.

బోర్డు తొలి భేటీలోనే..

టీటీడీ పాలకమండలి ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేయకముందే టీటీడీలో హిందూయేతర ఉద్యోగులను కొనసాగించే ప్రసక్తే లేదని స్పష్టంగా ప్రకటించారు. దానికి అనుగుణంగానే గత నవంబరు 18న జరిగిన పాలక మండలి తొలి సమావేశంలో ఈ విషయాన్ని అజెండాలో ప్రధాన అంశంగా చేర్చారు. హిందూయేతర ఉద్యోగులకు రెండు అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. వీటిలో 1. వీఆర్ఎస్ ఎంచుకోవడం. 2. ప్రభుత్వంలోని ఇతర శాఖలకు బదిలీ కావడం. అయితే.. తొలుత టీటీడీలో ఎంతమంది అన్యమత ఉద్యోగులు పనిచేస్తున్నారో లెక్కలు తీయాలని నిర్ణయించారు.

ప్రమాణం చేసి కూడా

టీటీడీలో పనిచేస్తున్న వారిలో 18 మంది హిందూయేతరులు ఉన్నారని ఈ నెల 1న అధికారులు పేర్కొన్నారు. అయితే.. వీరంతా హిందూయేతరులని గతంలోనే అధికారులు గుర్తించారు. అప్పట్లో.. శ్రీవారి చిత్రపటం ఎదుట నిలబడి.. హిందూమతాన్ని అనుసరిస్తామని, మరే ఇతర మతాల ఆచార వ్యవహారాలను పాటించమని ప్రమాణం చేశారు. అలా ప్రమాణం చేసినా కూడా వీరు ఇతర మతాలను అనుసరిస్తున్నారని, అదే సమయంలో టీటీడీ ఉద్యోగ విధుల్లో భాగంగా ఆలయాల్లోనూ, ఉత్సవాల్లోనూ పాల్గొంటున్నట్టు టీటీడీ గుర్తించింది. ఈ కారణంగా తక్షణం వారిని ఆలయాలు, ఉత్సవాల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. కాగా, రానున్న రెండు మూడు నెలల్లో టీటీడీలో హిందూయేతర ఉద్యోగులు ఎందరున్నారనే విషయమై లోతుగా విచారణ జరిపి గుర్తించే ప్రయత్నం జరుగుతోంది. ఈ నెల 11న సీఎం చంద్రబాబు వద్ద ఈ అంశం ప్రస్తావించాలని టీటీడీ అధికారులు, ఛైర్మన్ భావిస్తున్నారు.

> **ప్రసాదం వద్దనే ఉద్యోగులు మాకొద్దు!**
>
> టీటీడీ ఇస్తున్న జీతం తీసుకుంటూ.. స్వామి ప్రసాదం, హారతులు వద్దనే ఉద్యోగులు మాకొద్దు. వారిని టీటీడీ నుంచి వెంటనే తొలగించాలి. హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. విచారణ పేరుతో అసలైన హిందువులను ఇబ్బంది పెట్టడం సరికాదు. హిందువులు కానివారిని గుర్తించి తొలగించే ప్రక్రియ వేగవంతమైంది.
>
> **- భాను ప్రకాశ్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు**

రాష్ట్రంలో 109 మోడల్ అంగన్‌వాడీలు

» అపోలో ఫౌండేషన్ తరపున ఉపాసన కొణిదెల చొరవ



పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తల్లులు, నవజాత శిశువులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, పోషణ, ప్రాథమిక శిశు సంరక్షణ అందించడమే లక్ష్యంగా అపోలో గ్రూపు రాష్ట్రంలో మోడల్ అంగన్‌వాడీలు ప్రారంభించాలని నిర్ణయించింది. అపోలో గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఫౌండేషన్ తరపున ఉపాసన కొణిదెల సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. కార్యక్రమ నిర్వహణలో ఫౌండేషన్ ప్రతినిధిగా ఉపాసన క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. రాష్ట్రంలో 109 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు.

పవన్ కల్యాణ్‌కు అస్వస్థత

» తీవ్ర జ్వరం, స్పాండిలైటిస్‌తో ఇబ్బంది

» కేబినెట్‌కు హాజరు కాలేకపోవచ్చని పార్టీ వెల్లడి



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన తీవ్ర జ్వరంతోపాటు స్పాండిలైటిస్ సమస్యతో బాధపడుతున్నారని జనసేన పార్టీ కార్యాలయం బుధవారం ప్రకటించింది. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని వెల్లడించింది. ఈ నేపథ్యంలో గురువారం సచివాలయంలో జరిగే మంత్రివర్గ సమావేశానికి ఆయన హాజరు కాలేకపోచ్చని తెలిపింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి మంత్రివర్గ సమావేశానికీ ఆయన హాజరవుతూ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్రస్తుతం అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోతున్నారని పార్టీ కార్యాలయం తెలిపింది.

చిత్రజ్యోతి

SINCE 1965

కొత్తవారికి సౌదీ సహకారం

● సౌదీ అరేబియా ఫిల్మ్ కమిషన్ ప్రతినిధులు



అంతర్జాతీయంగా సినిమా ఔత్సాహికులకు సౌదీ అరేబియా ఫిల్మ్ కమిషన్ సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తమ కమిటీకి స్క్రిప్ట్ నచ్చితే, సినిమా నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు సౌదీ లో చిత్రీకరణకు లొకేషన్స్‌కు అనుమతించడం వంటి విషయాల్లో అండగా నిలుస్తామని చెప్పారు. అయితే, అది తమ దేశ నిబంధనలకు లోబడి ఉంటుందని అన్నారు. సౌదీ ఫిల్మ్ కమిషన్ నుంచి సహాయం పొందాలనుకొనే ఔత్సాహికులు ఫిల్మ్ డాట్ ఎస్ ఏ వెబ్ సైట్ లో ఇన్ సెంటీవ్ ప్రోగ్రాం విభాగంలో దరఖాస్తు చేసుకోవచ్చు అని సౌదీ ఫిల్మ్ కమిషన్ ప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా వివరించారు. సౌదీ ఫిల్మ్ నైట్స్ కార్యక్రమంలో భాగంగా ఆ దేశ ఫిల్మ్ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్ లోని పీవీఆర్ అర్కే లో 'ది స్లేమ్' ఫీచర్ ఫిల్మ్‌తో పాటు 'మాష్నియాస్ లైఫ్' లఘు చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆ దేశ యువ దర్శకుడు సాద్ తహైత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... షారుఖ్‌ఖాన్ 'జవాన్' సినిమా తనతో పాటు సౌదీ లో చాలా మందికి నచ్చిందని తెలిపారు.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

నన్ను మరోస్థాయికి తీసుకెళ్లే చిత్రం

నాగచైతన్య



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు నాగచైతన్య. "తండేల్ సినిమా నా కెరీర్‌లో బిగ్గెస్ట్ చిత్రం. దర్శకుడు చందుతో నాకిది మూడో సినిమా. నన్ను కొత్తగా చూపించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఈ సినిమా కథను మొదట చందు చెప్పినప్పుడు అది డాక్యుమెంటరీలాగా అనిపించింది. సినిమాటిక్‌గా తయారు చేయమని చెప్పా. కొన్ని మార్పులు చేసి అద్భుతంగా మార్చారు. ఈ కథ వినే సమయంలో ఎంతో స్ఫూర్తినిచ్చింది. వెంటనే ఓకే చేశాను. ఇందులో నా పాత్ర తండేల్ రాజు కోసం చాలా శ్రమపడ్డాను. శ్రీకాకుళం వెళ్లి అక్కడ ఉండే మత్స్యకారుల జీవితాలను, వారి వేషభాషలను గమనించాను. ఒక నటుడిగా ఈ సినిమాతో నేనో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాను. ఈ సినిమా నేపథ్యం కొత్తగా ఉండడం వల్ల చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా అంతా ఒక లెవెల్‌లో ఉంటే.. సెకండ్ ఆఫ్ మరో వీర లెవెల్‌లో ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. కథే ఈ సినిమాకు హీరో. వాస్తవిక సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూసి ప్రేక్షకులు భావోద్వేగానికి లోనవుతారు. ఈ సినిమా చివరి 30 నిమిషాలు చాలా బాగా నచ్చేసింది. క్లైమాక్స్ చాలా సంతృప్తిని ఇచ్చింది. ఈ చిత్రం ఓ నటుడిగా నన్ను మరోస్థాయికి తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది. పాటలు అద్భుతంగా వచ్చాయి. తండేల్‌రాజు-సత్య ప్రేమ కథ తప్పకుండా అందరి హృదయాలను గెలుచుకుంటుంది" అని చెప్పారు.

నాకేం అసూయ లేదు




తన జీవితంలో అసూయకు స్థానం లేదన్నారు కథానాయిక సమంత. తన మాజీ భర్త నాగచైతన్య రెండో వివాహంపై సమంత తొలిసారి స్పందించారు. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'జీవితంలో అన్ని అనర్థాలకు మూలం అసూయే. దానికి నా జీవితంలో స్థానం లేదు. గతంలో నాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నవారిపైన నాకేం కోపం, అసూయ లేవు. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను' అని పరోక్షంగా నాగచైతన్య గురించి స్పందించారు. ఒకరిపైన అసూయను పెంచుకోవడం వల్ల బాధపడడం తప్ప ఒరిగేదేముంది అన్నారు. రిలేషన్‌షిప్ వల్ల గతంలో చాలా కష్టాలు పడ్డానని చెప్పారు. వాటి నుంచి బయటపడడానికి చాలా శ్రమించాల్సి వచ్చిందనీ, ఆ అనుభవాల దృష్ట్యా ప్రస్తుతం రిలేషన్‌షిప్ గురించి ఆలోచించడం లేదని తెలిపారు. సమంతతో విడాకుల అనంతరం నాగచైతన్య హీరోయిన్ శోభితా ధూళిపాళ్లను పెళ్లాడిన విషయం తెలిసిందే.

మంచి కథా బలం ఉన్న చిత్రాలు నిర్మిస్తా

- శింగనమల రమేశ్‌బాబు



పవన్‌కల్యాణ్‌తో 'పులి', మహేశ్‌బాబుతో 'ఖలేజా' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు తీసిన నిర్మాత శింగనమల రమేశ్‌బాబు. ఓ కేసు విషయంలో 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేసి నిర్దోషిగా నిరూపించుకున్న ఆయన బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా మీదున్న ప్రేమతో నిర్మాతగా మారాను. పలు సినిమాలు నిర్మించాను. నా దగ్గరున్న స్థలాలను ఒకరికి తెలియకుండా, ఒకరికి అమ్మానని.. నాపై కేసు పెట్టారు. 14 ఏళ్లు న్యాయం కోసం పోరాడాను. న్యాయస్థానంలో అది తప్పుడు కేసు అని రుజువైంది. కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది. నా సుదీర్ఘ న్యాయపోరాటం గెలిచింది. నాకు సినిమా తల్లిలాంటిది. నా పిల్లలు కూడా పరిశ్రమలోనే ఉన్నారు. భవిష్యత్తులోనూ మంచి కథాబలం ఉన్న సినిమాలు నిర్మిస్తాను. త్వరలోనే ఓ కొత్త సినిమాను ప్రకటిస్తాను. గతంలో జరిగిన తప్పులు మళ్లీ రిపీట్ కాకుండా జాగ్రత్తపడతాను" అని చెప్పారు.



ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర పోషించలేదు

- సాయిరామ్ శంకర్



సాయిరామ్ శంకర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. మలయాళ దర్శకుడు వినోద్‌కుమార్ విజయన్ తెరకెక్కించగా, గార్లపాటి రమేశ్ నిర్మించారు. సముద్రఖని, శృతి సోధి, ఆషిమా నర్వాల్ కీలక పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిరామ్ శంకర్ చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు. "ఇందులో ఎన్నో షేడ్స్ ఉండే క్రిమినల్ లాయర్ పాత్రను పోషించాను. నా కెరీర్‌లో ఇప్పటివరకూ ఇలాంటి సినిమా చేయలేదు. అలాగే, ఇన్ని రకాల షేడ్స్ ఉన్న పాత్రలో నటించలేదు. దర్శకుడు వినోద్ నాకు చాలా ఏళ్ల నుంచి తెలుసు. ఇద్దరం కలసి చాలా సార్లు సినిమా చేద్దాం అని అనుకున్నాం. మంచి ప్రతిభ గల దర్శకుడు ఆయన. ఈ సినిమాలో ప్రతీ పాత్రను ఎంతో జాగ్రత్తగా డిజైన్ చేశారు. ఇది క్రైమ్ జానర్‌లో సాగుతూనే సందేశం ఇచ్చే సినిమా" అని చెప్పారు.

ప్రేమకథకు శ్రీకారం



తన కుమారుడు మారిశెట్టి అఖిల్‌ను హీరోగా పరిచయం చేస్తూ అనకాపల్లి జిల్లాకు చెందిన రాజకీయవేత్త మారిశెట్టి శ్రీకాంత్ నిర్మించే చిత్రం షూటింగ్ మంగళవారం లక్ష్మీపురం గ్రామంలోని రామాలయంలో మొదలైంది. నిర్మాత నట్టి కుమార్ తొలి క్లాప్ ఇచ్చారు. ఐదు రోజుల పాటు సాగే తొలి షెడ్యూల్‌లో ఒక పాట, ఓ ఫైట్ చిత్రీకరిస్తామని నిర్మాత శ్రీకాంత్ చెప్పారు. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తామని తెలిపారు. హారర్, కామెడీ అంశాలతో రూపొందుతున్న ప్రేమ కథాచిత్రమిదని దర్శకుడు శ్రీధర్ చెప్పారు. భానుశ్రీ ఈ చిత్రంలో హీరోయిన్.

భూమిని కాపాడే వీరుల తొలి అడుగులు



మార్వెల్ కామిక్స్ ఆధారంగా రూపొందిన 'ఫెంటాస్టిక్ ఫోర్' సినిమాలకు ఉన్న విశేష ఆదరణ గురించి తెలిసిందే.దుష్ట శక్తుల నుంచి భూమిని రక్షించే సూపర్‌హీరోల కథాంశంగా తెరకెక్కిన ఈ 'ఫెంటాస్టిక్ ఫోర్' ఫ్రాంచైజీలో ఇప్పటివరకూ నాలుగు సినిమాలు వచ్చాయి. తాజాగా, ఈ సిరీస్ నుంచి ఓ కొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. 'ఫెంటాస్టిక్ ఫోర్: ద ఫస్ట్ స్టెప్స్' టైటిల్‌తో 1960ల నేపథ్యంలో సాగే ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. విలన్ గలాక్టస్, ఆయన సహచరుల బారి నుంచి 'ఫెంటాస్టిక్ ఫోర్' (మిస్టర్ ఫెంటాస్టిక్, హ్యూమన్ టార్చ్, ద ఇన్‌విజిబుల్ విమెన్, థింగ్) ప్రపంచాన్ని కాపాడేందుకు చేసే పోరాట ఘట్టాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇందులో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లోకి ఈ నలుగురు సూపర్‌హీరోలు ఇప్పటివరకూ ఎందుకు భాగం కాలేదో చూపనున్నారని అంతా భావిస్తున్నారు. మాట్ షక్మాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 25న విడుదల కానుంది.



జాతీయ క్రీడల్లో గాయత్రికి పసిడి

ఆర్చర్ గణేశ్‌కు రెండు పతకాలు


హంసిని, గణేష్


గాయత్రి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తొమ్మిదో రోజు ఆంధ్రప్రదేశ్‌కు మూడు పతకాలు లభించాయి. డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన కనోయింగ్ కయాకింగ్‌లో మహిళల స్లాలోం కే1 పోటీల్లో కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన నగిడి గాయత్రి పసిడి పతకంతో మెరిసింది. ఆర్చరీలో కాంపౌండ్ విక్స్‌డ్ టీమ్ విభాగంలో గణేష్ మణిరత్నం-సూర్య హంసిని జోడీ 148-155 స్కోరుతో హరియాణా చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకుంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక పోరులో మణిరత్నం 149-144తో కుశాల్ దలాల్ (హరియాణా)పై నెగ్గి కాంస్యం సొంతం చేసుకున్నాడు. ఇక, ఆర్చరీ మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు కాంస్యం సాధించింది.

94 14 వేల పరుగుల మార్క్ చేరుకోవడానికి కోహ్లీకి కావాల్సిన పరుగులు. వన్డేల్లో సచిన్ (18,426 పరుగులు), సంగక్కర (14,234 పరుగులు) కోహ్లీ కంటే ముందున్నారు.

5 200 వికెట్ల మైలురాయిని చేరుకోవడానికి షమీకి కావాల్సిన వికెట్లు.

త్రిషకు రూ. కోటి నజరానా

ప్రకటించిన తెలంగాణ సర్కారు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిషా రెడ్డికి తెలంగాణ సర్కారు భారీ నజరానా ప్రకటించింది. త్రిషకు రూ. కోటి నగదు అందజేయనున్నట్టు ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో ఆయన్ని త్రిష మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా త్రిషను అభినందించిన సీఎం.. ప్రభుత్వం తరఫున రూ. కోటి బహుమతిని ప్రకటించారు. త్రిషతో పాటు ఈ వరల్డ్ కప్ జట్టులో సభ్యురాలైన హైదరాబాద్ క్రికెటర్ కేసరి ధ్రుతికి రూ.10 లక్షలు, భారత జట్టు ప్రధాన కోచ్‌గా పనిచేసిన హైదరాబాదీ నౌషీన్ అల్ ఖదీర్‌కు, ఫిట్‌నెస్ ట్రైనర్ షాలినికి చెరో రూ.10 లక్షల రివార్డును సీఎం ప్రకటించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కూడా ప్రోత్సాహకంగా త్రిషకు రూ.10 లక్షలు, ధ్రుతి, నౌషీన్, షాలినికి తలో రూ.5 లక్షలను ప్రకటించింది.

పిచ్/వాతావరణం వికెట్ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. కానీ, బ్యాటింగ్‌కు కూడా అనుకూలమే. ఇక్కడి తొలి ఇన్నింగ్స్ సగటు 288 పరుగులు. అయితే, ఆరేళ్ల తర్వాత ఇక్కడే వన్డే మ్యాచ్ జరుగుతోంది. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది.

జట్లు **భారత్ (అంచనా):** రోహిత్, శుభ్‌మన్ గిల్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్/ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్/ సుందర్, కుల్దీప్, అర్ష్‌దీప్ సింగ్, షమి.
ఇంగ్లండ్ (తుది జట్టు): డకెట్, ఫిల్ సాల్ట్, రూట్, హ్యారీ బ్రూక్, జోష్ బట్లర్ (కెప్టెన్, వికెట్ కీపర్), లివింగ్‌స్టోన్, బెథల్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, రషీద్, షకీబ్ మహమూద్.


ప్రాక్టీస్‌లో కోహ్లీ

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

'చాంపియన్స్'కు ముందు

భలే చాన్స్!

- జట్టు కూర్పుపై రానున్న స్పష్టత
- కోహ్లీ, రోహిత్‌పైనే కళ్లన్నీ
- కీపర్ రేసులో రాహుల్, పంత్
- బలంగా కనిపిస్తున్న భారత్
- నేడు ఇంగ్లండ్‌తో తొలి వన్డే

నాగ్‌పూర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)కి సన్నాహకంగా ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో.. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై మరోసారి అందరి దృష్టి నిలవనుంది. కొందరు క్రికెటర్ల ఫామ్, ఫిట్‌నెస్‌తోపాటు కొన్ని స్థానాలను తగిన ఆటగాళ్లను ఎంపిక చేయడానికి ఈ సిరీస్‌ను సెలెక్టర్లు ఉపయోగించుకోనున్నారు. టీ20 సిరీస్ విజయంతో జోష్ మీదున్న భారత్ గురువారం జరిగే తొలి వన్డేలో ఇంగ్లండ్‌తో తలపడనుంది. 14 నెలల క్రితం జరిగిన వన్డే వరల్డ్‌కప్ తర్వాత స్వదేశంలో తొలిసారి భారత్ యాభై ఓవర్ల ఫార్మాట్ బరిలోకి దిగుతోంది. ఇటీవల టెస్టుల్లో ఘోరంగా విఫలమైన రోహిత్, కోహ్లీ ఈ సిరీస్‌లో మునుపటి ఆటతో చెలరేగాలని అభిమానులు కోరుకొంటున్నారు. 2023 విశ్వకప్‌లో కోహ్లీ 765, రోహిత్ 597 పరుగులతో అదరగొట్టారు. దీంతో టీమిండియా అజేయంగా వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరినా.. ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 0-2తో పరాజయం పాలైంది. రోహిత్ రెండు అర్ధ శతకాలు సాధించినా.. కోహ్లీ ఆకట్టుకోలేక పోయాడు. అదే పేలవ ఫామ్‌ను గత మూడు నెలలుగా వీరు కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే, చాంపియన్స్ ట్రోఫీకి ముందు తమ లోపాలను సరిదిద్దుకోవడానికి భారత ఆటగాళ్లకు ఇదే చివరి అవకాశం. వికెట్ కీపర్ విషయంలో కూడా మేనేజ్‌మెంట్ డోలాయమానంలో పడింది. కేఎల్ రాహుల్ లేదా రిషభ్ పంత్‌లో ఎవరికి తుది జట్టులో చోటు దక్కుతుందో తెలియదు. రోహిత్‌తో కలసి శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ చేయనుండగా.. కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ తర్వాత వికెట్ కీపర్-బ్యాటర్ బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో కీపర్‌గా వ్యవహరించిన రాహుల్ మిడిలార్డర్ బ్యాటర్‌గా రాణించాడు. కానీ, ఎడమ చేతి వాటం ఆటగాడైన పంత్ జట్టులో ఉంటే వైవిధ్యంతో పాటు అతడి దూకుడైన ఆట జట్టుకు అదనపు బలంగా మారొచ్చు. ఒకవేళ ఇద్దరినీ ఆడించాలనుకొంటే మాత్రం అయ్యర్ బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. వరల్డ్‌కప్ తర్వాత హార్దిక్ పాండ్యా తొలిసారి వన్డేలు ఆడుతున్నాడు. గాయాల నుంచి కోలుకొని మళ్లీ జట్టులోకి వచ్చిన వెటరన్ పేసర్ మహ్మద్ షమి, కుల్దీప్ యాదవ్ ఫిట్‌నెస్‌ను ఈ సిరీస్‌తో నిశితంగా పరీక్షించే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో షమి బరిలోకి దిగగా.. కుల్దీప్ సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చాడు. బుమ్రా, సిరాజ్ లేకపోవడంతో షమి, అర్ష్‌దీప్‌పైనే బౌలింగ్ భారం ఎక్కువగా పడనుంది. జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లో ఇద్దరే ఆడే చాన్సులున్నాయి. వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేసినా.. అతడిని ఆడించే అవకాశాలు తక్కువ.


పంత్




ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్, కోచ్ మెకల్లమ్

రూట్ రాకతో..

టీ20 సిరీస్‌లో ఓడిన ఇంగ్లండ్ వన్డేలతో బలంగా పుంజుకోవాలనుకొంటోంది. 14 నెలల విరామం తర్వాత జో రూట్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. దీంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ బలం పెరిగింది. ఈ ఒక్క మార్పు మినహా టీ20లు ఆడిన జట్టునే దాదాపుగా కొనసాగించనుంది. బట్లర్, లివింగ్‌స్టోన్, హ్యారీ బ్రూక్ రాణిస్తే ఈ జట్టు భారీ స్కోర్లు చేసే అవకాశం ఉంది. పేసర్ షకీబ్ మహమూద్‌కు తుది జట్టులో చోటు కల్పించారు.

టెన్నిస్‌కు హాలెప్ వీడ్కోలు



బుఖారెస్ట్ (రొమేనియా): రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత సిమోనా హాలెప్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. రొమేనియాకు చెందిన 33 ఏళ్ల హాలెప్ గాయాలు, డోపింగ్‌తో సస్పెన్షన్ అనంతరం టెన్నిస్‌లోకి పునరాగమనం చేయాలని కొంత కాలంగా ప్రయత్నించింది. కానీ, అది సాధ్య పడలేదు. 'సంతోషంతోనో విచారంతోనో ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తున్నానో తెలీదు. కానీ అటు ఆనందం, ఇటు బాధ కలుగుతున్నాయి. గతంలో మాదిరి పోటీలలో తలపడేందుకు నా శరీరం కూడా సహకరించడం లేదు' అని సిమోనా వివరించింది. 2017లో సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచిన హాలెప్.. 2018లో ఫ్రెంచ్ ఓపెన్, 2019లో వింబుల్డన్ టైటిళ్లు నెగ్గింది.

నేను పాక్ వెళ్లను

- భారత అంపైర్ నితిన్ ప్రకటన

దుబాయ్: భారత్ నుంచి ఐసీసీ ఎలీట్ ప్యానెల్‌లో ఏకైక అంపైర్‌గా ఉన్న నితిన్ మెనన్ చాంపియన్స్ ట్రోఫీ బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు బుధవారం ప్రకటించాడు. పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి ముగ్గురు రెఫరీలు, 12 మంది అంపైర్లు సహా మొత్తం 15 మంది మ్యాచ్ అధికారుల పేర్లను ఐసీసీ ప్రకటించింది. డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండీ పైక్రాఫ్ట్‌లు మ్యాచ్ రెఫరీలు వ్యవహరిస్తారు. 'చాంపియన్స్ ట్రోఫీకి ఐసీసీ ఎంపిక చేసిన అంపైర్ల జాబితాలో నితిన్ ఉన్నాడు. కానీ వ్యక్తిగత కారణాలతో పాక్ వెళ్లకూడదని అతడు నిర్ణయించుకున్నాడు' అని బీసీసీఐ తెలిపింది.

గార్డ్‌నర్‌కు గుజరాత్ జెయింట్స్ పగ్గాలు



అహ్మదాబాద్: ఈ సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ అష్లే గార్డ్‌నర్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఆసీస్‌కే చెందిన బెత్ మూనీ స్థానంలో గార్డ్‌నర్‌కు జట్టు పగ్గాలు అప్పగించినట్టు జెయింట్స్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. డబ్ల్యూపీఎల్ మూడో ఎడిషన్ ఈనెల 14న మొదలవనుంది.

ఇదేం ప్రశ్న?



మీడియా సమావేశంలో రోహిత్ అసహనం

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో రోహిత్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌లో తన పేలవ ఫామ్‌పై ఎదురైన ప్రశ్నకు రోహిత్ స్పందిస్తూ.. మీడియాపై అసహనం వ్యక్తం చేశాడు. 'అసలు.. ఇదేం ప్రశ్న? ఆ ఫార్మాట్ (టెస్టు) వేరు.. ఇది వేరు. దానికి దీనికి ఎందుకు పోలిక తెస్తున్నారు? ఆటగాడికి కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. ఇదేమీ కొత్త కాదు. నా ప్రయాణంలో ఇలాంటివెన్నో చూశాను. ప్రతి సిరీస్ తాజా ఆరంభాన్ని ఇస్తుందని నమ్ముతా' అని రోహిత్ అన్నాడు. కాగా, తన క్రికెట్ భవిష్యత్‌కు సంబంధించిన ఊహాగానాలపైనా హిట్‌మ్యాన్ స్పందించాడు. 'ఎన్నో ఏళ్లుగా వదంతులు వస్తూనే ఉన్నాయి. వాటిపై స్పష్టత ఇచ్చేందుకు ఇక్కడకు రాలేదు. నా దృష్టంతా ఇంగ్లండ్‌తో సిరీస్, చాంపియన్స్ ట్రోఫీపైనే ఉంది. ఆ తర్వాతే ఏంటనేది అప్పుడు ఆలోచిస్తాను' అని రోహిత్ చెప్పాడు. కాగా, నేటి మ్యాచ్‌లో కీపర్‌గా రాహుల్‌కే అవకాశం ఉంటుందన్నట్టుగా చెప్పాడు. షమీకి మద్దతుగా మాట్లాడిన రోహిత్.. బుమ్రా స్కాన్ రిపోర్టుల కోసం ఎదురుచూస్తున్నామన్నాడు.



అభిషేక్ @2

- ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: పొట్టి ఫార్మాట్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అభిషేక్ ఏకంగా 38 స్థానాలు మెరుగుపర్చుకొని రెండో ర్యాంక్‌లో నిలిచాడు. తిలక్ వర్మ ఒక మెట్టుదిగి మూడో ర్యాంక్‌లో, సూర్యకుమార్ యాదవ్ ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) టాప్‌లో కొనసాగుతున్నాడు. బౌలర్ల జాబితాలో విస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఆదిల్ రషీద్‌తో సమంగా రెండో ర్యాంక్‌లో నిలిచాడు. రవి బిష్ణోయ్ 6వ, అర్ష్‌దీప్ 9వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. అకిల్ హొస్సేన్ (వెస్టిండీస్) టాప్‌లో కొనసాగుతున్నాడు.



కొలువుల నెలవులు జీసీసీలు

- 2030 నాటికి 33 లక్షల ఉద్యోగాలు
- ఈ ఏడాది 4.5 లక్షల నియామకాలు

ముంబై: మన దేశంలో ఏర్పాటవుతున్న గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీ)పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. 2030 నాటికి ఈ కేంద్రాల ద్వారా 33 లక్షల ఉద్యోగాలు ఏర్పడనున్నాయి. వచ్చే ఆరేళ్లలో కొత్త నియామకాలు 10 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఇందులో 4.25 లక్షల నుంచి 4.5 లక్షల కొత్త నియామకాలు ఈ సంవత్సరం ఉంటాయని టెక్నాలజీ అండ్ డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ విడుదల చేసిన 'ఇండియా జీసీసీ గ్రోత్ ఔట్‌లుక్, 2024' నివేదిక తెలిపింది. దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో 10 విభిన్న రంగాలకు చెందిన 207 జీసీసీల ప్రధాన అధికారులతో మాట్లాడి ఎన్ఎల్‌బీ సర్వీసెస్ ఈ నివేదిక రూపొందించింది. బెంగళూరు, ముంబై, పుణె, చెన్నై నగరాల్లోని జీసీసీలు పెద్ద ఎత్తున ఫ్రెషర్స్‌కు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపింది.

2030 నాటికి 2,100 జీసీసీలు: ప్రస్తుతం మన దేశంలో దాదాపు 1,800 జీసీసీలున్నాయి. మరో ఐదేళ్లలో వీటి సంఖ్య 2,100కు, మార్కెట్ పరిమాణం 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.74 లక్షల కోట్లు) పెరిగే అవకాశం ఉందని ఆ నివేదిక తెలిపింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, పెద్ద ఎత్తున నిపుణుల లభ్యతతో దాదాపు ప్రతి అంతర్జాతీయ కంపెనీ మన దేశంలో జీసీసీ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. దీంతో జీసీసీలకు సంబంధించిన టెక్నాలజీ, ఫైనాన్స్, తయారీ వంటి కీలక రంగాల్లో పని చేసేందుకు పెద్ద ఎత్తున నిపుణుల అవసరం ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈ కేంద్రాల్లో ఈ సంవత్సరం ఆర్థిక సేవల నిపుణుల నియామకాలు 79%; మార్కెటింగ్, డిజిటల్ అడ్వర్టైజింగ్ నిపుణుల నియామకాలు 73%; ఇంజినీరింగ్, తయారీ నిపుణుల నియామకాలు 69%, హెచ్‌ఆర్-టాలెంట్ మేనేజ్‌మెంట్ నిపుణుల నియామకాలు 68% పెరుగుతాయని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ సీఈఓ సచిన్ అలుగ్ చెప్పారు.

బిజినెస్

8న హెచ్ఎంఏ లీడర్‌షిప్ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) వజ్రోత్సవ లీడర్‌షిప్ సదస్సు వచ్చే శనివారం జరుగనుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 1964లో ప్రారంభమైన హెచ్ఎంఏ ఈ ఏడాది 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. "ఇన్‌స్పైర్, ఇన్నోవేట్, ఇంపాక్ట్" థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో అపోలో, సైయెంట్, ఐటీసీ, హనీవెల్, మరుత్ డ్రోన్స్, జాగిల్, ఐఎస్‌బీ ప్రతినిధులు పాల్గొంటారని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో నెట్‌సూట్ డేటాసెంటర్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక రాజధాని ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్టు అమెరికాకు చెందిన నెట్‌సూట్ ఇంక్ బుధవారం ప్రకటించింది. భారత్‌లో పెరుగుతున్న కస్టమర్లకు మద్దతివ్వడంతోపాటు కార్యకలాపాలను అంతర్జాతీయంగా విస్తరించే దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. 1998లో ప్రారంభమైన ఈ కంపెనీ.. చిన్న, మధ్యస్థాయి వ్యాపారాలకు (ఎస్ఎంబీ) అకౌంటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, మానవ వనరుల నిర్వహణ, ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, సేవలందిస్తుంటుంది. అమెరికన్ టెక్ దిగ్గజం ఒరాకిల్ కార్పొరేషన్ 2016 నవంబరులో నెట్‌సూట్‌ను 930 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది.

సౌందర్య ఉత్పత్తుల మార్కెట్లోకి అనన్య బిర్లా



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లా సౌందర్య సాధనాల మార్కెట్లోకి ప్రవేశించారు. వేగంగా విస్తరిస్తున్న బ్యూటీ, కాస్మెటిక్స్ విభాగంలో కొత్త వెంచర్ ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. అయితే ఆ వెంచర్ పేరు గాని, పెట్టుబడి వివరాలు గాని వెల్లడించలేదు. ఈ ఏడాది కొత్త బ్యూటీ, పర్సనల్ కేర్ బ్రాండ్లను మార్కెట్‌కు పరిచయం చేయనున్నామని ఆమె తెలిపారు. పర్సనల్ కేర్ ఉత్పత్తుల మార్కెట్ ఏటా 10-11 శాతం వృద్ధితో 2028 నాటికి 3,400 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనాగా చెబుతున్నారు. మారుతున్న యువత అభిరుచులకు దీటుగా కొత్త తరం బ్రాండ్లను తమ సంస్థ మార్కెట్లో ఆవిష్కరిస్తుందని అనన్య తెలిపారు. అనన్య 17 సంవత్సరాల వయసులోనే మైక్రో లెండింగ్‌లోకి ప్రవేశించారు. ఆమె నిర్వహణలోని స్వతంత్ర మైక్రో ఫిన్ దేశంలోనే రెండో పెద్ద ఎన్‌బీఎఫ్‌సీ-ఎంఎఫ్ఐగా ఎదిగింది.

నారాయణమూర్తికి గౌరవ డాక్టరేట్



చెన్నై (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి ఇంటర్నేషనల్ యూనివర్శిటీగా గుర్తింపు పొందిన సాయి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్‌పర్సన్, పద్మవిభూషణ్ ఎన్ఆర్ నారాయణ మూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ, కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు, ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియం కూడా గౌరవ డాక్టరేట్‌లను స్వీకరించారు.

రుణం కంటే ఎక్కువ వసూలు చేశారు

- బ్యాంకులపై విజయ్ మాల్యా పిటిషన్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సంస్థ తీసుకున్న రుణాలకంటే బ్యాంకులు ఎక్కువగా వసూలు చేశాయని విజయ్ మాల్యా హైకోర్టును ఆశ్రయించారు. బ్యాంకులకు తమ సంస్థ రూ.6,200 కోట్లు బకాయి ఉందని, బ్యాంకర్లు అంతకు రెండురెట్లకు మించి వసూలు చేశారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. మాల్యాకు చెందిన రూ.14,131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రస్తావించారని పిటిషన్‌లో వివరించారు. ఈ నెల 3న పిటిషన్ దాఖలు కాగా, జస్టిస్ ఆర్ దేవదాస్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మాల్యా తరపున న్యాయవాది సజన్ పూవయ్య వాదనలు వినిపించారు. రుణాల రికవరీ స్టేట్‌మెంట్ సమర్పించాలని బ్యాంకు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ నుంచి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పలు జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు రుణాల వసూలు ప్రక్రియను చేపట్టాయి. దీనిపై స్టే ఇవ్వాలని విజయ్ మాల్యా హైకోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై బ్యాంకులు ఈ నెల 13లోగా వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

స్వర్ణ భారతం



2024లో పసిడి గిరాకీ 803 టన్నులు

- 2025 డిమాండ్ అంచనా

800 టన్నులు..డబ్ల్యూజీసీ నివేదిక

ముంబై: ధరలు ఎప్పటికప్పుడు రికార్డు స్థాయికి ఎగబాకుతూ పోతున్నప్పటికీ బంగారం కొనుగోలు విషయంలో భారతీయులు ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. గత ఏడాది భారత్‌లో పసిడి గిరాకీ వార్షిక ప్రాతిపదికన 5 శాతం పెరిగి 802.8 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) నివేదిక వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై సుంకం తగ్గించడంతో పాటు పండగలు, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు డిమాండ్ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయని ఆ నివేదికలో తెలిపారు. ఈ ఏడాదిలోనూ భారత్‌లో బంగారం డిమాండ్ 700-800 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేశారు. ధరల అనూహ్య పెరుగుదలతో మందగించిన ఆభరణాల కొనుగోళ్లు పెళ్లిళ్ల సీజన్‌లో మళ్లీ పుంజుకోవచ్చని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్ అన్నారు. 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుంది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2024లో భారత పసిడి గిరాకీ విలువపరంగా 31 శాతం పెరిగి రూ.5,15,390 కోట్లకు పెరిగింది. 2023లో ఇది రూ.3,92,00 కోట్లుగా ఉంది.
- 2024 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో గిరాకీ ఎలాంటి వృద్ధి లేకుండా 265.8 టన్నులుగా నమోదైంది.
- గత సంవత్సరంలో స్వర్ణాభరణాల కొనుగోళ్లు మాత్రం వార్షిక ప్రాతిపదికన 2 శాతం తగ్గి రూ.563.4 టన్నులకు పరిమితమయ్యాయి. 2023లో 575.8 టన్నుల కొనుగోళ్లు జరిగాయి. అయినప్పటికీ, భారత్ చైనా కంటే అధిక నగలు కొనుగోలు చేసింది. 2024లో చైనాలో గోల్డ్ జువెలరీ డిమాండ్ 511.4 టన్నులుగా నమోదైంది.
- క్రితం ఏడాది బంగారంలో పెట్టుబడులు 29 శాతం పెరిగి 239.4 టన్నులకు చేరాయి. 2023లో ఇది 185.2 టన్నులుగా ఉంది. అనిశ్చితి సమయాల్లో బంగారం భద్రమైన పెట్టుబడి సాధనం అనడానికిదే నిదర్శనమని జైన్ పేర్కొన్నారు.
- 2024లో 114.3 టన్నుల గోల్డ్ రీసైక్లింగ్ (పునర్వినియోగం) జరిగింది. 2023లో జరిగిన 117.1 టన్నులతో పోలిస్తే 2 శాతం తగ్గింది.
- గత సంవత్సరం భారత్‌లోకి బంగారం దిగుమతులు 4 శాతం తగ్గి 712.1 టన్నులుగా నమోదైంది. 2023లో 744 టన్నులు దిగుమతైంది.

1045 టన్నులు కొనుగోలు చేసిన సెంట్రల్ బ్యాంక్‌లు

గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా పసిడి గిరాకీ 4,974 టన్నులుగా నమోదైంది. అందులో 1,044.6 టన్నుల బంగారాన్ని వివిధ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లే కొనుగోలు చేశాయి. అంటే, ప్రపంచ డిమాండ్‌లో 20 శాతానికి పైగా వాటా వీటిదే. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు ఒక సంవత్సరంలో 1000 టన్నులకు పైగా బంగారాన్ని కొనుగోలు చేయడం వరుసగా ఇది మూడోసారి. ఆర్‌బీఐ గత ఏడాది మరో 73 టన్నుల బంగారం సమకూర్చుకుంది. 2023లో 16 టన్నులు కొనుగోలు చేసింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ

గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ క్రమంగా పెరుగుతోంది. గత ఏడాదంతా వీటికి డిమాండ్ నెలకొంది. అక్టోబరు-నవంబరు కాలంలో ధనత్రయోదశి, దీపావళి సీజన్‌లో ఈటీఎఫ్ యూనిట్ల కొనుగోళ్లు మరింత పెరిగాయి. రిటైల్ ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్, నాణేలు, బార్‌ల కొనుగోలుకు అధిక ఆసక్తి చూపుతున్నారు.
- డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా సచిన్ జైన్

రూ..పాయే!

మరో జీవిత కాల కనిష్ఠ స్థాయి నమోదు

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజే 36 పైసలు క్షీణించి రూ.87.43 వద్ద ముగిసింది. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలతోపాటు డాలర్ బలోపేతం, ఆర్‌బీఐ పాలసీకి ముందు ఇన్వెస్టర్లలో అప్రమత్త ధోరణి ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం రూ.87.13 వద్ద ట్రేడింగ్ ప్రారంభమై ఒకదశలో రూ.87.49కు చేరుకున్నప్పటికీ, చివరికి 39 పైసల నష్టంతో రూ.87.46 వద్ద స్థిరపడింది.

ఆర్‌బీఐ పాలసీకి ముందు అప్రమత్తత

- 312 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: ఆర్‌బీఐ పాలసీతోపాటు వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో మదుపరులు అప్రమత్త ధోరణిని కనబరచడంతో ఈక్విటీ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 312.53 పాయింట్లు కోల్పోయి 78,271.28 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 42.95 పాయింట్ల నష్టంతో 23,696.30 వద్ద స్థిరపడింది.

అజాక్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.599-629: కాంక్రీట్ మిక్సర్ యంత్రాల తయారీ కంపెనీ అజాక్స్ ఇంజనీరింగ్ రూ.1,269 కోట్ల ఐపీఓ ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఐపీఓ షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.599-629గా నిర్ణయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ



హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	513	విశాఖపట్నం	470

దజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,240 ▲	79,050 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	82,000 ▲	98,500 ▲
విశాఖపట్నం	84,730 ▲	77,670 ▲	96,260 ▲
రాజమండ్రి	86,240 ▲	79,050 ▲	96,600 ▲
ప్రొద్దుటూరు	85,200 ▲	78,900 ▲	96,000 ▲
ముంబై	84,660 ▲	77,550 ▲	95,425 ▲

కరెంట్ బిల్‌ని ఇలా తగ్గించుకోండి..!

వేసవికాలం వస్తోంది అనగానే అందరిలో కరెంట్ బిల్‌కు సంబంధించిన ఆందోళన ప్రారంభమౌతుంది. ఇంట్లో విద్యుత్ వినియోగానికి సంబంధించి చిన్న జాగ్రత్తలు పాటిస్తే... కరెంట్ బిల్ భారీగా పెరగకుండా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- ఎల్‌ఈడీ బల్బుల వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుంది. ఇంట్లోని ప్రతిగదిలో ట్యూబ్‌లైట్‌తో పాటు ఎల్‌ఈడీ బల్బును కూడా ఏర్పాటు చేసుకోవడం మంచిది. పిల్లలు చదువుకునేటప్పుడు ట్యూబ్‌లైట్‌ను మిగిలిన అన్ని సందర్భాల్లో ఎక్కువగా ఎల్‌ఈడీ బల్బులను ఉపయోగించడం వల్ల కొంతమేర కరెంట్ బిల్లు తగ్గించుకోవచ్చు.
- వేసవికాలంలో చాలామంది ఇళ్లలో ఏసీని ఉపయోగిస్తూ ఉంటారు. ఏసీ వేసేముందు కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఏసీని 26 డిగ్రీల వద్ద ఉంచి గది మొత్తం చల్లగా అయిన తరవాత ఆపివేయాలి. నాన్ ఇన్వర్టర్ ఏసీకి బదులు ఇన్వర్టర్ ఏసీని ఎంచుకోవడం మంచిది. ఇన్వర్టర్ ఏసీ.....అవసరం మేరకు కంప్రెసర్ వేగాన్ని నియంత్రిస్తుంది. దీనివల్ల ఎక్కువగా విద్యుత్ వినియోగం కాదు. కరెంట్ బిల్ కూడా తగ్గుతుంది. సాధ్యమైనంత వరకు ఏసీకి బదులు కూలర్ వాడుకోవడం మేలు.
- హాల్, లివింగ్ రూమ్, స్టడీరూమ్ ఇలా ప్రతి గదిలో అవసరమైనప్పుడు మాత్రమే ఫ్యాన్ వేసుకోవాలి. గది నుంచి బయటికి వస్తూ ఫ్యాన్‌ని ఆపివేయడం మర్చిపోవద్దు. ఈ అంశానికి సంబంధించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించడం మంచిది. దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ ఎక్కువ విద్యుత్‌ని వినియోగించుకుంటుంది. వారానికి ఒకసారి ఇంట్లోని ఫ్యాన్లను తప్పనిసరిగా శుభ్రం చేయాలి.



- మైక్రోవేవ్ ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించుకుంటుంది. దీనిని ఉపయోగించుకున్న తరవాత వెంటనే పవర్ బటన్‌ను ఆపివేయాలి. అలాగే స్టాండ్‌బై మోడ్‌లో ఉంచకూడదు.
- ఫ్రిజ్ వాడకంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్రీజర్లో ఎక్కువగా ఐస్ గడ్డకడితే విద్యుత్ ఎక్కువగా వినియోగమవుతుంది. మూడు రోజులకు ఒకసారి ఫ్రిజ్‌ను పరిశీలించి డీఫ్రాస్ట్ చేయాలి. ఫ్రిజ్ కొనేటప్పుడు ఎక్కువ స్టార్లు ఉన్నది తీసుకోవాలి. ఐదు స్టార్లు ఉంటే... విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది.
- గీజర్‌లో నీటిని వేడిచేసిన వెంటనే స్నానాదికాలు ముగించాలి. ఇంట్లో పెద్ద గీజర్ ఉంటే అందులో నీటిని ఒకేసారి వేడిచేసి కుటుంబసభ్యులంతా ఒకరి తరవాత ఒకరు స్నానం ముగించేలా చూసుకోవాలి.
- వాషింగ్ మెషీన్‌లో సూచించిన లోడ్‌కు తగ్గట్టు దుస్తులు వేయాలి. అంతకు మించి వేస్తే విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

కొత్తవాటిలా మెరవాలంటే..!

బాత్‌రూమ్‌లో ఉపయోగించే బకెట్లు, మగ్గులపై తెల్లని నీటి మరకలు ఏర్పడుతుంటాయి. రోజూ ఉపయోగిస్తున్నప్పటికీ వాటిపై మురికి చేరి నల్లగా మారుతుంటాయి. ఇలాంటి మరకలను ఇంటి చిట్కాలతో సులువుగా వదిలించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల పాత్రలు శుభ్రం చేసే లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాత టూత్ బ్రష్‌తో తీసుకుంటూ బకెట్లు, మగ్గులకు మరకలు ఉన్న చోట పట్టించాలి. అరగంట ఆరిన తరవాత స్టీల్ స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే మరకలన్నీ పోయి కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక గిన్నెలో మూడు చెంచాల బేకింగ్ సోడా లేదా ఉప్పు, నాలుగు చెంచాల వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని టూత్ బ్రష్ సహాయంతో మరకలపై రాయాలి. పావుగంట తరవాత మంచినీళ్లతో కడిగితే అన్ని రకాల మరకలు పోతాయి.
- ఒక గ్లాసు నీటిలో మూడు చెంచాల బ్లీచింగ్ పౌడర్ వేసి కలపాలి. చేతులకు తొడుగులు వేసుకోవాలి. ఒక పలుచని గుడ్డని గుండ్రంగా మడిచి ఈ నీళ్లలో ముంచి దానితో బకెట్లను మగ్గులను తోమాలి. పావు గంట తరవాత వాటిని మంచి నీళ్లతో శుభ్రం చేస్తే మరకలన్నీ వదిలిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు ప్యాకెట్ల ఈనో పొడి, నాలుగు చెంచాల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమంలో స్క్రబ్బర్‌ని అద్ది దానితో బకెట్లను, మగ్గులను గట్టిగా రుద్దుతూ తోమాలి. అయిదు నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత మంచి నీళ్లతో కడిగేస్తే మరకలు పోతాయి.
- రసం పిండిన తరవాత నిమ్మచెక్కలను పారేసే ముందు వాటితో ఇంట్లోని బకెట్లు, మగ్గులు రుద్ది కడుగుతూ ఉంటే అవి ఎప్పుడూ కొత్తవాటిలాగే ఉంటాయి.





నచ్చినట్టు దుస్తులు కుట్టించుకోవాలంటే టైలర్, డిజైనర్, బొటిక్ ఒకే చోట అందుబాటులో ఉండాలి. అవసరమైతే వాళ్లు ఇంటికే వచ్చి సేవలు అందించగలగాలి. ఇలా దర్జీ రంగాన్ని వినియోగదారుల దగ్గరకు చేర్చడం కోసం 'రన్ టైలర్' అనే సంస్థను స్థాపించి, అందరికీ దర్జీ సేవలను అందిస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన అనసూయారెడ్డి.
ఆమె 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...

ఇంటి ముందుకే దర్జాగా..!

దర్జీ పరిశ్రమ వెనకపడిపోతూ, ఫ్యాషన్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి కారణం దర్జీలు సంఘటితంగా లేకపోవడమే! స్వతహాగా దుస్తుల డిజైనింగ్ పట్ల ఆసక్తి కలిగిన నేను, ఈ ధోరణిని లోతుగా అర్థం చేసుకుని 2017లో అను డిజైన్స్ అనే ఒక బ్రాండ్ మొదలుపెట్టాను. స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసి, టైలర్లు, మాస్టర్ల దగ్గర డిజైన్ చేయించి, కుట్టించి హైలైఫ్ ఎగ్జిబిషన్లో విక్రయించేదాన్ని. ఒక సందర్భంలో కుట్టడం కోసం దుస్తులు తీసుకున్న దర్జీ, సమయానికి నా ఫోన్‌కు స్పందించడం మానేశాడు. నాకేమో ఎగ్జిబిషన్‌లో స్టాల్ పెట్టుకునే సమయం దగ్గరపడిపోతోంది. దాంతో అడ్రస్ వెతికి, నేరుగా అతని ఇంటికి వెళ్లిపోయాను. అక్కడ అతని ఇరుగు పొరుగు మొత్తం నా మీదకు గొడవకు దిగారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోకుండా, వృత్తి ధర్మానికి కట్టుబడని వాళ్ల స్వభావం చూసి, అప్పటికి నా అభిరుచికి ఫుల్‌స్టాప్ పెట్టేశాను. ఆ అనుభవంతో టైలరింగ్ పరిశ్రమలో ఉన్న లోపాలు నాకు స్పష్టంగా అవగతమైపోయాయి. ఆ తర్వాత జరిగిన ఇంకొక సంఘటన నాలో కొత్త ఆలోచనకు బీజం పడేలా చేసింది.

ఆలోచన అలా మొదలైంది

మా ఇంట్లో పని చేసే అమ్మాయి, రోజూ రెండు, మూడు కవర్లు తీసుకొస్తూ ఉండేది. వాటిలో బ్లౌజ్‌లను గమనించి అవెక్కడివని అడిగినప్పుడు, ఆ కమ్యూనిటీలో ఉండే మహిళల దగ్గరి నుంచి మెటీరియల్ తీసుకుని, ఇంట్లోనే బ్లౌజులు కుట్టి తిరిగి అందిస్తూ ఉంటానని ఆ అమ్మాయి చెప్పింది. అలా నెలకు 50 నుంచి 60 వేలు సంపాదించుకుంటున్నట్టు విని, నేను విస్తుపోయాను. ఏమీ చదువుకోని ఒకమ్మాయి అంత ఆదాయం ఆర్జిస్తున్నప్పుడు, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు చదివిన అమ్మాయిలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నారు? అని ఆలోచించడం మొదలుపెట్టాను. ఫ్యాషన్ డిజైనర్ల వెనకబాటుతనానికి కారణాలను తెలుసుకోవడం కోసం వేర్వేరు నగరాలు తిరిగాను. పరిశ్రమలోని లోపాలను తెలుసుకున్నాను. వినియోగదారులకు దుస్తులను చేరువ చేయడం కోసం ఒక దర్జీ, ఒక డిజైనర్‌ను వెంట బెట్టుకుని కారవాన్‌లో వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిటీలకు వెళ్లిపోయేదాన్ని. అలా ఏడాదిన్నర పాటు కష్టపడిన తర్వాత అంతిమంగా 2022లో 'రన్ టైలర్' స్థాపించాను.

మూడు విభాగాల ద్వారా...

వ్యాపారం, వినియోగదారులు, ఉద్యోగాలు... ఇలా రన్ టైలర్‌లో మూడు విభాగాలున్నాయి. చాలామంది బొటిక్స్ లేబుల్స్ పెట్టుకుంటూ ఉంటారు. వీళ్ల డాటా ట్రాక్ చేసుకోరు. బిల్లులన్నీ కాగితాల రూపంలోనే ఉంటాయి. వాళ్లను ప్రమోట్ చేసే కంపెనీలు ఉండవు. బ్రాండింగ్ లేదు. వీళ్లకు రన్ టైలర్, ఒక డిజిటల్ అగ్రిగేటర్‌గా ఉపయోగపడుతుంది. మాతో అనుసంధానమైన బొటిక్స్ అన్నిటికీ అవసరమైన సాఫ్ట్‌వేర్, మ్యాన్‌పవర్‌ను మేం సమకూరుస్తాం. ఇక వినియోగదారుల సేవల విషయానికొస్తే, టైలర్లు, డిజైనర్ల దగ్గరకు వెళ్లలేని వాళ్లుంటారు. అలాంటి వాళ్లకు ఇంటి దగ్గరే సేవలందిస్తాం. పోర్టబుల్ కుట్టుమిషన్‌తో సహా ఒక దర్జీని ఇంటికి పంపిస్తాం. వీలును బట్టి ఆన్‌లైన్‌లో కూడా సేవలందిస్తాం. ఇందుకోసం రన్ టైలర్ యాప్‌ను వాడుకోవచ్చు. దీని ద్వారా డిజైనర్, టైలర్ సేవలను అందుకోవడంతో పాటు కుట్టించుకునే దుస్తులను కూడా ట్రాక్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ప్రముఖ బ్రాండ్ల దుస్తులు కూడా అందుబాటులో ఉంటాయి. ఇక జీవనభృతిలో భాగంగా, ఫ్రాంచైజీలను ప్రారంభించే అవకాశాలను మహిళలకు కల్పిస్తున్నాం. ఇప్పటివరకూ ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 25 ఫ్రాంచేజీలు ఏర్పడ్డాయి. ఇమేజ్ కన్సల్టేషన్ కోర్సు అందిస్తూ, ప్రతిభ కనబరిచిన వారికి రన్ టైలర్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.

రన్ టైలర్ పేరు వెనక...
నేనెప్పుడూ పరిగెత్తే వ్యక్తిని. ఒకే చోట కుదురుగా ఉండడం నాకు అలవాటు లేదు. టైలర్ల జీవితాలను గమనించిన తర్వాత, పరుగులు పెట్టే నా స్వభావాన్నీ, టైలరింగ్ రంగాన్నీ కలుపుతూ, ఈ సంస్థకు 'రన్ టైలర్' అని పేరు పెట్టుకున్నాను.



మాది కడప. నాన్న కాంట్రాక్టర్ అవడం వల్ల వేర్వేరు ఊళ్లు తిరుగుతూ చివరకు హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. మా వారు చంద్రహాస్ రెడ్డి కూడా కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లోనే ఉన్నారు. నాకొక బాబు. పేరు మౌనిష్ రెడ్డి. ఐదో తరగతి చదువుతున్నాడు. త్వరలో హైదరాబాద్, దుబాయ్‌లో, రెండు పెద్ద బ్రాండ్లను లాంచ్ చేయబోతున్నాను. ఈ బ్రాండ్ల ద్వారా అందరూ సౌకర్యంగా ధరించగలిగే, రాజసం ఉట్టిపడే దుస్తులను అందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నాను. కొత్తదనం కోసం పరితపించే క్రమంలో తయారవుతున్న తాజా ఫ్యాషన్ల దుస్తులు ధరించడానికి వీల్లేకుండా ఉంటున్నాయి. నేను డిజైన్ చేయబోతున్న దుస్తులు ఇందుకు పూర్తి భిన్నం.

ఇమేజ్ కన్సల్టేషన్...

ప్రతి వ్యక్తికీ ఒక ఇమేజ్ ఉంటుంది. వాళ్ల వృత్తి, ప్రవృత్తి, ఆహార్యం. వీటికి తగ్గట్టు దుస్తులను డిజైన్ చేసినప్పుడే హుందాగా కనిపిస్తారు. ఇందుకోసం ఇమేజ్ కన్సల్టేషన్ ప్రోగ్రాం అనే కోర్సు నేర్చుకున్నాను. ప్రస్తుతం ఆసక్తి ఉన్న డిజైనర్లకు కూడా ఈ కోర్సు నేర్పిస్తున్నాను. ఎవరికి ఎలాంటి రంగులు, ఎలాంటి దుస్తులు నప్పుతాయన్నది అంచనా వేయడంతో పాటు ఏ రంగులను మ్యాచ్ చేయాలో, ఏ దుస్తులను ఎలా కుట్టించాలో వినియోగదారులకు అవగాహన కల్పించడమే ఈ కోర్సు లక్ష్యం. ఇలా మా దగ్గర ఈ కోర్సు పూర్తి చేసిన కన్సల్టెంట్స్, వినియోగదారులను సంప్రతించి, నెలలో నాలుగు వారాలకు సరిపడా దుస్తులను డిజైన్ చేసి, సమకూర్చి పెడతారు. ఈ సౌలభ్యం వల్ల ప్రతి రోజూ వేసుకోబోయే దుస్తుల గురించిన ఆందోళన తప్పుతుంది.

ఉదాహరణకు రియల్ ఎస్టేట్ రంగాన్ని తీసుకుంటే, దాన్లో పురుషులందరూ తెల్లని దుస్తులే వేసుకుంటూ ఉంటారు. అలాంటప్పుడు ఎవరికంటూ వారు ప్రత్యేక స్టైల్‌ను చాటుకోవాలంటే, తెల్ల దుస్తుల్లోనే భిన్నంగా కనిపించాలి. అందుకోసం మేం ఒక కస్టమర్‌కు బంగారు జరీ, బంగారం, వజ్రాల గుండీలు డిజైన్ చేశాం. కొద్దిగా డై చేసి తెలుపు రంగును లేత రంగులోకి మార్చగలిగాం. ఇలా వినియోగదారుల ఆహార్యాన్ని మెరుగు పరచగలుగుతున్నాం.

- గోగుమళ్ల కవిత



అంధ విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో మొదలై, వారికి అన్నీ తానై నిలిచే వరకూ... మీరా బద్వేది సుదీర్ఘమైన ప్రయాణం. దాదాపు ముప్ఫయ్యేళ్లుగా... వేలమంది అంధులకు విద్య, ఆశ్రయం, ఉపాధి కల్పన ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధికి ఆమె దోహదం చేస్తున్నారు. "ఎవరో వస్తారని ఎదురుచూడడం కన్నా మనమే ముందడుగు వెయ్యాలి" అంటున్న మీరా బద్వే కథ ఆమె మాటల్లోనే...

చూపు లేని వారికి చుక్కానిలా

"ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో 'నా జీవితానికి అర్థమేమిటి?' అనే ప్రశ్న ఎదురవుతుంది. జీవితాన్ని అర్థవంతంగా చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నాల్లో... ఎంతో ఆలోచించి అమలు చేసినవి విఫలమవుతాయి. కానీ ఎలాంటి ప్రణాళిక లేకుండా చేసిన కొన్ని పనులు మన జీవితానికి వినూత్నమైన నిర్వచనాన్ని ఇస్తాయి. అలాంటి మార్పు తెచ్చిన సంఘటన ముప్ఫయ్యేళ్ళ క్రితం జరిగింది. నేను పుట్టింది మహారాష్ట్రలోని పుణేలో. చదువు పూర్తయ్యాక పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల బోధకురాలుగా పని చేశాను. వివాహమై, మా అమ్మాయి ఉమ పుట్టిన తరువాత ఉద్యోగం వదిలి, పూర్తిగా ఇంటి బాధ్యతలకే పరిమితం అయిపోయాను. అయితే ఏదో వెలితిగా ఉండేది. అందుకే మా అమ్మాయి కాస్త పెద్దది కాగానే... ఒక కాలేజీ నుంచి వచ్చిన అవకాశాన్ని అంగీకరించాను. కానీ అక్కడ చేరేలోగా... స్థానికంగా ఉన్న అంధుల పాఠశాల సందర్శన నన్ను కొత్త దారిలో నడిపించింది.

వారి భరోసాతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి...

నా భర్తకు చాలా సంవత్సరాలుగా ఒక అంధుల పాఠశాలకు విరాళాలు ఇవ్వడం ఆనవాయితీ. ఒకసారి ఆయనతోపాటు ఆ పాఠశాలకు వెళ్ళాను. అప్పుడు అక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఎంతోమంది పిల్లలు క్యూలో నిలబడి ఉన్నారు. 'అపరిచితమైన కొత్త ప్రదేశంలో ఎలా ఉండాలా?' అనే బాధ, దిగులు వారిలో కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక పిల్లాడు ఆ క్యూ మధ్యలోనుంచి పరిగెత్తుతూ వచ్చాడు. దారిలో ఉన్న నన్ను గట్టిగా పట్టుకున్నాడు. నేను అతని తల్లిని అనుకున్నాడు. ఇంటికి తీసుకు వెళ్ళాలంటూ ఏడుస్తున్నాడు. ఈలోగా తల్లితండ్రులు వచ్చి అతన్ని తీసుకుపోయారు. నేను, నా భర్త తిరిగి వెళ్తున్నప్పుడు "ఈ పిల్లల కోసం ఏదైనా చెయ్యాలని ఉంది. ఇక్కడే టీచర్‌గా చేరాలనుకుంటున్నాను" అని చెప్పాను. నాకు గతంలో అనుభవం ఉంది కాబట్టి అక్కడ బోధకురాలుగా చేరడం కష్టం కాలేదు. అయితే చేరిన తరువాత మాత్రం ఎన్నో సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పటికి నాకు బ్రెయిలీ రాకపోవడంతో బోధించడానికి తడబడ్డాను. కానీ క్రమంగా పిల్లలతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నేను ఇబ్బంది పడుతున్నానని గ్రహించిన ఆ పిల్లలు "మీకు బ్రెయిలీ రాదని మమ్మల్ని వదిలేసి వెళ్ళొద్దు టీచర్! మీకు మేము నేర్పిస్తాం" అని భరోసా ఇచ్చినప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ తరువాత బ్రెయిలీ నేర్చుకున్నాను. వారితో మమేకమైన నేను మూడేళ్ళ తరువాత ఆ ఉద్యోగం మానెయ్యాల్సి వచ్చింది.

ఆ ధోరణి భరించలేక...

పిల్లలకు వారి వైకల్యాన్ని పదేపదే గుర్తు చేసేలా వ్యవహరించకూడదనేది నా ఉద్దేశం. "వారూ అందరు పిల్లల్లాంటివారే. అల్లరి చేస్తారు. ఆటలు ఆడతారు. కొత్త విషయాలు తెలుసుకోవాలని ఉత్సాహపడతారు. వారికీ ఇష్టాయిష్టాలుంటాయి. ఇవేవీ పట్టించుకోకుండా... వారు కుంగిపోయేలా ప్రవర్తించకూడదు" అని నేను చాలా సందర్భాల్లో స్కూల్ నిర్వాహకులకు చెప్పాను. కానీ పట్టించుకోలేదు. ఆ ధోరణి భరించలేక... రాజీనామా చేశాను. తరువాత ఒక రోజు ఆ స్కూల్ విద్యార్థి నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. అతను చదువుతున్నది తొమ్మిదోతరగతి. కానీ వయసు పద్దెనిమిదేళ్ళు ప్రభుత్వ నిబంధనల ప్రకారం... అతను వయోజనుడయ్యాడు కాబట్టి బ్లయిండ్ స్కూల్‌లో అతను ఉండడం కుదరదు. అతని చదువు, వసతి, భోజన ఖర్చులను అతనే సంపాదించుకోవాలి. అందుకని అతణ్ణి స్కూల్‌లోంచి బయటకు పంపేశారు. అతణ్ణి తల్లితండ్రులు ఎప్పుడో వదిలేశారు. ఎక్కడికి వెళ్ళాలో తెలియక... మూడు వారాలపాటు సరైన తిండి లేకుండా రోడ్ల మీద తిరిగాడు. చివరకు మా ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడికి ఆశ్రయం కల్పించి, అతని చదువుకు సాయం చేశాను. ఎంతో కష్టపడి చదివిన అతను పదోతరగతిలో నూరు శాతం మార్కులు తెచ్చుకునప్పుడు... తీవ్రమైన ఉద్వేగానికి గురయ్యాను. మానవీయత కరువైన విధానాల వల్ల ఇలాంటి ఎందరో పిల్లల జీవితాలు నాశనమైపోతున్నాయనే ఆవేదన కలిగింది. సమాజం వారికి సాయం చెయ్యడానికి ముందుకురాదు. ఆర్థిక స్తోమత లేని కుటుంబాలు వారిని భారంగా చూస్తాయి. ఈ పరిస్థితిలో... ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడడం కన్నా... నేనే వారికో దారి చూపాలనుకున్నాను. 1996లో... 'నివంత్ అంధ్ ముక్త వికాసాలయ్' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాను.



ఆ నమ్మకం ఉంది...

ఇరవై తొమ్మిది ఏళ్ళ క్రితం... ఒకే ఒక విద్యార్థితో మొదలైన మా 'నివంత్' ఇప్పుడు విద్య, జీవన నైపుణ్యాలను నేర్పిస్తూ, భావోద్వేగమైన మద్దతును అందించే కేంద్రంగా అభివృద్ధి చెందింది. అప్పట్లో మాకు వనరులు, నిధులు తక్కువగా ఉండేవి. బ్రెయిలీ వచ్చిన విద్యార్థులు తక్కువ. బ్రెయిలీలో పుస్తకాలను చేతుల్తో రాసుకోవలసి వచ్చేది. అలా దాదాపు 300కు పైగా పుస్తకాలను మా విద్యార్థులు ఎంతో శ్రమ పడి రాశారు. 2007లో బ్రెయిలీ ప్రింటర్ సమకూర్చుకోవడంతో... ఈ పని సులభం అయింది. ఆ తరువాత 'విజన్ అన్‌లిమిటెడ్' అనే లైబ్రరీని ఏర్పాటు చేశాం. మూడువేలకు పైగా పుస్తకాలు అందులో ఉన్నాయి. రోటరీ క్లబ్ లాంటి సంస్థల సహాయంతో... పాఠ్య, పాఠ్యేతర అంశాలతో మేము ఏడాదికి లక్షన్నర పేజీలకు పైగా బ్రెయిలీ పుస్తకాలను ముద్రిస్తున్నాం. మహారాష్ట్ర వ్యాప్తంగా పదిహేడు కేంద్రాల్లో ఈ లైబ్రరీ అంధులకు సేవలు అందిస్తోంది. మా సంస్థలో ఇప్పటివరకూ 3,500 మందికి పైగా అంధ బాలలు ఆశ్రయం పొందారు. అందరూ స్వతంత్రంగా జీవించే నైపుణ్యాలను సాధించారు. ఈ ప్రయత్నంలో. నా భర్త, కుమార్తె కూడా నాకు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారు. వారి సహకారంతోనే 'స్వలేఖన్ టైపింగ్ ట్యూటర్' అనే యాప్‌ను ఆరేళ్ళ కిందట ఆవిష్కరించాం. అనేక భాషల్లో టైపింగ్‌ను నేర్పే ఈ యాప్ ద్వారా... అంధులైన విద్యార్థులు ఎవరి సాయం లేకుండా పరీక్షలు రాయవచ్చు. పుణేలో కొన్ని అంధ బాలల పాఠశాలల్లో పిల్లలకు ఈ యాప్ వినియోగంలో శిక్షణ ఇస్తున్నాం. 2,000 మందికి పైగా పిల్లలు దీన్ని ఉపయోగిస్తున్నారు. అలాగే... మేము సొంతంగా 'టెక్ విజన్' అనే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాం. దీనిలో వ్యాపార అవకాశాలు ఉన్నాయనే విషయం గ్రహించి... ఇరవైమంది అంధ విద్యార్థుల బృందంతో ఒక కంపెనీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఈ కంపెనీ ద్వారా ఏడాదికి నాలుగైదు కోట్ల రూపాయల లాభం వస్తోంది. అలాగే మా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తోంది. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని నాకు తెలుసు. కానీ నా తరువాత ఈ బాధ్యతను మా విద్యార్థులు ఇంకా సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం నాకుంది."

కౌన్సెలింగ్

కీళ్ల నొప్పులు తగ్గేదెలా?

డాక్టర్! నా వయసు 50. గత కొన్ని నెలలుగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఇందుకు కారణం కీళ్ల అరుగుదలగా భావించాలా? ఈ సమస్య మరింత పెరగకుండా ఎలా నియంత్రించుకోవాలి?

ఓ సోదరి, హైదరాబాద్

వ్యక్తిగత, వైద్యచరిత్రల ఆధారంగా అరిగిన, అరుగుతున్న కీళ్లకు ఎలాంటి చికిత్సను అందించాలో వైద్యులు నిర్ణయించుకుంటూ ఉంటారు. ఒకే ఒక పరీక్షతో కీళ్ల అరుగుదలను నిర్ధారించే పరిస్థితి ఇప్పటివరకూ లేదు. లక్షణాలు, ఎక్స్ రే, ఎమ్మారైల ద్వారా సమస్యను నిర్ధారించే విధానమే మనుగడలో ఉంది. ఫలితాలను బట్టి అంచెల వారీగా అందించవలసిన చికిత్సను వైద్యులు అంచనా వేస్తూ ఉంటారు.

ప్రధాన కారణాలు ఇవే!

- పెరిగే వయసు
- స్థూలకాయం
- ప్రమాదాల్లో కీళ్ల దెబ్బతినడం
- ప్రధానంగా వంశపారంపర్యం లేదా జన్యుపరమైన అంశాలు

నియంత్రణ ఇలా...

- **బరువు అదుపులో:** అధిక బరువు మోకీళ్ల మీద భారాన్ని పెంచుతుంది. అధిక బరువుతో మోకీళ్లు, తుంటి, పాదాల్లోని కీళ్ల శ్రమకు లోనవుతాయి. అలాగే అదనపు కొవ్వు మృదులాస్థిలో మార్పులకు కారణమవుతుంది. కాబట్టి బరువు పెరగకుండా చూసుకోవాలి. అధిక బరువును ఆహార, జీవనశైలి మార్పులతో తగ్గించుకోవాలి.
- **మధుమేహం:** రక్తంలో పెరిగే చక్కెర స్థాయిలు కీళ్ల అరుగుదలకు కారణమవుతాయి. కాబట్టి మధుమేహులు క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించుకుంటూ ఉండాలి. అవసరం మేరకు మందులు వాడుకుంటూ ఉండాలి.



- **చురుగ్గా ఉండాలి:** కీళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే శరీరం చురుగ్గా ఉండాలి. వ్యాయామంతో కీళ్లు బిగుసుకుపోయే సమస్య తప్పుతుంది. కాబట్టి రోజూ కనీసం 30 నిమిషాల పాటైనా నడవాలి. కీళ్ల అరుగుదలను నియంత్రించే వ్యాయామాల గురించి వైద్యులను అడిగి తెలుసుకోవాలి.
- **వ్యాయామాలు సురక్షితంగా:** గాయాలు కీళ్ల అరుగుదలను పెంచుతాయి. కాబట్టి వ్యాయామం మొదలుపెట్టే వాళ్లు తక్కువ వేగంతో, తక్కువ తీవ్రతతో వ్యాయామాలు మొదలుపెట్టి, క్రమేపీ వేగం, తీవ్రతలను పెంచాలి. వ్యాయామానికి ముందు 10 నిమిషాల పాటు వార్మప్ చేయడం వల్ల, కీళ్లు, టెండాన్లు, కండరాలు, లిగమెంట్లు గాయాల బారిన పడకుండా ఉంటాయి.
- **కీళ్ల మీద కన్ను:** వ్యాయామం చేసిన ఒకటి రెండు గంటల తర్వాత కూడా కీళ్లు నొప్పి పెడుతూ ఉంటే అవసరానికి మించి కీళ్లను శ్రమకు లోను చేశామని అర్థం. అలాంటప్పుడు నొప్పి తగ్గడం కోసం ఐస్ ప్యాక్ పెట్టుకోవాలి.
- **తీపి, ఉప్పు:** ఆహారంలో ఈ రెండింటి వాడకం వీలైనంత తగ్గించాలి.

డాక్టర్. కృష్ణ సుబ్రమణ్యం,
ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, హైదరాబాద్.

వంట నూనె నిల్వ చేయాలంటే..!

బజారు నుంచి వంట నూనె కొని తేగానే సరిపోదు... దాన్ని సరైన పద్ధతిలో జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలి. లేదంటే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయంటున్నారు నిపుణులు. అందుకు వారు ఇస్తున్న సూచనలివే...

- వంటనూనె ప్యాకెట్ లేదా బాటిల్‌ని చల్లని ప్రదేశంలో ఉంచాలి. వీటికి వెలుతురు ఎక్కువగా సోకకూడదు. ప్యాకెట్‌ని కత్తిరించినా, బాటిల్ మూత తీసినా ఆర్నెల్లలోపు నూనెని ఉపయోగించుకోవాలి.



- ప్యాకెట్ లేదా బాటిల్‌ని ఎక్కువసేపు తెరచి ఉంచితే నూనెలోని కొవ్వు పదార్థాలు క్షీణిస్తాయి. నూనె రుచి మారుతుంది. దీనిని వాడడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. నూనె ప్యాకెట్‌ని కత్తిరించిన తరవాత గాలి చొరబడని డబ్బాలో భద్రపరచాలి. అదే బాటిల్ అయితే నూనెని తీసుకున్న తరవాత మూతని గట్టిగా బిగించాలి.
- సాధారణంగా మహిళలు వంట చేసేటప్పుడు అందుబాటులో ఉండాలని కొద్దిగా నూనెని చిన్న స్టీల్ లేదా ప్లాస్టిక్ డబ్బాలో పోసి స్టవ్ పక్కన పెట్టుకుంటూ ఉంటారు. స్టవ్ నుంచి వచ్చే వేడి వల్ల ఈ నూనెలో ఆక్సీకరణ ప్రక్రియ వేగవంతమవుతుంది. దీనిని ఆహారంలో ఉపయోగిస్తే ఊబకాయం, అల్జీమర్స్, అధిక కొలెస్ట్రాల్ లాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. వంటనూనెని వేడి తగిలే ప్రదేశాల్లో ఉంచకూడదు.
- నెయ్యితోపాటు వెజిటబుల్, వేరుశనగ, ఆవ, కొబ్బరి, నువ్వుల నూనెలను గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేసుకోవచ్చు.
- నూనెలను జాడీ, గాజు లేదా లోహపు పాత్రల్లో ఉంచడం మంచిది.

రోగుల సంతృప్తే ప్రధానం

» ఓపీ సేవలను పటిష్ఠంగా అమలు చేయాలి: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విషయంలో రోగులు సంతృప్తి చెందడమే ప్రాతిపదికగా డాక్టర్లు పని చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జీజీహెచ్‌ల సూపరింటెండెంట్లతో ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌పై బుధవారం వెలగపూడిలో సచివాలయంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'వివిధ అంశాలపై సర్వేలో వచ్చిన ఫీడ్ బ్యాక్ మేరకు ఎక్కడెక్కడ లోపాలున్నాయో సవరించుకుని సేవల్ని మెరుగుపర్చుకోవాలి. ప్రభుత్వాసుపత్రుల్లో 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను మరింత పటిష్ఠంగా అమలు చేయాలి. ఉదయం రోగిని చూసిన వైద్యుడే, సాయంత్రం రిపోర్టులు వచ్చిన తర్వాతా చూడాలి. ఓపీ సేవలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలి. పేద రోగులు సంతృప్తి చెందేలా సేవలందించాలి' అని స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా సేవల్ని మెరుగుపర్చాలని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవల విషయంలో సూపరింటెండెంట్లే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

రెడ్‌క్రాస్ సహకారంతో రక్త నిల్వల పెంపు: మంత్రి

రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ప్రభుత్వాసుపత్రుల్లో రక్త నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. బుధవారం సచివాయంలో మంత్రిని రెడ్‌క్రాస్ కొత్త చైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి పి.రామచంద్రరాజు కలిశారు. రెడ్‌క్రాస్ సంస్థ సేవల్ని విస్తరించేందుకు ప్రభుత్వం తరఫున సహకరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

తులసిబాబును మళ్లీ కస్టడీకి కోరాం

» హైకోర్టుకు తెలిపిన ప్రాసిక్యూషన్ వినతి

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై సీఐడీ కస్టడీలో జరిగిన దాడి వ్యవహారంలో నిందితుడు తులసిబాబును మరోసారి పోలీసు కస్టడీకి ఇవ్వాలని ట్రయల్ కోర్టును కోరామని ప్రాసిక్యూషన్ హైకోర్టుకు నివేదించింది. కస్టడీ పిటిషన్‌పై నిర్ణయం వచ్చే వరకు అతడి బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉందనే కారణంతో బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలనడం సరికాదని తులసిబాబు తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి తెలిపారు. బెయిల్ మంజూరు చేసినా.. పోలీసులు సమర్పించిన ఆధారాలతో సంతృప్తి చెందితే నిందితుడిని ఎప్పుడైనా మేజిస్ట్రేట్ పోలీసు కస్టడీకి అప్పగించవచ్చని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్.. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఆర్థిక, పని ఒత్తిళ్లతో నలుగుతున్న ఉద్యోగులు

» సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భరోసా ఇవ్వాలి: బొప్పరాజు

తీవ్రమైన పని, ఆర్థిక ఒత్తిళ్లతో నలిగిపోతున్న నగటు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం విజయవాడలో బొప్పరాజు అధ్యక్షతన ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ... 'కూటమి మేనిఫెస్టోలో పొందుపర్చిన ఐఆర్ ఇప్పటిదాకా విడుదల చేయలేదు. 12వ పీఆర్సీకి కమిషనర్‌ను నియమించలేదు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన రూ.21 వేల కోట్ల బకాయిల గురించి ఉద్యోగ సంఘాలతో చర్చించలేదు. ఈ పరిణామాలు చాలా ఆవేదన కలిగిస్తున్నాయి. ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ బకాయిలు, విశ్రాంత, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి' అని డిమాండ్ చేశారు. సమావేశంలో చేసిన తీర్మానాలను బొప్పరాజు మీడియాకు వివరించారు.

22 నుంచి ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు


అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో జరిగే ఈ శిక్షణ తరగతులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించనున్నారు. అసెంబ్లీలో ఎలా ప్రవర్తించాలి, అసెంబ్లీ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, బడ్జెట్‌పై అవగాహన వంటి అంశాలపై శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించనున్నారు.

వైసీపీ బీసీలకు క్షమాపణ చెప్పాలి: దాసరి శ్యామ్

'బీసీలకు వైసీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలి. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి' అని టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖ డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గీత కులాల్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తే వైసీపీ హైకోర్టులో పిటిషన్లు వేసి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? వైసీపీ చేసిన, చేస్తున్న ద్రోహాన్ని బీసీలు ఎన్నటికీ మర్చిపోరు' అని శ్యామ్ అన్నారు.

పూర్తి స్థాయిలో ఆర్టీసీ బోర్డు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఏపీఎస్ఆర్టీసీకి పూర్తిస్థాయి బోర్డు ఏర్పాటు చేసింది. చైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ చైర్మన్ మునిరత్నంతో పాటు ఆరుగురు నామినేటెడ్ సభ్యుల్ని మూడు నెలల క్రితమే నియమించింది. తాజాగా రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ ఎండీతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మొత్తం 11 మంది అధికారులకు పాలకమండలిలో చోటు కల్పిస్తూ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండేళ్లపాటు ఈ బోర్డు ఆర్టీసీ వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. బోర్డులో తమకూ అవకాశం కల్పించాలంటూ పీటీడీ ఉద్యోగ సంఘాలు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది సెప్టెంబరు చివరి వారంలో మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను ఆర్టీసీ చైర్మన్‌గా, కుప్పం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు మునిరత్నంను వైస్ చైర్మన్‌గా నియమించింది. డైరెక్టర్లుగా అరకు టీడీపీ నాయకుడు దొన్ను దొర(విజయనగరం), జనసేన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు(విజయవాడ), బీజేపీ నాయకుడు సురేశ్ రెడ్డి(నెల్లూరు), అనంతపురం టీడీపీ నాయకుడు పూల నాగరాజు(కడప) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్టీసీ ఎండీ, రవాణా, ఆర్థిక, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శులకు స్థానం కల్పిస్తూ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏఎస్ఆర్టీయూ ఈడీ, సీఐఆర్‌టీ డైరెక్టర్, రోడ్ సేఫ్టీ డైరెక్టర్, కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ డైరెక్టర్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌కు ఆర్టీసీ బోర్డులో రాష్ట్ర ప్రభుత్వం చోటు కల్పించింది. ప్రజా రవాణా శాఖ నుంచి అడిషనల్ కమిషనర్(అడ్మిన్), ఆర్థిక సలహాదారుకు అవకాశం ఇచ్చింది. మహిళలకు ఉచిత ప్రయాణం, సిబ్బంది ఆరోగ్య సమస్యలు, కారుణ్య నియామకాల భర్తీ తదితర అంశాలపై త్వరలో పాలక మండలి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని చైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు.



వలస పోయిన పక్షులు

ఏటా కొత్త సంవత్సరం వచ్చేసరికి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం విదేశీ పక్షుల కిలకిలారావాలతో సందడిగా ఉండేది. నైజీరియా నుంచి గుంపులు గుంపులుగా వచ్చే పక్షులు.. ఈ ఊళ్లోని చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకొని, గుడ్లు పెట్టి పిల్లల్ని చేసి తీసుకెళ్లేవి. అయితే గ్రామంలో పెద్ద పెద్ద చెట్లు తగ్గిపోయాయి. సరైన వసతి లేక గతేడాది నుంచి పక్షులు రావడం లేదు. ఇవన్నీ అద్దంకి మండలం మైలవరం వెళుతున్నాయి. మైలవరం చెరువు వద్ద ఉన్న చెట్లన్నీ విదేశీ పక్షులతో నిండిపోయాయి. - అద్దంకి, ఆంధ్రజ్యోతి



మాజీ ప్రధాని దేవెగౌడకు పాదాభివందనం చేస్తున్న మంత్రి లోకేశ్



గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ ఆశిష్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్

అభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్న నేపథ్యంలో ఏపీలో రక్షణ పరిశ్రమల సముదాయాన్ని(డిఫెన్స్ క్లస్టర్) ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. ఢిల్లీలోని రాజ్‌నాథ్‌సింగ్ నివాసంలో ఆయనను లోకేశ్ కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నామని తెలిపారు. కేంద్ర సహకారంతో మొదలైన రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతిని, పోలవరం పనులు సాగుతున్న తీరును వివరించారు.

విద్యామంత్రుల సమావేశం నిర్వహించండి

విద్యారంగంలో కీలక సంస్కరణలపై చర్చించే నిమిత్తం ఈ ఏడాది ఆగస్టులో జరిగే అఖిల భారత విద్యా మంత్రుల సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి లోకేశ్ కోరారు. కేజీబీవీలు, నైపుణ్య విద్య, ఐసీటీ ఆధారిత అభ్యాసం, నాణ్యత పెంపుదలకు ఏపీకి నిధులు పెంచాలని కోరారు. ప్రతి పంచాయతీలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. పీఎంశ్రీ పథకం కింద ప్రతిపాదించిన 2,369 పాఠశాలల్లో కేవలం 855 పాఠశాలలు మాత్రమే మంజూరు అయ్యాయని మిగిలిన 1,514 పాఠశాలలను ఫేజ్ 3 పీఎంశ్రీలో మంజూరు చేయాలని కోరారు. ఉన్నత విద్య అభివృద్ధికి పూర్వోదయ పథకం కింద మొత్తం రూ. 5,684 కోట్లు అందించాలని కోరారు. యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 3,229 కోట్లు, 37 ప్రభుత్వ కళాశాలల భవనాల నిర్మాణానికి రూ. 555 కోట్లు, ఇప్పటికే ఉన్న డిగ్రీ కళాశాలల్లో తరగతి గదులు, ప్రయోగ శాలలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 330 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కర్నూలులోని అబ్దుల్ కలాం ఉర్దూ యూనివర్సిటీ, ఒంగోలులోని ఆంధ్ర కేసరి యూనివర్సిటీలలో భవన నిర్మాణాలకు చెరో రూ. 50 కోట్లు, పది మహిళా కళాశాలల ఏర్పాటుకు రూ. 150 కోట్లు, రెండు మోడల్ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు రూ. 30 కోట్లు, అలాగే రూ. 250 కోట్లతో ఏఐ, పునరుత్పాదక ఇంధన, ఎమర్జింగ్ టెక్నాలజీస్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు, నాలుగు ప్రధాన యూనివర్సిటీల్లో ఇంక్యుబేషన్ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు రూ. 80 కోట్లు, ఉన్నత విద్య ఫ్యాకల్టీ శిక్షణ సంస్థకు రూ. 50 కోట్లు, ప్రధాన యూనివర్సిటీల్లో అంతర్జాతీయ విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాలకు రూ. 80 కోట్లు, యూనివర్సిటీల్లోని హాస్టళ్లలో సౌకర్యాల ఏర్పాటుకు రూ. 180 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు అమరావతిలో స్థలం

ఏపీలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అధిక అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని ధర్మేంద్రప్రధాన్‌ను లోకేశ్ కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్‌సీసీ డైరెక్టరేట్ తెలంగాణలోనే ఉండిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. డైరెక్టరేట్ ఏర్పాటుకు అమరావతిలో అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ డైరెక్టరేట్ ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధులతో పాటు అడిషనల్ డీజీ ర్యాంకు అధికారి, ఇతర సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. ఎన్‌సీసీ ట్రైనింగ్ అకాడమీలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, తీరప్రాంతాల్లో ఎన్‌సీసీ యూనిట్లను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

'గూగుల్'తో మారనున్న విశాఖ ముఖచిత్రం

గూగుల్ క్లౌడ్ డేటా సిటీతో విశాఖపట్నం ముఖచిత్రం మారనుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ (పబ్లిక్ సెక్టార్ అండ్ ఎడ్ టెక్) ఆశిష్, వారి బృందంతో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఏర్పాటు చేయబోయే డేటా సిటీకి సంబంధించిన అంశాలపై కీలక చర్చలు జరిపారు. ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన అనుమతులు, భూ కేటాయింపులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని గూగుల్ క్లౌడ్ ఎండీ బిక్రమ్ సింగ్ కొనియాడారు. డేటా సిటీ పనుల వేగవంతానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు.



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అరకు కాఫీని అందజేస్తున్న మంత్రి లోకేశ్

నిధులిచ్చినందుకు కృతజ్ఞతలు

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవానికి దాదాపు రూ. 12 వేల కోట్లు విడుదల చేసినందుకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులను మంజూరు చేయాలని కోరారు. కూమారస్వామి నివాసంలో ఉన్న మాజీ ప్రధాని దేవెగౌడను మర్యాదపూర్వకంగా లోకేశ్ కలిశారు. ఆయనకు పాదాభివందనం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వృద్ధిలోకి వస్తారంటూ ఈ సందర్భంగా లోకేశ్‌ను దేవెగౌడ ఆశీర్వదించారు. లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో మళ్లీ కదలిక

» తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని బెదిరించారంటూ దస్తగిరి ఫిర్యాదు

» నలుగురిపై కేసు.. ఏ1గా దేవిరెడ్డి చైతన్యరెడ్డి

» ఏ2గా కడప జైలు మాజీ సూపరింటెండెంట్

» నిందితుల్లో డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వర్‌రెడ్డి



చైతన్యరెడ్డి ప్రకాశ్ నాగరాజు ఈశ్వర్‌రెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో కదలిక వచ్చింది. కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి.. తనను జైలులో బెదిరింపులకు గురిచేశారంటూ ఇటీవల ఫిర్యాదు చేశాడు. వివేకా హత్య కేసును అప్పట్లో విచారణ చేసిన సీబీఐ ఎస్పీ రాంసింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలంటూ తనను వేధించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఫిర్యాదుతో ఏకంగా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్, డీఎస్పీ, సీఐలతో పాటు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డిలపై కేసు నమోదైంది. దీంతో వివేకా హత్య కేసు మళ్లీ హాట్‌టాపిక్‌గా మారింది. తాజా కేసులో ఏ-1గా డాక్టర్ చైతన్యరెడ్డి, ఏ-2గా గతంలో కడప సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రకాశ్, ఏ-3గా గతంలో జమ్మలమడుగులో డీఎస్పీగా పనిచేసిన నాగరాజు, ఏ-4గా, ఎర్రగుంట్ల సీఐగా పనిచేసిన ఈశ్వర్‌రెడ్డిపై ఐపీసీ 341, 506, 323, 195(ఎ), 330 సెక్షన్ల కింద పులివెందుల అర్బన్ ఎస్ఐ విష్ణునారాయణ బుధవారం కేసు నమోదు చేశారు. దస్తగిరి ఫిర్యాదులో ముఖ్యమైన వివరాలు.. 'వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తీవ్రంగా వేధించారు. నాపై 2023లో ఎర్రగుంట్లలో ఓ కిడ్నాప్ కేసు నమోదైంది. దాన్ని అడ్డుపెట్టుకుని వివేకా హత్యకేసులో సాక్ష్యం చెప్పవద్దంటూ అప్పట్లో ఎర్రగుంట్ల సీఐగా పనిచేసిన ఈశ్వరయ్య, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. ఆ కేసులో రిమాండు నిమిత్తం కడప సెంట్రల్ జైలుకు తరలించాక.. అక్కడ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు దేవిరెడ్డి చైతన్యరెడ్డి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్ తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ బెదిరించారు. చైతన్యరెడ్డి బెదిరిస్తూ.. నీవు అప్రూవర్‌గా మారి మా రాజకీయ జీవితం నాశనం చేశావు. నీ వల్ల మానాన్న, అవినాశ్‌రెడ్డి నాన్న భాస్కర్‌రెడ్డి జైలుకు వెళ్లారు. భాస్కర్‌రెడ్డికి ఏమైనా జరిగితే అవినాశ్‌రెడ్డి అన్న, నేను నిన్ను నరికేస్తాం. మా మాట వింటే బాగుపడతావు. లేదంటే జైల్లోనే చస్తావు. మేం చెప్పినట్లు వింటే రూ. 20 కోట్లు అడ్వాన్స్ ఇస్తాం. వివేకా పీఏ క్రిష్టారెడ్డి ఎలా సహకరిస్తున్నారో నీవు అలా సహకరిస్తే బావుంటావు, లేదంటే జీవితాంతం జైల్లోనే ఉంచేస్తామని బెదిరించాడు" అని ఫిర్యాదులో దస్తగిరి పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై దస్తగిరి పులివెందుల పోలీసులకు ఈనెల 3వ తేదీన ఫిర్యాదు చేశాడు.

పేదల పేరిట గద్దలకు

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ శాఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. చేజారిపోయిన భూములను తిరిగి కాపాడాలని, వాటిని నిషేధిత జాబితాలో చేర్చాలని సూచించింది. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఒక్కో కేసును నిశితంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జి. జయలక్ష్మి ఈ మేరకు కలెక్టర్లకు సర్క్యులర్ జారీ చేశారు.



నాగార్జున యూనివర్సిటీలో రీ సర్వే అప్పీళ్ల డీటీలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎల్ఏ జయలక్ష్మి. చిత్రంలో సర్వే డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు

నాడు ఎన్నో అక్రమాలు

జగన్ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ చేసిన సంగతి తెలిసిందే. డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో అధికారుల కమిటీ 15 లక్షల ఎకరాల భూముల రికార్డులను పునఃపరిశీలన చేసింది. 13,59,805 ఎకరాల అసైన్డ్ భూమిని ఫ్రీ హోల్డ్ చేశారని కమిటీ గుర్తించింది. ఇందులో 4.72 లక్షల ఎకరాలను జీఓ 596ను ఉల్లంఘించి నిషేధిత జాబితా 22(ఏ) నుంచి బయటకు తీశారని లెక్కతేల్చారు. నివేదికల ఆధారంగా అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని గత కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయితే సమావేశం ముగిసి రెండు నెలలు దాటినా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయలేదు. భూ అక్రమాలపై శాఖాపరమైన చర్యలు లేవు. దీంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు. దీనిపై 'టాస్క్ లేదు.. ఫోర్స్ లేదు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా దానిపై ప్రభుత్వం స్పందించింది. భూముల అక్రమాలపై విచారణ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో సీసీఎల్ఏ సర్క్యులర్ జారీచేశారు. దానిలోని కీలకాంశాలు...

అడ్డగోలుగా హక్కులు

జగన్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించే పేరిట జీఓ 596 జారీ చేశారు. దీన్ని అడ్డం పెట్టుకొని 20 ఏళ్ల కాలపరిమితి దాటని భూములను కూడా నిషేధిత జాబితా నుంచి బయటపడేసి హక్కులు కల్పించారు. ఈ ఉదంతాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించింది. డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్, మండల సర్వేయర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయించి ఫ్రీహోల్డ్ చేసిన రికార్డులను పునఃపరిశీలన చేయించింది. 13,59,805 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేసినట్లు సీసీఎల్ఏ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. జీఓ 596ను ఉల్లంఘించి 4,72,423 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి బయటకు తీశారని వెల్లడించారు.

ఆ అధికారులను గుర్తించండి

భూముల అక్రమాల్లో ప్రైవేటు వ్యక్తులతో పాటు రెవెన్యూ అధికారుల పాత్ర ఉంది. చట్టవిరుద్ధంగా జీఓ 596ను ఉల్లంఘించి మరీ లక్షల ఎకరాలను ప్రైవేటుపరం చేయడంలో అధికారుల పాత్రే కీలకం. ఈ నేపథ్యంలో అక్రమాలకు బాధ్యులైన అధికారులను గుర్తించి సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ జయలక్ష్మి కలెక్టర్లను ఆదేశించారు.

మళ్లీ నిషేధిత జాబితాలోకి...

జీఓ 596ను ఉల్లంఘించి ఫ్రీహోల్డ్ చేసిన భూములను సంరక్షించాలని సీసీఎల్ఏ ఆదేశించారు. ఆ తర్వాత ఆ భూములను నిషేధిత జాబితా 22(ఏ)లో చేర్చిన తర్వాత నోటిపై చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ భూముల వివరాలను తిరిగి రెవెన్యూ రికార్డుల్లో, ఆన్ లైన్‌లో తాజాపరచి, జిల్లా రిజిస్ట్రార్‌కు వివరాలను పంపించాలన్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు అక్రమార్కులపై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

రీ సర్వే అప్పీళ్లు పరిష్కరించకుంటే సస్పెండ్ చేస్తా

» పనితీరు మారకుంటే ఉపేక్షించేది లేదు: సీసీఎల్ఏ హెచ్చరిక

భూముల రీ సర్వేలో అప్పీళ్లను పరిష్కరించే డిప్యూటీ తహసీల్దార్లపై భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా సొంత పనులపై దృష్టిపెడుతున్న వారిని సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. అప్పీళ్లు వినడానికే మండలానికి డీటీ పోస్టులు ఇచ్చారని, అలాంటిది ప్రభుత్వం అప్పగించిన పనిచేయకపోతే సర్వీసులో రివర్షన్ ఇస్తామన్నారు. రీ సర్వే అప్పీళ్ల డీటీలతో రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా బుధవారం నాగార్జున యూనివర్సిటీలో సమావేశం నిర్వహించాయి. అదనపు సీసీఎల్ఏ, సర్వే డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మి మాట్లాడారు. నాడు జగన్ ప్రభుత్వంలో తప్పుల తడకగా సాగిన భూముల రీ సర్వే రైతులు పడుతున్న కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'జగన్ చేసిన భూ గాయాలు' శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ తీవ్రంగా స్పందించారు. 'కోర్టుల్లో వివాదాలున్న కేసులను ఒకట్రెండు రోజుల్లో పరిష్కరిస్తున్నారు. రీ సర్వేలో అధికారుల వైఫల్యం వల్ల వచ్చిన తప్పులను సరిదిద్దడానికి సంవత్సరాల తరబడి సమయం తీసుకుంటున్నారు. ఇదెక్కడి న్యాయం? మీ పనితీరు ఇలాగే ఉంటే ఇకపై ఉపేక్షించేది లేదు. అప్పీళ్లు తీసుకోకున్నా, రైతుల కేసులను పరిష్కరించకున్నా సస్పెండ్ చేస్తాం. సర్వీసులో రివర్షన్ ఇస్తాం. ఇక మళ్లీ పదోన్నతులు రావు. మీరు ఏమనుకుంటున్నారో? రైతుల సమస్యల కన్నా మీకు మీ సొంత పనులే ముఖ్యమయ్యాయా? మీ వైఫల్యం వల్ల రైతులకు లెక్కలేనన్ని సమస్యలు వచ్చాయి' అని ఆమె మందలించినట్లు తెలిసింది. రీ సర్వే గ్రామాల్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సభల్లో 2.80 లక్షల విన్నపాలు వచ్చాయి. అందులో సింహభాగం అప్పీళ్ల డీటీలు తమ సమస్యలను పరిష్కరించలేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. రీ సర్వేలో వచ్చే తప్పులను సర్వేయర్లు సరిదిద్దాలి. లేదంటే మండల స్థాయిలో రీ సర్వే అప్పీళ్ల డీటీ వద్ద పిటిషన్ ఇవ్వాలి. దాన్ని డీటీ పరిశీలించి సమస్య పరిష్కారానికి తగిన ఆదేశం ఇవ్వాలి. అయితే జగన్ ప్రభుత్వంలో అప్పీళ్ల డీటీ వ్యవస్థ పేరుకే పరిమితమైందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల రీ సర్వే ఇబ్బందుల పరిష్కారం కోసం డీటీల సమావేశం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అప్పీళ్లు, రైతుల విన్నపాలను పరిష్కరించడంలో డీటీల పనితీరు బాగోలేదని సర్వే డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇకపై వారం వారం నివేదికలు కోరుతామన్నారు.

కిక్కు లెక్క తేల్చేస్తారు!

(మొదటి పేజీ తరువాయి)

ఎల్.సుబ్బరాయుడు, ప్రకాశం జిల్లా ప్రాంతీయ విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాస్, మంగళగిరిలోని సీఐడీ అదనపు ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు, నంద్యాల జిల్లా డోన్ డీఎస్పీ పి.శ్రీనివాస్, సీఐలు కె.శివాజీ, సీహెచ్ నాగశ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం దోపిడీ ప్రత్యేక బృందంతో దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హోదాలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఈ నెల 1న ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికే నిరుడు సెప్టెంబరులో సీఐడీ నమోదు చేసిన కేసు(21/2024) విచారణలో కీలక సమాచారాన్ని రాబట్టిన సర్కారు.. మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి తాజాగా సిట్‌ను నియమిస్తూ జీవో జారీచేసింది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ పర్యవేక్షణలో విచారణ జరపాలని.. కేసు దర్యాప్తులో రాష్ట్రంలోని ప్రతి శాఖా సిట్‌కు తగు సహకారం అందించాలని స్పష్టం చేసింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్)-2023 మేరకు పూర్తి అధికారాలున్న సిట్‌కు సాంకేతికంగా ఎలాంటి సమాచారం కావాలన్నా అందించాలని పేర్కొంది. సిట్‌కు పూర్తి అధికారాలు అప్పగించింది. పోలీసు స్టేషన్ హోదా కూడా కల్పించింది. కేసు దర్యాప్తు వివరాలు, ఇతరత్రా వెలికి తీసిన అంశాలను సీఐడీ డీజీతో పాటు డీజీపీకి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొంది.

కమీషన్లు ఇస్తేనే మద్యం ఆర్డర్లు..

ప్రజలను మద్యానికి దూరం చేస్తున్నామంటూ.. భారీగా లిక్కర్ ధరలు పెంచేసి.. కమీషన్లు ఇచ్చిన వారికే ఆర్డర్లు ఇచ్చిన వైసీపీ పెద్దల బాగోతాన్ని.. కూటమి ప్రభుత్వం వెలుగులోకి తెచ్చింది. ఎక్సైజ్ కమిషనర్ ఎంకే మీనా ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా గత సెప్టెంబరు చివరి వారంలో కేసు నమోదు చేసిన సీఐడీ మరింత సమాచారం సేకరించింది. పాపులర్ మద్యం బ్రాండ్లను తరిమేసి.. నాసిరకం జే బ్రాండ్లు తెచ్చి షాపులకు సరఫరా చేసినట్లు గుర్తించింది. అందుకు ప్రతిఫలంగా ప్రతి బాక్స్‌పై కనీసం రూ.150 నుంచి గరిష్ఠంగా రూ.450 వరకూ నాటి ప్రభుత్వ పెద్దలు వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించింది. వైసీపీ ఎంపీలు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి (ఈయన ఇటీవల వైసీపీకి, రాజ్యసభకు రాజీనామా చేశారు) ఇందులో కీలక పాత్ర పోషించినట్లు తేల్చింది. ప్రతి నెలా రూ.60 కోట్లకు తగ్గకుండా ప్రతి వారం ఒక వాహనంలో కమీషన్ డబ్బులు తీసుకొచ్చి ప్యాలెస్ పెద్దలు చెప్పిన చోటకు చేర్చినట్లు గుర్తించింది. జగన్ పాలనలో ఐటీ సలహాదారుగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ ఆ భారీ నల్లధనాన్ని హవాలా రూపంలో ముఖ్య నేతకు చేర్చిన వైనాన్ని కనిపెట్టింది.

అడ్డగోలు వసూళ్లు 3,113 కోట్లు

వ్యవస్థీకృత మాఫియాగా ఏర్పడిన జే గ్యాంగ్ సభ్యులు మద్యం కుంభకోణంలో రూ.3,113 కోట్లు వసూలు చేసినట్లు ఇప్పటికే తేలింది. ఇంత పెద్ద మొత్తాన్ని ఎవరో వచ్చి కోడ్ చెప్పి మాఫియా తరహాలో తీసుకెళ్లిన వైనం నుంచి హవాలా వరకూ ఎవరి పాత్ర ఎంత అనేదానిని ఇక సిట్ తేల్చనుంది. తెర వెనుక సూత్రధారి రాజ్ కసిరెడ్డి నుంచి నేరుగా ప్రమేయమున్న మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి వరకూ అందరికీ శ్రీముఖాలు పంపే అవకాశాలున్నాయి. విదేశీ సిమ్‌లు వాడి ప్రకాశ్ కాలింగ్ పేరుతో వసూలు చేసిన వ్యక్తుల నుంచి నగదు తీసుకెళ్లిన వ్యక్తుల గుట్టు రట్టు చేయబోతోందని పోలీసు వర్గాలు తెలిపాయి. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సొంత బ్రాండ్లతోపాటు ఇచ్చిన భారీ ఆర్డర్ల వెనకున్న రహస్యాన్ని సిట్ ఛేదిస్తుందని పేర్కొన్నాయి.

డిస్టిలరీలు కబ్జా..

అధికారంలోకొచ్చిన వెంటనే మద్యం దోపిడీపై దృష్టి సారించిన జగన్ అండ్ కో.. మొదట మద్యం డిస్టిలరీస్‌ను బలవంతంగా లాక్కుంది. ఏపీలోనే పెద్దదైన నంద్యాల ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌తోపాటు దాదాపు అన్నింటినీ గుప్పిట్లోకి తెచ్చుకుంది. నాణ్యమైన పాపులర్ బ్రాండ్లను తరిమేసి.. ఆయా డిస్టిలరీల్లో నాసిరకమైన 'జే' బ్రాండ్లు ఉత్పత్తి చేయించింది. కమీషన్లు ఇచ్చిన వారికి మాత్రమే రూ.వేల కోట్ల మద్యం ఆర్డర్లు ఇప్పించింది. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ వద్ద 235 కంపెనీలు మద్యం సరఫరాకు నమోదై ఉండగా.. వాటిలో ఏడింటికి మాత్రమే రూ.9,221 కోట్ల ఆర్డర్లు ఇప్పించారు. ఎస్ఎస్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్‌కు రూ.2,876 కోట్లు.. ఎస్పీవై ఆగ్రోస్ ఇండస్ట్రీస్-1,569 కోట్లు.. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్-1,472 కోట్లు.. సెంటినీ బయో ప్రొడక్ట్స్-1,132 కోట్లు.. ఎలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్-983 కోట్లు.. ఆదాన్ డిస్టిలరీస్-739 కోట్లు.. లీలా డిస్టిలరీస్‌కు రూ.450 కోట్ల మేర ఇచ్చిన ఆర్డర్ల వెనుక భారీగా అవినీతిని గుర్తించింది.

'ఒబెరాయ్'కి తొలగిన అడ్డంకులు


తిరుపతిలో జరుగుతున్న ఒబెరాయ్ సెవెన్‌స్టార్ హోటల్ నిర్మాణ పనులు

- తిరుపతిలో మొదలైన సెవన్‌స్టార్ హోటల్ నిర్మాణ పనులు
- రాయలసీమలోనే తొలి సెవన్‌స్టార్ లగ్జరీ హోటల్
- చంద్రబాబు చొరవ.. తుడా అనుమతులు మంజూరు
- ఏడాదిన్నరలో నిర్మాణాలు పూర్తయ్యే చాన్స్

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

తిరుపతిలో ఒబెరాయ్ సెవెన్ స్టార్ లగ్జరీ విల్లాస్‌తో కూడిన రిసార్ట్ నిర్మాణానికి అడ్డంకులు తొలిగాయి. రాయలసీమలోనే తొలి సెవన్‌స్టార్ లగ్జరీ హోటల్ నిర్మాణానికి మూడేళ్లుగా ఉన్న అవరోధాలు సీఎం చంద్రబాబు చొరవతో తొలగిపోయాయి. ఇంతకాలం పెండింగులో ఉన్న తుడా అనుమతులు కూడా ఇటీవలే మంజూరయ్యాయి. పనులు మొదలు కావడంతో ఏడాదిన్నరలో నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒబెరాయ్ గ్రూప్స్‌కు చెందిన మెస్సర్స్ ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్ తిరుపతిలో సెవెన్ స్టార్ లగ్జరీ విల్లాస్‌తో కూడిన రిసార్ట్ ఏర్పాటుకు 2021లో ముందుకొచ్చింది. దీనికి తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో 20 ఎకరాలను 66 ఏళ్ల లీజుకు కేటాయిస్తూ 2022 జూలై 4న జీవోఎంస్ నంబరు 12 జారీ అయ్యింది. 2023 జూలై 9న అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేసినా అప్పట్లో నిర్మాణ పనులను ఆ సంస్థ మొదలుపెట్టలేదు. ఈ రిసార్ట్ ప్రాజెక్టు వ్యయం రూ.300 కోట్లు అని ఉండగా, ఒప్పందం నాటికి ప్రాజెక్టు వ్యయం రూ.వంద కోట్లకు తగ్గింది. దీని నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఏడాదిగా బీజేపీ సహా హిందూ సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. తిరుమల కొండల పాదాల చెంత ఇటువంటి హోటల్ ఏర్పాటు వల్ల సంస్కృతి పాడవుతుందన్నది వీటి వాదన. అందులో మాంసాహారం, మద్యపానం, స్పా మసాజ్ సెంటర్ వంటివి ఉంటాయని ఈ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది హిందూయేతర మతానికి చెందిన సంస్థగా భావించి సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక పంపారు. మరోవైపు ఒబెరాయ్ సంస్థ ముంతాజ్ అన్న పేరుతో ఉన్న బోర్డును తొలగించి ట్రిడెంట్ గ్రూప్ అన్న పేరుతో బోర్డు ఏర్పాటు చేసింది. దీంతో నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్టు సమాచారం. రిసార్ట్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం ఆదేశించినట్టు సమాచారం. ఆ మేరకు తుడా నుంచీ ఇటీవలే అనుమతులు పొందిన ఒబెరాయ్ సంస్థ నిర్మాణ పనులు ప్రారంభించింది.


అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ఎంఓయూలు కుదుర్చుకున్న వివిధ కంపెనీల ప్రతినిధులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్


'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా'గా అనంత

- చంద్రబాబు కల సాకారానికి తొలి అడుగు
- 'అనంత ఉద్యాన సమ్మేళనం'లో మంత్రి పయ్యావుల
- ఎంఓయూలు కుదుర్చుకున్న ఏడు కంపెనీలు

అనంతపురం ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'కరువు జిల్లా అనంతను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు కల. ఇప్పటికే జిల్లా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా ఉంది. దీనిని ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చడమే లక్ష్యం' అని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనంతో (అనంత హార్టికల్చర్ కాంక్లేవ్) చంద్రబాబు కలసాకారానికి తొలి అడుగు పడిందని అన్నారు. అనంతపురంలో బుధవారం నిర్వహించిన అనంత ఉద్యాన సమ్మేళనంలో మంత్రి పయ్యావుల ప్రసంగించారు. రైతన్నల జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నదే మా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఈ సమ్మేళనానికి దాదాపు 64 కంపెనీలు హాజరుకావడం అభినందనీయం. కరువు జిల్లా అనంతలో మిరప, దానిమ్మ, సీతాఫలంతోపాటు 24 రకాల ఉద్యాన పంటలు పండిస్తున్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఇలాంటివాటి ద్వారా ఉద్యాన రైతులను ఆదుకుంటాం. ఉద్యాన పంటల సాగులో బ్రాండ్ అనంతను సృష్టించడమే ధ్యేయం. ఇప్పటికే జిల్లాలో పండిన అరటి గల్ఫ్ దేశాలకు వెళుతోంది. ఢిల్లీలోనూ మన కర్బూజకు గుర్తింపు వచ్చింది. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో ప్రారంభించుకోబోతున్నాం' అని పయ్యావుల తెలిపారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌లో భాగంగా పలు కంపెనీలు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించాయి. అవి రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయో ఆయా సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులకు వివరించారు. మైక్రో అలిగే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (ఆల్గా ఎనర్జీ స్పెయిన్ అనుబంధ సంస్థ), సిద్ధార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్(కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్(తెలంగాణ), ఆగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ (న్యూ ఢిల్లీ), బనానా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్(హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంటల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో జిల్లా కలెక్టర్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

కరెంటు కోతలు ఉండకూడదు

- వేసవి డిమాండ్‌ను తట్టుకునేలా కార్యాచరణ
- ఇంధన శాఖకు సీఎం ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి తీవ్రత అత్యధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలూ లేకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధన శాఖను ఆదేశించారు. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ఆయన సమీక్ష జరిపారు. నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలూ ఇవ్వాల్సిందేనని ఇంధన శాఖను కూడా చూస్తున్న సీఎస్ విజయానంద్‌కు స్పష్టం చేశారు. మంగళవారం 12,260 మెగావాట్ల డిమాండ్‌ను తట్టుకున్నామని.. ముున్ముందు ఈ డిమాండ్ ఆరు శాతం దాకా పెరిగే వీలుందని విజయానంద్ చెప్పారు.

45.72 మీటర్ల ఎత్తులోనే పోలవరం

- 2 దశలంటూ ముక్కలు చేసింది జగనే: నిమ్మల



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మిస్తామని రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మొదటి దశలో 41.15 మీటర్ల ఎత్తుకు పూర్తిచేసి నీరందిస్తామని.. తర్వాత 45.72 మీటర్ల ఎత్తున నిర్మాణంతో ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. బుధవారమిక్కడ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ సభ అనంతరం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. రెండు దశలంటూ ప్రాజెక్టును ముక్కలు చేసి నాశనం చేసింది జగనేనన్నారు. ఎత్తుపై ధర్నా చేయడానికి ఆయనకు అర్హత లేదన్నారు. డిసెంబరుకు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తవుతుందని, 2027 డిసెంబరుకు ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు.

సీమలో సాగుకు.. 7 గంటలే కరెంటు!

అనంత, సత్యసాయి జిల్లాల్లోని కొన్నిచోట్ల రాత్రి పూట ఇవ్వాలని ఉత్తర్వు

- ఎస్పీడీసీఎల్ వివాదాస్పద నిర్ణయం
- సూపరింటెండెంట్లకు సీజీఎం మెమో జారీ
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం
- 9 గంటల కరెంటు చంద్రబాబు నిర్ణయం
- ఆ మేరకు ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- ఎత్తిపోతలకు 16 గంటలివ్వాలని ఆదేశం




అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కరువు సీమలో వ్యవసాయానికి ఏడు గంటలే ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. రెండు జిల్లాల్లో రెండు విడతల్లో 8 గంటలపాటు ఇవ్వాలని.. కొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట సరఫరా చేయాలని కూడా నిశ్చయించడం కలకలం రేపుతోంది. పగటి పూట తొమ్మిది గంటలు సరఫరా చేయాలన్న ప్రభుత్వ ప్రాథమిక విధానాన్ని, ఉద్దేశాన్ని నీరుగార్చి.. 7 గంటలకు కుదించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా.. సీమ, నెల్లూరు జిల్లాల్లో సాగుకు ఏడు నుంచి తొమ్మిది గంటలు కరెంటు ఇవ్వాలని ఈ నెల మూడో తేదీన ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లకు సీజీఎం రమణాదేవి అంతర్గత మెమో జారీ చేశారు. వ్యవసాయానికి తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయం. దీనిని సవరించాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతి పొందాలి. విద్యుత్ కొరత కారణంగా 9 గంటలకు బదులు 7 గంటలే వ్యవసాయానికి సరఫరా చేసేందుకు ఎస్పీడీసీఎల్‌కు ముందస్తు అనుమతి లేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఆ డిస్కం మాత్రం జిల్లాల్లోని వివిధ ప్రాంతాలను మూడు గ్రూపులుగా విడదీసి.. ఏ ప్రాంతానికి ఎప్పటి నుంచి ఎప్పటి దాకా, ఏ సమయంలో కరెంటు ఇవ్వాలో నిర్ణయించేసింది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో పగలు నిరంతరాయంగా 8 గంటలు.. అనంతపురం జిల్లాలోని బీ, సీ గ్రూపు ప్రాంతాల్లో, శ్రీసత్యసాయి జిల్లా మొత్తం 8 గంటలు సరఫరా చేయాలని.. అది కూడా రెండు విడతల్లో ఇవ్వాలని ఆదేశించింది. అనంతపురం బీ గ్రూపులో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు, మర్నాటి ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు ఇవ్వాలని.. సీ గ్రూపు ప్రాంతాల్లో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు, మర్నాటి ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇవ్వాలని.. సత్యసాయి జిల్లా ఏ-గ్రూపు ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు.. బీ గ్రూపు ప్రాంతాల్లో అర్ధరాత్రి 12.00 నుంచి వేకువజామున 3 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు.. సీ-గ్రూపు ఏరియాల్లో అర్ధరాత్రి 12 నుంచి వేకువజామున 3 గంటల వరకు, తర్వాత ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా చేయాలని మెమోలో పేర్కొన్నారు. ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్ రెండూ పగటిపూట తొమ్మిది గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఎస్పీడీసీఎల్ తీరుపై విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా.. రాష్ట్రమంతటా రైతులకు పగటిపూటే నిరంతరాయంగా 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నది సీఎం చంద్రబాబు నిర్ణయమని, అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. డిస్కం నిర్ణయాన్ని తక్షణమే సరిదిద్దుతామని చెప్పారు. ఎత్తిపోతల పథకాలకు కూడా దాదాపు 16 గంటల పాటు సరఫరా చేయాలని ఆదేశించామన్నారు.

(సమయం గంటల్లో)

ఎస్పీడీసీఎల్ పరిధిలో కరెంటు సరఫరా ఇలా..

జిల్లా	గ్రూపు-ఏ	గ్రూపు-బీ	గ్రూపు-సీ
నెల్లూరు	8.30-15.30	10.30-17.30	-
తిరుపతి	8.45-15.45	10.45-17.45	-
చిత్తూరు	8.45-15.45	10.45-17.45	-
కడప	8.15-15.45	11.00-18.00	-
అన్నమయ్య	7.45-14.45	11.00-18.00	-
అనంతపురం	7.45-14.45	21-00-24.00	21.00-24.00
		9.45-13.45	8.00-12.00
శ్రీసత్యసాయి	8.00-12.00	00.00-3.00	00.00-3.00
	15.00-18.00	14.00-18.00	10.00-14.00

విశాఖలో.. వైవిధ్యాల.. ఉద్యానవనం!


అరెస్టోలోకియా రింజెన్స్

విశాఖ నగరంలోని పెదవాల్తేరులోగల జీవ వైవిధ్య ఉద్యానవనంలో భిన్న జాతుల మొక్కలు ఉన్నాయి. ఈ మొక్కలు భిన్న ఆకృతులతో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. వీటిలో అరెస్టోలోకియా రింజెన్స్ ప్రత్యేకతే వేరు. తీగ జాతికి చెందిన ఈ మొక్క జనవరి, ఫిబ్రవరి నెలల్లో పుష్పిస్తుంది. ఈ మొక్క పూలు బాతు ముక్కు, జేమ్స్ బాండ్ సిగార్ మాదిరి కనిపిస్తుండడంతో అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఈ పూలలో ఉండే చిన్నపాటి పండ్లను తినేందుకు చిన్న సైజు గబ్బిలాలు వస్తుంటాయి. ఈ పూల కోసం క్రిమ్సన్ రోజ్, కామన్‌రోజ్ అనే సీతాకోక చిలుకలు వస్తుంటాయి. ఈ పూలను అలంకరణకు వాడతారు. అరుదుగా కనిపించే ఈ మొక్కలను చూసేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుంటారని ఉద్యానవనం వ్యవస్థాపకులు ఎం.రామమూర్తి, మంగతాయి చెప్పారు.


మిక్కీ మౌస్ ట్రీ

మిక్కీమౌస్ ప్రత్యేకతే వేరు!

ఈ ఉద్యాన వనంలోని మిక్కీ మౌస్ మొక్కది మరో ప్రత్యేకత. దీని పూలు తొలుత పసుపు రంగులో ఉంటాయి. వారం రోజుల్లో ఎరుపు రంగుకు మారతాయి. తొలుత కాచే కాయలు ఆకుపచ్చగా ఉంటే వారం రోజుల్లో అవి నల్లని చెర్రీల ఆకారంలోకి మారతాయి. రెండు వారాల్లోనే ఈ మొక్క పూలు, పండ్లు రంగులు, ఆకృతులు మార్చుకోవడం, అవి కూడా మిక్కీ మౌస్ కార్టూన్ షోలో కనిపించే బొమ్మలను పోలి ఉండడంతో ఈ మొక్కకు ఆ పేరు పెట్టారు. ఈ మొక్క శాస్త్రీయ నామం ఓక్నా సెర్రులేట. దీనిని అలంకరణకు ఉపయోగిస్తారని రామమూర్తి తెలిపారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

అయినా.. మనిషి మారలేదు!

- ఊహాలోకంలోనే జగన్ విహారం
- ఎన్నికలు ఇప్పుడొచ్చినా గెలుస్తాం!
- 30 ఏళ్లు నేనే సీఎంని.. పార్టీ నేతలతో వ్యాఖ్యలు



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "ముప్పై ఏళ్లు నేనే ముఖ్యమంత్రిని"... అధికారంలో ఉండగా జగన్ తరచూ చెప్పిన మాట ఇది! ఇప్పుడు... పవర్ పోయి ఎనిమిది నెలలైంది. అంతలోనే... 'మళ్లీ గెలుస్తాం. 30 ఏళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా' అని పాత పాట అందుకున్నారు. బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో విజయవాడ నగర వైసీపీ నేతలతో జగన్ సమావేశమయ్యారు. ఈ భేటీలో కలలకు కళ్లెం లేదు, ఊహలకు హద్దే లేదన్న రీతిలో మాట్లాడారు. "జమిలి ఎన్నికలు ఇప్పుడు జరిగినా విజయం నాదే. ఐదేళ్ల నా పాలనతో తొమ్మిది నెలల టీడీపీ పాలనను జనం బేరీజు వేసుకుంటున్నారు" అన్నారు. తన 2.0 పాలన కార్యకర్తల కేంద్రంగానే ఉంటుందని చెప్పారు. "నా మొదటి విడత పాలన అంతా ప్రజలపైనా, వారికి అందించాల్సిన సంక్షేమం పైనే దృష్టి పెట్టాను. ఈసారి అలా జరగదు. పూర్తిగా కార్యకర్తల కోసమే 2.0 పాలన ఉంటుంది" అని జగన్ అన్నారు.

ఇదేం గోల...

ఎన్నికలకు ముందు ఆయన ఇదే ధోరణిలో వై నాట్ 175 అంటూ బీరాలు పలికారు. ప్రతిపక్ష కూటమికి ఒక్క స్థానం కూడా రాదని సభలు, ప్రచార కార్యక్రమాల్లో ఆవేశపడ్డారు. సరే.. ఎన్నికల సమయంలో ఇలాంటి ధోరణిని ప్రదర్శించారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ, మాజీగా.. మారిన తర్వాతా అదే రాగం వినిపించడంతో.. సొంత పార్టీ శిబిరంలోని వారే చిరాకు పడిపోతున్నారు. "బాస్ చెప్పాడుగా... ఇక 30 ఏళ్లు జగనే సీఎం" అంటూ మాట్లాడుకోవడం మామూలై పోయింది. గతనెలలో లండన్ పర్యటనకు వెళ్లిన జగన్.. సోమవారం తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. మరునాడు తనను కలసిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ.. పోలవరంపై సొంత డబ్బా వినిపించారు. తన హయాంలో పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రగతి పరుగులు తీసిందని.. చెప్పుకొచ్చారు. పోలవరంలో పనులు తమకు తెలియకుండా ఎక్కడ పరుగులు పెట్టాయో తెలియక అక్కడ ఉన్న నేతల్లో కొందరు తెల్లముఖం వేశారని సమాచారం.

ఆత్మవిమర్శ ఏదీ?

జగన్ ఓటమికి కారణాలు ఏమిటనేది ఇప్పటికే రాజకీయ విశ్లేషకులు బయటపెట్టారు. ఆ రోజుల్లో ఫోన్లలో ధైర్యంగా మాట్లాడుకునేవారు కాదు. 'చెవులు' వింటాయని చాలావరకు వాట్సాప్ కాల్ చేసుకుని మాట్లాడుకునేవారు. రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛకు గత ప్రభుత్వం పట్టించిన గతి ఇది. వీటిపై ఆత్మవిమర్శ చేసుకునేందుకు జగన్ ప్రయత్నించడం లేదు. పైగా, జనం తననే సీఎంగా కోరుకుంటున్నారన్న భ్రమల్లో ఆయన ఉన్నారని ఆ పార్టీ నేతలే ప్రైవేటు సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్రమంతా ఒకే రైల్వే జోన్...



(మొదటి పేజీ తరువాయి)

మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఏపీ పరిధిలో పనిచేస్తున్న డివిజన్లు కోతలకు, కుదింపులకు, మార్పులకు గురికానున్నాయి. దేశంలోనే అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతున్న వాల్తేరు డివిజన్‌ను రద్దు చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించిన కేంద్రంపై కూటమి ఎంపీల ఒత్తిడి ఫలించింది. ఈ డివిజన్‌ను ఇకపై విశాఖపట్నం డివిజన్‌గా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనిపై నిజానికి గత నెల 10నే కేంద్రం నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆ వివరాలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ప్రాంతం భువనేశ్వర్ కేంద్రంగా నడుస్తున్న తూర్పు కోస్తా జోన్‌లోను, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలన్నీ సికింద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న దక్షిణమధ్య రైల్వే జోన్‌లోను ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండింటిలోని ప్రాంతాలను కలిపి విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా జోన్' ఏర్పాటుచేశారు. ఇందులో విశాఖపట్నం, (పాత వాల్తేరు డివిజన్‌లో కొంత భాగం), విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉంటాయి. ఈ నేపథ్యంలో గుంతకల్లు డివిజన్‌కు కొంత కోత పడింది. ఇకపై రాష్ట్రంలో రైల్వేకు సంబంధించి ఎటువంటి అవసరాలు ఉన్నా సికింద్రాబాద్, భువనేశ్వర్‌లకు వెళ్లాల్సిన అవసరం లేదు. విశాఖపట్నంలోనే పరిష్కారం లభించనుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన రైల్వే బోర్డు ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం..: విశాఖ కేంద్రంగా ప్రత్యేక జోన్ ఇస్తామని ఐదేళ్ల క్రితం ప్రధాని మోదీ ప్రకటించారు. నెల రోజుల క్రితం (జనవరి 8న) జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జోన్ ఏర్పాటులో భాగంగా 130 ఏళ్లుగా నడుస్తున్న వాల్తేరు డివిజన్‌ను రద్దు చేస్తున్నట్టు చాలాకాలం క్రితమే కేంద్రం ప్రకటించింది. దేశంలో అత్యధిక ఆదాయం సమకూర్చే పది డివిజన్లలో వాల్తేరు ఒకటి. ఏడాదికి రూ.10 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. దీనిని రద్దు చేస్తే విశాఖ జోన్‌కే అర్థం ఉండదని, ఆ డివిజన్ లేకుండా జోన్ అవసరం లేదని ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పార్లమెంటు సభ్యులు కేంద్రంపై ఒత్తిడి పెంచారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మరోవైపు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ వాల్తేరు డివిజన్ ఉండాలని పట్టుబట్టారు. దీంతో ఎట్టకేలకు కేబినెట్ నిర్ణయాన్ని పక్కనపెట్టి రైల్వే బోర్డు ఇంకో నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వాల్తేరు డివిజన్ కొనసాగిస్తామని చెబుతూ, దానిని ఇకపై 'విశాఖ డివిజన్'గా వ్యవహరిస్తామని వెల్లడించింది.

కుదింపులు.. పొడిగింపులు..: వాల్తేరు రైల్వే డివిజన్ 1893లో ఏర్పాటైంది. దీని పరిధిలో దువ్వాడ-విశాఖపట్నం-పలాస మెయిన్‌లైన్ 213 కిలోమీటర్ల మేర ఉంది. ఆర్‌వీ లైన్‌గా వ్యవహరించే రాయగడ-విజయనగరం-సింగాపురం రోడ్-తేరుబడి మార్గం 137 కిలోమీటర్లు, కేకే లైన్‌గా వ్యవహరించే కొత్తవలస-కిరండూల్ మార్గం పొడవు 446 కిలోమీటర్లు, కేఆర్ లైన్‌గా వ్యవహరించే కొరాపుట్-రాయగడ మార్గం 164 కి.మీ, ఇవి కాకుండా కొత్తవలస-సింహాచలం 22 కి.మీ, బొబ్బిలి-సాలూరు 18కి.మీ, నౌపడ-గుణుపూర్ లైన్ 90 కి.మీ... కలిపి మొత్తం 1,052 కి.మీ. రైల్వే లైన్ వాల్తేరు డివిజన్‌లో ఉంది. ఇందులో కొత్తవలస-కిరండూల్, కూనేరు-తెరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్-కోరాపుట్ జంక్షన్, పర్లాకిమిడి-గుణుపూర్ మార్గాలను...సుమారు 680 కి.మీ. లైన్‌ను తీసుకువెళ్లి కొత్తగా ఒడిశాలో ఏర్పాటుచేసిన రాయగడ డివిజన్‌లో కలిపేశారు. ఇది తూర్పు కోస్తాజోన్‌లో ఉంటుంది. మిగిలిన ప్రాంతాలతో వాల్తేరు డివిజన్ 410 కి.మీ.కు కుదించుకు పోయింది. దీనిని విశాఖపట్నం డివిజన్‌గా వ్యవహరిస్తారు.

విశాఖ డివిజన్‌లో...

- పలాస-విశాఖపట్నం-దువ్వాడ
- కూనేరు-విజయనగరం
- నౌపడ జంక్షన్-పర్లాకిమిడి
- బొబ్బిలి జంక్షన్-సాలూరు
- సింహాచలం నార్త్- దువ్వాడ బైపాస్
- వడ్లపూడి-దువ్వాడ-విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు-జగ్గయ్యపాలెం

కుదించినా.. కలిసి వచ్చే నిర్ణయమే

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో గుంతకల్లు రైల్వే డివిజన్ కొంతమేర కోతకు గురైంది. ఈ డివిజన్‌లోని రాయచూరు-నాల్వార్ రైల్వే సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి (సౌత్ సెంట్రల్) కొత్తగా మారింది. రాయచూరు-నాల్వార్ సెక్షన్‌కు గుంతకల్లు డివిజన్‌లో 107.58 కిలోమీటర్ల లైన్, 12 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. కాగా, గతంలో గుంటూరు రైల్వే డివిజన్, హుబ్లీ డివిజన్ల ఏర్పాటు సందర్భంగా కూడా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత వేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉన్నప్పుడు సికింద్రాబాద్, విజయవాడ తర్వాత పెద్ద విస్తీర్ణం కలిగిన మూడో డివిజన్ ఇదే. జోన్ మార్పు కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపునకు గురైంది. అయినా, కొన్ని ఉపయోగాలు ఉన్నాయి. సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు వల్ల విశాఖపట్టణం-విజయవాడ-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ, ట్రాఫిక్ పెరుగుతుంది. దీని వల్ల రాష్ట్ర రాజధానికి రైళ్లు లేక ఇబ్బందిపడుతున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రయాణికులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు మేలు జరగనుంది. రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మినహా రోజువారీ ఎక్స్‌ప్రెస్‌లు లేక ఇబ్బందులు పడుతున్న సీమ ప్రజలకు కష్టాలు తీరే అవకాశాలు ఉన్నాయి. గతంలో రద్దయిన యశ్వంతపూర్-విజయవాడ పాసింజరుతోపాటు, మరిన్ని రైళ్లు వచ్చే అవకాశం ఉంది.

సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చేయండి

- భీమిలి పరిధిలో గుర్తించేందుకు కమిటీ
- దీనిపై నివేదిక సమర్పించండి: హైకోర్టు
- అధికారుల అలసత్వంపై మండిపాటు



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలి పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకొనే వ్యవహారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంపై హైకోర్టు మండిపడింది. సీఆర్‌జెడ్ అధికారులు మేల్కొని అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని, కఠినంగా వ్యవహరించాలని తేల్చిచెప్పింది. భీమిలి తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించేందుకు ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. నిబద్ధత కలిగిన అధికారుల బృందంలో సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన నివేదికను కోర్టు ముందు ఉంచాలని అధికారులకు స్పష్టం చేసింది. నివేదిక సమర్పించడంలో విఫలమైతే తదుపరి విచారణకు కోర్టు ముందు ఆన్‌లైన్ ద్వారా హాజరుకావాలని ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌లకు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సర్వేను భీమిలి పరిధికే పరిమితం చేస్తున్నామని, ఆ తరువాత భీమిలి బీచ్ నుంచి విశాఖ ఆర్కే బీచ్ వరకు సర్వేకు ఆదేశిస్తామని తెలిపింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జెడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతోపాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల విషయంలో తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా... జీవీఎంసీ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. ఇదే వ్యవహారంపై మరోపిల్ దాఖలు చేసిన గ్రామాభివృద్ధిసేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు తరఫున న్యాయవాది ఎస్.జాయ్, ఏపీసీజెడ్ఎంఏ తరఫున ప్రభుత్వ న్యాయవాది సోమరాజు, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



Your true AI companion has arrived

Retail price of S25 Ultra (512GB)	₹ 141999#
Exchange value of old device	₹ 71000~
Additional upgrade bonus	₹ 9000^
Memory upgrade benefit	₹ 12000~~
Effective price (1 unit)	**₹ 49999***

Also get

Free memory upgrade 256GB to 512GB

₹ 18000** off on Galaxy Watch Ultra

₹ 7000^^ off on Galaxy Buds3 Pro

HDFC BANK | BAJAJ FINSERV | IDFC FIRST Bank | TVS CREDIT | HDB FINANCIAL SERVICES REIMAGINING OPPORTUNITIES | Samsung Finance+™

Pre-order now

Offer valid till Feb 06, 2025

samsung.com

Scan to meet your true AI companion

Or WhatsApp "S25" to 9870 494949 to pre-order at Samsung Exclusive Store

Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267864 for information on e-waste/plastic waste.

Image simulated. Samsung account login may be required for certain AI features. Actual UX/UI may differ. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features. *T&C apply. Offer price shown for 1 unit of Galaxy S25 Ultra 12GB | 512GB inclusive of exchange value of old device, additional upgrade bonus and memory upgrade benefit as detailed further below. Final pricing subject to dealer discretion. #Retail price of 1 unit of Galaxy S25 Ultra 12GB | 512GB. Price inclusive of taxes. ~Approximate value on exchange of 1 unit of Galaxy S24 Ultra 12GB | 512GB. Exchange value varies basis model & condition of old device. Exchange at the sole discretion of dealer. ^Additional upgrade bonus as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. ~~Value of memory upgrade benefit from 256GB to 512GB. Pre-order customers of S25 Ultra 256GB are eligible to benefits of memory upgrade from 256GB to 512GB worth ₹ 12000. **Discount amount of ₹ 18000 applicable only when purchasing 1 unit of Galaxy Watch Ultra together with 1 unit of any variant of Galaxy S25 Ultra. ^^Discount amount of ₹ 7000 applicable only when purchasing 1 unit of Galaxy Buds3 Pro together with 1 unit of any variant of Galaxy S25 Ultra. Offers may be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company.

Cheil-24666/25